ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



1.11.50


4 అణాలు

విషయానుక్రమణిక

1 నవంబరు 1950

ప్రకటన

15-11-50 సంచికనుంచి "పట్నవాసం" అన్న పెద్దకథ సీరియల్‌గా వెలువడుతుంది.




ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతి
4 అణాలు

ప్రతిబుధవారము
ప్రకటింపబడును
Founder: K. NAGESWARA RAO

సంపుటము 43
సంచిక 8

విక్రృతి సంవత్సర ఆశ్వయుజ బహుళ షష్టి బుధవారము



"విలాపనింద"

ఆహారోత్పత్తిమీద కంటే ప్రత్తి, జనపనార పంటలమీదనే మున్షీగారికి మక్కువ ఎక్కువని కొందరి గుసగుసలు.

—'శంకర్స్ వీక్లీ'నుండి.

నేటి ప్రపంచం

శాంతి సాధన యత్నాలు

ఐక్యరాజ్య సమితిలో తిరిగి శాంతిసాధనకు యత్నాల ప్రచారం జరుగుతోంది. మారణాస్త్రాల నిషేధం సైనికబలాల తగ్గింపు, ఏటంశక్తికంట్రోల్ మొదలైన సమస్యల్ని పరిష్కరించడానికి ఉభయపక్షాలా ప్రతిపాదనలు వచ్చాయి.

సమితి ప్రమాణపత్రంపైన సంతకాలు జరిగిన అయిదేళ్ళకి తిరిగి ఇప్పుడు శాంతి సాధనకోసం అగ్రరాజ్యాలు ఏకమై కృషి చెయ్యాలని సమితి సర్వసభ్యసమావేశం తీర్మానించడంలోనే ఉంది.

సమితి రాజకీయసంఘంలో రష్యన్ విదేశాంగమంత్రి వైషిన్‌స్కీ ఏటంకంట్రోల్‌కు పూర్వతీర్మానాన్ని తవ్వి తీశాడు. ఈతీర్మానాన్ని 1947 లో ఆంగ్లో అమెరికన్ వర్గం నిరాకరించింది. అప్పటికి ఏటంరహస్యం ఒక్క అమెరికన్లకే తెలుసును. మిగతా అస్త్రాలపై నిషేధం ఒక రీతిగానూ ఏటంబాంబులపై నిషేధం ఒక రీతిగానూ ఉండాలని అమెరికా అప్పుడు వాదించింది. ఏటంశక్తి అభివృద్ధికార్యక్రమమంతా అంతర్జాతీయసంస్థ ఆధ్వర్యం క్రింద జరగాలని అప్పుడు అమెరికా పట్టుబట్టింది. ఈ అంతర్జాతీయ సంస్థలో అమెరికాకు (ఇప్పుడు సమితిలో ఉన్నట్లే) ప్రాబల్యం పెత్తనం ఉంటాయికాబట్టి అది రష్యాకి ముప్పు. రష్యా అంగీకరించకపోవడంలో ఆశ్చర్యం లేదు.

కాని పరిస్థితి తారుమారు కావడంతో - అంటే రష్యాకి ఈ రహస్యం కాస్తా తెలిసివడంతో - అమెరికా తన పూర్వ కార్యక్రమాన్ని మార్చుకోకతప్పదు. అందువల్ల సమయంచూసి రష్యన్ ప్రతినిధి తన పాత ప్లాన్ తిరగేశాడు. ఇప్పుడా ప్లాన్ చాలా దేశాలకి అంగీకారయోగ్యంగానే కనిపిస్తున్నది.

కాని రష్యన్ ప్రతినిధి అంతటితో ఊరుకోలేదు. మొట్టమొదటిసారి ఏటంబాంబు ప్రయోగించే నాయకుల్ని యుద్ధనేరస్థులుగా పరిగణించాలని చెప్తూ తన ప్లాన్‌కి జోడించింది. వీనిలో అమెరికన్ ప్రతినిధికి తిక్క తలకెక్కిపోయి రష్యన్ ప్లాన్‌ని నిరాకరించాలని ఒక ప్రకటన చేస్తూ అన్ని దేశాలకీ విజ్ఞప్తి చేశాడు. ఈ విజ్ఞప్తి అందుకుని ఆరుదేశాలూ శాంతిసాధన నిమిత్తం కొత్త ప్లాన్ ఒకటి ప్రతిపాదించాయి. ఏటంబాంబులు ప్రయోగించే వారిని మాత్రమే కాదు దురాక్రమణకు దిగిన వారినందరినీ నేరస్థులుగా పరిగణించాలని ఈ ప్లాన్ సూచిస్తున్నది.

యుద్ధాలు, ప్రజలు

ఈ రెండిటిలో మానవ సమాజంపట్ల ఏది పెద్ద నేరమో ఏది చిన్న నేరమో లెక్కగట్టడం నిష్ప్రయోజనం. ఆధునిక కాలంలో యుద్ధాలలో సైనికులకంటె ప్రజలు అధికంగా దుర్మరణంపాలవుతున్నారు. ఎంత సులువుగా ఎంత త్వరలో ఎంతమంది జనాన్ని చంపెయ్యగలగడానికి వీలవుతుంది అనీ, ఎంత దూరాన్నుంచైనాసరే శత్రువుల పట్టణాల్ని ఎంత సులువుగా ధ్వంసం చెయ్యడానికి వీలవుతుంది అనీ లెక్కగట్టి ప్రభుత్వాలు మారణాయుధాల్ని అభివృద్ధిపరుస్తున్నాయి.

రెండో ప్రపంచయుద్ధంలో సైనికబలాలకంటె ఆయుధసంపద బలీయమైనదని అమెరికా నిరూపించింది. ఆసియాలో యుద్ధాలు వస్తే సైనికుల సాహసం అప్రతిహతమని పాశ్చాత్యులకు తెలుసు. ఈ సైనికుల్ని ముఖాముఖి కలుసుకుని స్వయంగా పోరాడే సత్తా అమెరికన్లకి ఫ్రెంచివాళ్ళకి బ్రిటిష్‌వాళ్లకి ఎంత ఉన్నదో రెండో ప్రపంచయుద్ధం తెలియపరచింది. ఈనాడు ఐక్యరాజ్యసమితి సైన్యాలకు అధిపతిగా ఊరేగుతున్న జనరల్ మెకార్థర్ ఫిలిప్పైన్స్‌నుంచి ఎంత సాహసంతో పారిపోగలిగాడో కథలు చెప్పుకుంటారు గాని నిలిచి ఎక్కడ ఏ పాశ్చాత్యసైనికాధిపతి పోరాడినదీ వాళ్లకు చెప్పుకోడానికి కథలు దొరకవు. మృత్యువుముఖాన సాహసించి నిలిచి పోరాడ్డం అనేది పాశ్చాత్యుల చరిత్రలో లేదు. అది జపాన్ దేశీయులకూ భారతీయులకే చెల్లింది.

ప్రజల క్షేమంకోసం యుద్ధం మాని సైనికాధిపతులు ద్వంద్వయుద్ధంచేసి నిర్ణయాలు చేసిన వృత్తాంతాలున్నాయి. యుద్ధాలవల్ల సైనికవీరులకూ ప్రభువులకూ మాత్రమే కాని ప్రజలకు ముప్పు కలగరాదనేది పూర్వసిద్ధాంతం. ప్రజల వోట్లతో ఎన్నుకోబడినప్పటికీ పరిపాలనాకార్యనిర్వహణలో ప్రజలపైన విశ్వాసంలేక పోలీసుబలాన్ని ప్రయోగించే ప్రభుత్వాలు ప్రజల్ని గురించిన ఆలోచన మరిచి యుద్ధాలు సంభవించినప్పుడు ప్రజలకీ పాట్లు తప్పవనే ధోరణిలో ఇప్పుడు వ్యవహారాలు సాగిస్తున్నారు.

ఆసియా దేశాలతో వైరం వచ్చినప్పుడెల్ల ఆయుధబలసంపదపైనే ఆధారపడి సామ్రాజ్యాలు ఆర్జించిన పాశ్చాత్యదేశాలు ఏటంబాంబుల్ని హైడ్రోజన్ బాంబుల్ని తయారుచేసి వానిద్వారా ఆసియా ప్రజల జాతీయవిప్లవబలాన్నికూడా నిరోధించడానికి యత్నించటంలో ఆశ్చర్యం లేదు. కాబట్టి ఏటంబాంబు ప్రయోగించడం దురాక్రమణవంటిదే నని ఆంగ్లో అమెరికన్ వర్గం వాదించడంలో ఆశ్చర్యంలేదు. ఎందువల్లనంటే ఏటంబాంబులవల్ల యుద్ధపరిశ్రమలేకాక ప్రజల భారంకూడా తగ్గుతుంది. సైన్యాల్ని చేర్చడానికి అన్ని దేశాలూ ఆరంభించినట్లయితే యూరప్ అమెరికాలు ఆసియా దేశాలతో పోటీ చెయ్యలేవు.

ఆసియాలో ప్రజల్ని ఆర్థికంగా బలపరిచి వారి స్నేహాన్ని, వారితో వ్యాపా

తమాషా ప్రశ్న

గుడివాడ వెంకటశేషగిరిరావు

★

ఒక చెరువులో కొన్ని తామర పువ్వులున్నాయి. కొన్ని తుమ్మెదలు ఒక్కొక్క పువ్వుమీగ ఒక్కొక్కటిచొప్పున వాలగా పాపం ఒక తుమ్మెదకి పువ్వు లేకపోయింది. అప్పుడు అన్ని తుమ్మెదలూ లేచిపోయి ఒక్కొక్క పువ్వుకి రెండుచొప్పున మళ్లీ వాలాయి. కాని ఈసారి ఒక పువ్వు మిగిలిపోయింది. మొత్తము ఆ తుమ్మెదలెన్ని, పువ్వులెన్ని?

(జవాబు ఈ సంచికలోనే)

రాన్ని ఆర్జించడం అమెరికా పద్ధతి కాదు. వీలైనంతవరకూ మాడ్సి లాంగదీసి అదుపులోకి తెచ్చుకుని ఆసియా జాతీయోద్యమాల్ని తమ అదుపులోకి తెచ్చుకోవడం వారి పద్ధతి. అమెరికన్ విదేశాంగ విధానం అందులో మొదటి నుంచీ ఇదేరీతిగా ఉన్నది. అందువల్ల ఈ జాతీయోద్యమాలు కమ్యూనిస్టుల అదుపులోకి వచ్చినట్లయితే ఆసియాలోని ప్రజల సంఖ్యాధిక్యతను కూడా తగ్గించడానికి అమెరికా సిద్ధంగా ఉండాలి. అందుకు ఏటంబాంబులూ హైడ్రోజన్ బాంబులూ తయారవుతున్నాయి.

ఒక్క విషయంలో రష్యా అమెరికాలకు పూర్తి ఏకీభావం ఉన్నది. మూడో ప్రపంచ యుద్ధం కాని, దానికి ముందు రావలసిన బుల్లియుద్ధాలుగాని తమ దేశంలో మిగతా తమ దేశంలో జరిగివా ఇబ్బంది లేదు. ఈ వ్యూహంలో మొదటి రంగాలన్నీ ఆసియాలోనే.

సమితి భవితవ్యం

ఈ యుద్ధ వ్యూహం మధ్య పడి నలుగుతున్న ఐక్యరాజ్యసమితి భవితవ్యం గురించి ఆశాభావం ప్రకటించడంలో అన్ని దేశాలకూ ఏకాభిప్రాయం ఎప్పుడూ వుంది. శాంతి కోసం తహతహలాడుతున్న మానవకోటికి ఐక్యరాజ్యసమితి ఆశాచిహ్నమని పండిట్ నెహ్రూ అన్నారు. ప్రపంచంలో ఎంతటి మహా సైన్యాలైనా సరే, చిత్తగొట్టెయ్యడానికి కావలసిన కండ చేర్చుకుంటూ తనకు లేని అంగబలాన్ని యూరప్ లో చేకూర్చుకోడానికి యత్నిస్తున్న ట్రూమన్ యుద్ధభయం లేదన్నాడు. యుద్ధానికి సిద్ధం కావడంవల్ల యుద్ధాన్ని నివారించవచ్చునని వారి వాదం. శాంతిని కాపాడ్డానికి రాయబారాలు చాలవుట. దండోపాయం కూడా అవసరమన్నాడు. అది అమెరికా అనుభవం కూడా నని చెప్పాడు.

మానవమూల్యాలలో నేకాని, అధికార దర్పంలో కాని, కాణాచి కోరికల్లో కాని సమితి నీతి లేదన్నాడు ట్రూమన్. కాని అమెరికా విదేశాంగ విధానం చూస్తే సరిగ్గా దీనికి వ్యతిరేకంగా నడుస్తున్నట్లు స్పష్టమే. మానవమూల్యాన్ని పరిగణించేవారు భయానికి లొంగి, జాతీయద్వేషాలకు లోనై వేలూ లక్షలుగా నగరవాసుల్ని మారణహోమం చెయ్యడానికి ఏటంబాంబులు హైడ్రోజన్ బాంబులు తయారు చెయ్యరు. సమితిలో అమెరికా అనుసరిస్తున్న విధానం ప్రత్యేకాధికారం, పెత్తనం. కొరియాలో మరణించిన అమెరికన్ సైనికులు ఐక్యరాజ్య సమితి మనుగడకోసమే ప్రాణాలను త్యాగం చేశారని ట్రూమన్ అన్నంత మాత్రాన ఆసియాలో ప్రజలు నమ్మరు. కొరియాలో ఒకవంక చనిపోయినది అమెరికన్ సైనికులు దక్షిణకొరియన్ సైనికులు. దక్షిణకొరియాలో అస్త్రం ధరించని సామాన్య ప్రజలలో యుద్ధంవల్ల ఎవ్వరూ మరణించలేదు. ఉత్తర కొరియాలో మాత్రమే అమెరికన్ బాంబులకి గురై సామాన్యజనం అధికంగా మరణించారు. వీరు మరణించినది సమితి మనుగడకోసం కాదు. అమెరికన్ ఆయుధబలనిరూపణకు గురై మరణించారు.

స్వాతంత్ర్యం కోరే ప్రజలకు స్వాతంత్ర్యం ఇవ్వగల సంస్థ అనీ, కొత్తగా స్వాతంత్ర్యం ఆర్జించినవారి అభ్యుదయానికి సహాయపడగల సంస్థ అనీ సమితిని గురించి ట్రూమన్ వర్ణించాడు. ఇంతవరకూ ఇండోనీషియా కాని ఇజ్రాయిల్ కాని స్వాతంత్ర్యం సాధించాయంటే స్వబలం పైనే కాని సమితి న్యాయబుద్ధివల్ల కాదు. అదే వుంటే ఇండో చీనా, మలయాలలో ఇంకా రక్తపాతానికీ, ఆసియాలో క్షామాలకీ నివారణ ఏనాడో వచ్చేది.

టిబెట్

టిబెట్ ను "సామ్రాజ్యవాదులు కుట్రదారుల" చేతులనుండి "విముక్తి" పరచడానికి చీనా ప్రభుత్వం తన సైన్యాలను దండయాత్రకు పంపుతూ ఆజ్ఞాపించింది. ఒకవంక శాంతిగా పరిష్కరించుకోడానికి టిబెట్ రాయబారులను పెకింగ్ నగరానికి రావలసినదని చెప్పి ఢిల్లీలో కొంత రాయబారం సాగించి రెండో వంక దండయాత్రకు పెకింగ్ ప్రభుత్వం ఆజ్ఞఇవ్వడంవల్ల భారతప్రభుత్వానికి ఆశ్చర్యం, చింత కలిగినాయి.


టిబెట్ స్వతంత్రప్రపత్తి గురించి ఇదివరలో యుద్ధాలు జరిగాయి. రాయబారాలు, ఒడంబడికలూ జరిగాయి. టిబెట్ గురించి బ్రిటన్ రష్యాలు, బ్రిటన్ చీనాలు ఒడంబడికలు చేసుకున్నాయి. అంటే టిబెట్ ప్రభుత్వానికి వాస్తవంగా స్వతంత్ర ప్రతిపత్తి సిద్ధించిందో లేదో అనుభవించిందో, లేదో తెలియదుగాని, ఆ ప్రభుత్వంతో నిమిత్తంలేకుండా చుట్టూఉన్న ఇతర దేశాలు (పెళ్ళికూతురి అభిప్రాయంతో నిమిత్తంలేకుండా కాబోయే వియ్యంకులు కట్నాలు లాంఛనాలకూ మాట్లాడుకుని పెళ్ళి నిర్ణయించినట్లు) ఒడంబడికలు చేసుకున్నాయంటే ఆ దేశం నైసర్గిక ప్రాధాన్యం బోధపడుతుంది.

సాముద్రికం

గతశతాబ్దంలో ఒక బ్రిటిష్ ఇంజనీరు బ్రిటిష్ ప్రభుత్వం కుట్రకోసం టిబెట్ లో తన ప్రాణాన్ని బలియిచ్చాడు. టిబెట్ లో వెండిగనులూ, వజ్రగనులూ ఉన్నాయనీ ఇంకా అమూల్యమైన ఖనిజ సంపదఉన్నదనీ విశ్వవ్యాప్తంగా చెప్పుకునేవారు. టిబెట్ లో ప్రాబల్యంకోసం బ్రిటిష్ ప్రభుత్వం లెక్కలేనంత ధనం వెచ్చించింది. ఈ ప్రభుత్వం పనుపున ఆ ఇంజనీరు టిబెట్ లో నివాసం ఏర్పరుచుకుని, అక్కడ స్త్రీని వివాహమాడి స్థిరపడ్డాడు. ప్రఖ్యాత సాముద్రికశాస్త్రవేత్త ఒకడు టిబెట్ మాయలేడివంటిదని చెప్తూ ఆ ఇంజనీర్ ను హెచ్చరించాడు. కాని ఇంజనీర్ వినలేదు. తన ప్రభుత్వంకోసం అన్నిటికీ సిద్ధపడ్డాడు. టిబెట్ నివాసిఒకడు ఇంజనీర్ పరిశోధన కనిపెట్టి అతన్ని హత్యచేశాడు. అదేరీతిగా ఇప్పుడు టిబెట్ లో యురేనియం గనులున్నాయని శాస్త్రజ్ఞులు చెప్పగా అక్కడ ప్రాబల్యంకోసం, అమెరికా బ్రిటన్ లు శతథా యత్నించాయి. చీనా రష్యాల సరిహద్దులో ఎత్తుగా ఉన్న ఈ పీఠభూమి తమ వశంలో ఉంటే రష్యాపైన రాకెట్లు ప్రయోగించడం సులువని అమెరికన్ల అభిప్రాయం. అదిగాక యురేనియం తమ చేతికి చిక్కవచ్చును. టిబెట్ తో వ్యాపార పారిశ్రామిక ఒడంబడిక నిమిత్తం అమెరికా బ్రిటన్ లు యత్నించాయనే పాల్ తో ఇంకా బ్రిటన్ల అమెరికాలు రాయబారాలు ఏర్పరుచుకునే యత్నం పోనలేదు. కాని అంతర్జాతీయ వైషమ్యాలకు టిబెట్ గురికాకూడదనే అభిప్రాయంతో భారతప్రభుత్వం టిబెట్ ప్రభుత్వంకూడా, పాశ్చాత్యుల వ్యూహాలను నిరోధించాయి. కనీసం చీనా రష్యా ప్రభుత్వాలు టిబెట్ లో ఖనిజాల్ని కొల్లగొట్టకుండా కాపాడ్డం నిమిత్తం టిబెట్ కు రాజకీయ స్వాతంత్ర్య ప్రతిపత్తి నిప్పించాలని భారతదేశం ద్వారా ప్రయత్నించాయి.

భారతప్రభుత్వం వాస్తవంగా ఇటువంటి పరిష్కారాన్ని కోరివున్నట్లయితే చియాంగ్ ప్రభుత్వం కూలిపోకముందు ఒక ఒడంబడిక చేసుకోవలసింది. కాని అమెరికా బ్రిటన్ల వత్తిడి అధికంగా ఉండడంవల్ల ఈ ప్రమాదాన్ని నివారించడానికి టిబెట్ పై చీనా ప్రభుత్వానికి సామంతాధికారం ఉన్నదని భారత ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పుడు చీనా ప్రభుత్వం ఆ అధికారాన్ని స్థిరపర్చుకోడానికి యత్నిస్తున్నది. [సూర్యనారాయణ]

డిటెక్టివ్ సీరియల్:



5

మాధవరావుదృష్టి మేడ వరండా పైనే ఉంది. దుర్గయ్య పారిపోతాడేమోననే అనుమానం మాధవరావుని గట్టిగా పీడిస్తున్నది కమలమాటలపైన దుర్గయ్యకి మంచి గురి వుంది ఆత్మవిశ్వాసంలేని దుర్గయ్య కమలమాటలు విని పారిపోతే తనకికూడా చిక్కు తప్పదు కమలసంగతి మాధవరావుకి బొత్తిగా బోధపడటంలేదు చిన్నమామ దారుణంగా హత్య కావించబడినప్పటికీ, మొదట సహజంగా భయపడిందిగాని, ఆమె అంతంతా పెద్దమామనుగురించే చిన్నమామ చనిపోయినందుకు విచారంకూడా చూపలేదు

రామచంద్రావు వచ్చాడు అంకరాజు సంగతి అడిగాడు మాధవరావు రామచంద్రావు చెప్పాడు. "నిన్నరాత్రి ఈ ఇంట్లోనే నేనూ ఇద్దరు స్నేహితులూ కూచున్నాం చూడండి ఈ ముందు మెట్లమీద కుర్చీలువేసుకు కూచుంటే అంకరాజు ఇంట్లోకి ఎవరు వచ్చినా వెళ్లినా కనిపిస్తుంది. సరిగ్గా పదకొండు గంటలు దాటిన తరవాత అంకరాజూ సత్యనారాయణ, మరొక పెద్దమనిషీ ఈ ముందుగానే వెళ్లారు. ముగ్గురూ అంకరాజుఇంట్లోకి వెళ్లారు. సత్యనారాయణా, ఆ పెద్దమనిషీ కలిసి మళ్లీ ఒక పావుగంటలో వెళ్లిపోయారు."

"ఏ సత్యనారాయణ?"

"కమల మేనత్తతరఫున దుర్గయ్యగారింటికి కెళ్లిన మనిష్యవర్తి"

"రాత్రి అక్కడే పడుకున్నాడే నేను కూడా చూశానే. ఇక్కడికెల్లా వొచ్చాడు?"

"నేనూ అదే ఆశ్చర్యపడ్డాను ఆ ముగ్గుర్నీ వెంటబెట్టుకుని నిన్నరాత్రి నేనే దుర్గయ్యగారింటికి తీసుకెళ్లాను. నేనూ చూశాను. వరండాలో మహేతమంచంమీద సత్యనారాయణ పడుకోడం అందువల్లే వీళ్ళంతా చేరి ఏదో కుట్ర పన్నుతున్నారని అనుమానం తోచింది ఇద్దరూ వెళ్ళగానే నేను అంకరాజుఇంటికి వెళ్ళి తలుపు తట్టాన. వచ్చి తలుపు తీశాడు. నన్ను చూసి కంగారుపడ్డాడు నేను చెప్పాను దుర్గయ్యగారు ఆయనకోసం ఎదురు చూస్తున్నారని అంకరాజు నన్ను తన ఇంట్లోకి తీసుకెళ్ళాడు. తనకి దుర్గయ్యగారి వ్యాపారం బొత్తిగా పొడుగావుందనీ, తనవాటా పరిష్కారం చేసుకుని వెళ్లిపోవాలని వుందనీ నిన్న ఈ పక్క ఏదో గ్రామం వెళ్ళాడట. అక్కడ భూమి కొనాని కొచ్చిందట. అదికొని వ్యవసాయం పెట్టుకోడానికి ప్రయత్నం చేస్తున్నాట్ట. వ్యాపారం ఎంత త్వరలో విరగడైతే అంత మంచిదన్నాడు. నేనూ నచ్చచెప్పాను. పరిష్కారానికి దుర్గయ్యగారు కూడా సిద్ధంగా ఉన్నాడనీ, తొందరపడుతున్నాడనీకూడా లేపు తప్పకుండా పరిష్కారం చేసుకోవాలని కూడా చెప్పాను. సరేనన్నాడు"

"మరి సత్యనారాయణసంగతి ఏమీ అడగలేదా?"

"లేదు ఈ విషయం దుర్గయ్యగారికి చెప్పాను పొద్దున్నే"

"ఓహో అల్లాగా మరి ఆయన నాతో సత్యనారాయణసంగతి చెప్పలేదే?"

"ఏమో నాకు తెలియదు. కాని ఏ విషయం ఎవరికీ చెప్పవద్దని దుర్గయ్యగారు నాకు పొద్దున్న చెప్పారు నేనెవ్వరికీ చెప్పలేదు ఇందాక కమల వచ్చినప్పుడు నే నన్నాను, ఇదంతా కుట్ర పన్నినట్లు కనపడుతుందని సత్యనారాయణ ఇచ్చిన వాఙ్మూలాన్నిబట్టి నాకు గట్టి అనుమానం కలుగుతోంది ఇదేదో పెద్ద కుట్ర అని"

మాధవరావు ఆలోచించాడు. అంతా చిత్రంగా వుంది సత్యనారాయణసంగతి కమలకూడా తనతో ఎందుకు చెప్పలేదు?

"ఆ మూడో మనిషి ఎవరో మీకు తెలియదా?"

"తెలియదు. చీకట్లో ముఖం కనపడలేదు"

"ఈ విషయాలు నాతో చెప్పమని కమల మీకు చెప్పిందా?"

"అవును చెప్పమన్నది"

"కమల ఇప్పుడెక్కడుంది?"

"ఇప్పుడే వస్తుంది"

"ఈ పక్కమే డెవరిది?"

"ఒక పెద్ద షావుకారుది ఆ యింట్లో మేడమీద ఒక గది అద్దెకిచ్చారు. కొందరు విద్యార్థులుంటున్నారా గదిలో."

కమల రావడానికి అరగంట పట్టింది. రాగానే మాధవరావు అడిగాడు "దుర్గయ్యగారు రాలేదా?"

"ఏరీ లేరే?"

"తీసుకురండి వెంటనే మాట్లాడాలి"

కమల రామచంద్రావుముఖంవంక చూసింది రామచంద్రావు తెల్లబోయాడు.

మాధవరావన్నాడు. "మీరేమీ కంగారుపడ నవసరంలేదు నే నాయన్ను మేడ వరండాలో చూశాను. మీకోసమే చెప్తున్నాను. తీసుకురండి ఆయనతో మాట్లాడాలి. లేకపోతే నేను పోలీసులికి నా

(7 వ పేజీ చూడండి)

చిన్నకథ:



లోకాంతరాలు

అందరి దృష్టులూ 'శార్వరి' వైపు తిరిగాయి ఆమె ఏ సమాధానం ఇస్తుందో అని. ఆమె ఏమీ మాటాడలేదు. తలవంచేసి కూర్చొంది. కొంతసేపంతా నిశ్శబ్దం. శాస్త్రిగారు మళ్లీ ప్రశ్నించారు. "నీకేమిటి అభ్యంతరం చెప్పమ"ని.

నాకళ్ళు ప్రయత్నంగా క్లాసందరివేపూ చూశాయి. ప్రతివానిలోనూ ఎంతో ఉత్సాహం కన్పించింది. విద్యార్థినుల కళ్లుకూడా ఆనందంతో మెరిశాయి. ప్రతీ వారిహృదయం ఆనందరతో నిండిపోయింది. "ఊ!" అని శార్వరి తన అంగీకారం తెల్పడం ఒక్కటే తరవాయి. అందుకే నిశ్శబ్దంగా అందరూ ఆమెవైపే చూస్తున్నారు. 'అల్లాగే' అని శార్వరి ఒప్పుకోవడానికి బదులు ఇంత ఆలస్యం చేస్తుందేమా అనిపించింది నాకు. అవును మరి! 'శార్వరి' ఎన్నో స్టేజిలమీద అద్భుతంగా నాట్యంచేసి విపరీతమైన గౌరవాభిమానాల్ని సంపాదించింది. ఆమె హస్తవిన్యాసాలు, భ్రూకుటి నిక్షేపములూ, శివతాండవదృశ్యములో నామె చూపే లాస్యభంగిమ మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే మధురాతి మధుర ప్రదర్శనాలు కాలేజీలో ఆమె బి. యే. లో చేరినప్పుడే ప్రతీస్టూడెంటూ ఆశించాడామె భరత నాట్యప్రదర్శనం చూడగలనని. ప్రతి కాలేజీ ఫంక్షన్‌కీ యీ విధంగానే తప్పకుంటూంది. అందుకే ప్రతివాని హృదయంలోనూ ఎంతో ఆతురత, ఆకాంక్షా ఎక్కువైపోయాయి. ఆమె కళావిన్యాసాన్ని ఎప్పుడు చూద్దామా అని కాలేజీ లెక్చరర్ల దగ్గిరనుంచి, విద్యార్థి విద్యార్థినీ బృందమంతా కనిపెట్టుకునే ఉన్నారు.

****

శ్రీ పి. సత్యనారాయణశాస్త్రి

****

ఆమెకుగల, కళాప్రతిభ అంతా ఒక యెత్తూ— సాటి విద్యార్థిలోకంలో ఆమెకు గల్గ గౌరవం ఒక యెత్తూ—ప్రతి స్టూడెంటూ ఆమె అంటే ఎంతో గౌరవం చూపిస్తాడు. మరి ఆ మహిమ ఆమె ముఖంలో ఉందో—ఏమో తెలియదు. ఎంత రౌడీ అయినా సరే 'శార్వరి' అంటే ఎంతో గౌరవం చూపిస్తాడు. కాలేజీఅంతా ఆమె కభిమాన పాత్రమే—ఆమె కళా వైదుష్యాన్ని కళ్లారా చూడాలనే కాంక్షతో ఉన్నవారే అందరూను. అందుకే ఆమె సమాధానంకోసం మొత్తం క్లాసంతా నిశ్శబ్దంగా వేచియున్నారు. వచ్చే 'కాలేజీ డే' నాడైనా 'శార్వరి' భరతనాట్యం చేస్తుందేమోనని కాలేజీ 'డ్రమటిక్ ఎసోషియేషన్ ప్రెసిడెంటు' అయిన కాలేజీ తెలుగు ప్రధానాచార్యులు 'శాస్త్రి' గారడిగారు.

"నీ పేరు వెయ్యమంటావా?" అన్నారు మళ్లా శాస్త్రిగారు రెట్టించే ఉత్సాహ కంఠంతో.

శార్వరి నెమ్మదిగా కళ్లెత్తి ఆచార్యుల వైపు చూసి మళ్ళీ దించేసుకుంది. క్లాసంతా ఆమె అంగీకరించిం దనుకున్నారు. కాని తలవంచుకునే సమాధానమిచ్చింది 'వద్దు' ని. అంతా తెల్లబోయాము.

శాస్త్రిగారు పూర్తిగా నిరుత్సాహపడిపోయారు. కొంతసేపు నిశ్శబ్దం.

"కాలేజీలో శక్తిఉన్నవాళ్లుండగా, బోలెడంత డబ్బు ఖర్చుపెట్టి, పైవాళ్లని రప్పించి వినోద ప్రదర్శనాలివ్వడం అంత బాగుండదు." అని శాస్త్రి తూచి తూచి మాట్లాడారు ప్రతీ అక్షరమూను.

"ఇంతకీ నీకేమిటి అభ్యంతరం - చెప్పు?... స్టూడెంట్సు గెలిచేస్తారనా?" అన్నారు లెక్చరరుగారు.

"వారిమీద నాకు విశ్వాసముంది" అంది వెంటనే శార్వరి. ఈ సమాధానానికంతా సంతోషించాము. శార్వరి హృదయ వైశాల్యం మరొక్కమారు ప్రదర్శితమైంది. ఆమె ఎంతగా విద్యార్థుల మనస్సులు దోచుకొంటోందో, అంతగా ఆమె నాట్యము చూడాలనే తీవ్రవాంఛ మాలో ప్రబలమైపోతోంది. మరి ఆమెకు గల అభ్యంతర మేమిటో ఎవళ్లకీ అర్థము కాలేదు. ఆ కారణ మేమిటో తెలుసుకోవాలనే పట్టుదలతో ఉన్నట్లున్నారు. శాస్త్రిగారు, పాఠంమానేసి కారణం చెప్పాలని పట్టుపట్టడంతో శార్వరి కింక కారణం చెప్పక తప్పిందికాదు. తలవంచుకునే చెప్పింది "నా నాట్యప్రదర్శనానికి, ప్రతిఫలం యీయవలసి ఉంటుంద"ని.

శార్వరివద్దనుండి ఇంత నీచ సమాధానం వస్తుందని ఎవ్వరమూ ఊహించలేదు. క్లాసంతా గుసగుసలతో నిండిపోయింది. శాస్త్రిగారొక వేడి నిట్టూర్పు విడిచి ఊరుకున్నారు. ఇంతలో బెల్ కొట్టడం క్లాసు డిస్పర్సు అయిపోవడం జరిగింది-

ఆనాటి సాయంత్రం.

శార్వరి కాలేజీ అవగానే ఇంటికి వెళ్లిపోతోంది. ఆమె వెనకాలే ముగ్గురు స్టూడెంట్సు బయలుదేరారు.

"జాతిగుణాలెక్కడికి పోతాయి" అన్నాడొకడామెకి వినపడేలా.

"ధనమూల మిదం జగత్" మరొకని వ్యాఖ్య.

"అంతే-డబ్బుకి...!" అన్నాడర్థోక్తితో వ్యంగ్యంగా మరొకడు.

అతని మాటలకి ముగ్గురూ పకపకా నవ్వారు. ఆమాటలు విని నాకూ నవ్వు వచ్చింది. ముందు వెళ్లే శార్వరివైపు చూశా. ఆమెకాళ్లుతొట్రు పడుతున్నాయి. కంగారుగా నడుస్తోంది.

"ఇంతోటి కళాప్రదర్శనానికి..." మళ్లీ మొదలెట్టారు వెనకాల వెళ్లే స్టూడెంట్సు.

"నాట్యరాణీ ఓయస్!" అని గట్టిగా అరిచాడు మరొకడు.

అంతే అప్పటినుండీ ఆమెపేరు నాట్యరాణి అని ప్రాకిపోయింది. ఆమెనాట్యప్రదర్శనాన్ని చూడలేకపోయామే అనే బాధ యీవిధంగా అసూయలోకి మారి ఆమె మనస్సు బాధపెట్టడంద్వారా తగ్గించుకున్నారు స్టూడెంట్సు. లేడీ స్టూడెంట్సులో కూడా 'శార్వరి' మీద అసహ్యభావం ప్రబలిపోయిందని ఆచోకీ వచ్చింది ప్రఖ్యాత కాడీ,వీర్రాజుద్వారా. శార్వరి ఎక్కడ కనిపిస్తే అక్కడ విమర్శనలూ, పిల్లికూతలూ ఎక్కువై పోయాయి.

సరే-కాలేజీడే, నిన్నకదూ "నిన్నేం జరిగిందంటే - ప్రైజులూ, అవీ పంచిపెట్టిన తర్వాత అధ్యక్షులైన ప్రిన్సిపాల్ అంత్యోపన్యాసములో "కాలేజీలో శక్తి ఉన్న వ్యక్తులున్నారు. కాని వారికి డబ్బు కావాలిట!...అందుచేత భరతనాట్యం ప్రోగ్రాములోంచి తగ్గించవలసివచ్చింది." అన్నారు. స్టూడెంట్సంతా విపరీతమైన హర్షధ్వానాలు చేసి 'నాట్యరాణి' అని అరిచారు. లేడీసీట్లవేపు చూశా నేను. శార్వరి తలవంచేసింది. ప్రక్కనున్న ఆమె లేడీక్లాస్‌మేట్సు, జేబురుమాలుల చాటున నవ్వుకున్నారు క్రీగంట నామెవైపు చూస్తూ.

కొంతసేపటికి అల్లరి తగ్గింది. నాటక ప్రదర్శనం మొదలెట్టారు. శార్వరిమాత్రం తలవంచుకునే కూర్చుంది. అంతా నాటకంలో మునిగిఉన్నారు. కొంతసేపలాగే కూర్చుని తర్వాత లేచివెళ్లిపోయింది ఆమె. నాటకంహడావిడిలో ఆమె వెళ్లిపోవడాన్ని గుర్తించలేదెవళ్లూ - నేను మాత్రం ఆమె వెళుతూ వెళుతూ జేబురుమాలతో కళ్లనీళ్లు తుడుచుకోవడం చూశా-

ఇదీ శార్వరిసంగతి-ఇంక చెప్పు ఆమె గురించి ఎందుకంత గుచ్చిగుచ్చి అడిగావో అన్నా శర్మ ముఖంలోకి చూస్తూ-

"అయితే విను చెబుతా" అని శర్మ సాగించాడు తన కథనాన్ని సిగరెట్టు ముట్టిస్తూ.

"నిన్ననే అన్నావు కదూ కాలేజీడే-అవును. నిన్నే- ఆమె ఇంటికి వస్తూండగానే రోజూలాగ నవ్వుతూ ప్రశ్నించా "కాలేజీ విశేషాలేమిటి?" అని. ఏమీ లేవన్నట్లు తల అడ్డంగా ఊపి, జేబురుమాలులో ముఖం అవతలివేపుగా దాచుకొని లోపలికి వెళ్ళిపోయింది. రోజూ నవ్వుతూ కబుర్లు చెప్పేది, ఇవాళ ఇల్లా ఉందేమిటా? అనిపించి అరుగుమీదే పచార్లు చేస్తూ తిరుగుతున్నా. ఒక అరగంటలోనే భోజనం పూర్తిచేసేసుకొని వచ్చి, వీధి అరుగుమీద ఉన్న తన స్టడీ రూమ్‌లో కూర్చుంది. క్రీనీడలో నేనున్నాను. నేనామెకి కన్పించటంలేదు. కాని, ఆమె ముఖభంగిమలన్నీ నాకు సుస్పష్టంగా గదిలో టేబిల్ మీద ఉన్న లైటుకాంతివల్ల కనిపిస్తూనేఉన్నాయి. కుర్చీలో కూర్చుని, ఇంటి పైకప్పుకేసి చూస్తూ కొంతసేపుండిపోయింది శార్వరి. ఏదో ఆలోచిస్తూన్న ఆమె నిశ్చలతవైపే చూస్తూ అరుగుమీద నిలబడి ఉన్నా. కొంతసేపటికి ఆమె చెంపలమీద నుంచి కన్నీరు కారుతోంది.

ఆమెలో ఏమీ చలనంలేదు. టేబిల్ మీద బిగ్ బెన్ మాత్రం టిక్ టిక్ మంటూ శబ్దం చేస్తోంది. క్షణక్షణానికీ ఆ కన్నీళ్లు ఎక్కువై పోతున్నాయి. ఇంక నాకు అరుగుమీద ఉండబుద్ధివేయలేదు. వెంటనే ఆమెగదిలోకి వెళ్లి "శార్వరీ!" అన్నా. ఆమెలో ఏమీ చలనంలేదు. "ఎందుకలా ఏడుస్తావ్?" అన్నా బుజ్జగించే కంఠంతో. నావేపు తిరిగి వెంటనే టేబిల్ మీద ముఖం పెట్టుకొని వెక్కి వెక్కి ఏడవసాగింది. ఎంతసేపు అడిగినా ఏమీ సమాధానం చెప్పలేదు.

ఆఖరకి కళ్లనీళ్లు తుడుచుకొని అంది "అవమానంకన్నా చావు మంచిది" అని.

నాకేమీ అర్థంకాలేదు. ఏం జరిగిందో చెప్పమని మరీ మరీ అడిగాను. కొంతసేపు శూన్యంలోకి వెర్రిగా చూస్తూ ఉండిపోయింది. అప్పుడు మొదలెట్టింది.

"మాఅమ్మ పోయేటప్పటికి నాకు రెండేళ్లుంటాయి. అసలు మాఅమ్మ రూపమే నాకు గుర్తులేదు. అప్పటినుండీ, నన్నూ అయిదేళ్ల వయసులో ఉన్న అక్కయ్యనూ కంటి రెప్పల్లా పెంచుకుంటూవచ్చాడు మా నాన్న. ప్రతిరోజూ ఆఫీసునుంచి రాగానే నన్ను ఎత్తుకొని "చిట్టీ బువ్వ తిన్నావామ్మా?" అని అడిగి, అక్కయ్యను ముద్దెట్టుకొని మళ్లీ తను భోజనం చేసేటప్పుడు 'గోరుముద్ద' అంటూ అన్నం పెట్టి పెంచాడు మా నాన్న.

మా నాన్న చిన్నప్పటి స్నేహితులట,

నాకూ అక్కయ్యకూ నాట్యం నేర్పిన మూర్తిగారు. నాకు ఎనిమిదో ఏట అనుకుంటా మాయింటికి వచ్చి, అక్కయ్యనూ నన్నూ చూసి ఎంతో సరదాపడి "భరత నాట్యం నేర్పుతానోయ్ మీ అమ్మాయిలకి" అన్నాడు. నాకు ఎంతో సరదా వేసింది ఆయన నాట్యం చూసినప్పుడు. అందుకు నేనూ నేర్చుకుంటానని ఒప్పుకున్నా అక్కయ్యతోపాటు. కాని నాన్న ఓపట్టాన్న ఒప్పుకోలేదు. ఏదో నాన్నా' ఆయనా గట్టిగా వాదించుకున్నారు. చివర మా నాన్న అన్న ముక్కలే నాకు జ్ఞాపక మున్నాయి "నా చిట్టితల్లుల సంపాదనమీదా నాముసలితనం గడవడం ?" అని.

మూర్తిగారేమైతేనేం పట్టుదలతో ఆయన విద్యంతా మా ఇద్దరికీ నేర్పారు. మొట్టమొదట ఆయనే స్టేజి ఎక్కించి మాకు జరిగిన సన్మానాన్ని కళ్లారా చూసి ఆనందించారు. తర్వాత తర్వాత నాన్న రిటైర్ అవడమూ, మా నాట్యప్రదర్శనాల వల్ల వచ్చిన సొమ్ముతోనే మా సంసారం జరిగిపోతూండటం నువ్వు ఎరిగినదే! రానురాను నాన్నకి డబ్బుమీద లోభత్వం రావడం, నూట పదహార్లకి తక్కువ రాకపోతే మమ్మల్ని స్టేజి ఎక్కనీయక పోవడం జరిగింది. డబ్బులో ఇంత కర్కశత్వం నాకు మనస్సులో ఎంత ఇష్టం లేకపోయినప్పటికీ మా ఆర్థిక పరిస్థితులూ, మానాన్నపై నాకు గల భయభక్తులూ ఆయన్ని కాదనటానికి వీలులేకుండా చేశాయి. నేను కాలేజీలో చేరిన క్రొత్త 'కాలేజీ ఫంక్షన్‌కి నాట్యం చేస్తానని' చెబితే సొమ్మువిషయంలో తాను తృప్తిపడి అంగీకరిస్తేనే కాని నాట్యం చేయడానికి వీలులేదన్నాడు. కాలేజీలో నాట్యానికి డబ్బు తీసుకుంటానని కాలేజీ లెక్చరర్లతో ఎల్లా చెప్పగలను చెప్పు శర్మా ?...అని ఆగిపోయింది హటాత్తుగా.

"ఇంతకీ ఏడవడానికి కారణం ఏమిటి" అని అడిగా శార్వరిని.

"ఏంలేదు–" అని ఇంక నేనెంత ప్రయత్నించినా సమాధానం చెప్పకుండా సంభాషణ తప్పించేసింది. ఇంక ఆమెవల్ల లాభం లేదని. నిన్ను అడిగాను యీ విషయం" అన్నాడు శర్మ.

నేను పరధ్యానంగా ఉండటాన్ని పసిగట్టి కాబోలు ప్రశ్నించాడు "ఏమిటాలోచిస్తున్నా." వని శర్మ.

"స్టూడెంట్సు మన స్తత్వం ఇంతటిది" అన్నా బరువుగా శ్వాస వదులుతూ–

కొంతసేపు శర్మ మాట్లాడలేదు. అప్పుడన్నాడు. "స్టూడెంట్సు మన స్తత్వమే కాదు, కారణం తెలియకుండా వ్యాఖ్యానాలు చెయ్యడం అందరికీ మామూలే! లోకంతీరే అంత" అని—

దాగిన ద్వేషం

(4-వ పేజీ తరువాయి)

స్టేట్‌మెంట్ ఇచ్చేసి వెళ్లిపోతాను. నాకింక మీ కేసుతో సంబంధం ఉండదు."

"అందుకాక్కర్లేదు. ఇప్పుడే మామయ్యని తీసుకొస్తాను."

"అయితే అంకరాజిప్పుడెక్కడున్నాడు? ఆయన్ను కూడా పిలవండి."

సరేనని రామచంద్రరావు వెళ్ళాడు. కొంతసేపట్లో దుర్గయ్యగారొక్కడూ వచ్చాడు. గజగజ వొణికిపోతున్నాడు. మాధవరావుని చూడగానే గుండెలు పట్టుకున్నాడు, నిలబడే ఉన్నాడు.

మాధవరావు కటువుగా అన్నాడు. "చాల్లెండి. ఇంక ఆపండి మీవొణుకు. ఈ నటనంతా ఎవరికోసం? మీ మేలేదో మీరు గ్రహించలేరు?"

దుర్గయ్యవొణుకు ఆగిపోయింది. నోరు తెరుచుకుని చూస్తున్నాడు మాధవరావు వంక.

"ఏం జరిగిందో మీకు పొద్దున్న తెలియదా?"

"తెలియదండి"

"పోనీ మీతలగడకింద కత్తి ఉన్న సంగతి తెలుసా?"

"తెలియదు."

"మీభార్య గదిమారిన సంగతి తెలుసా"

"తెలియదు"

"నావద్ద మీరేమీ దాచవద్దు. మీ వల్ల నిజంగా దోషం లేనిపక్షంలో మిమ్మల్ని కాపాడగలను. నిజం చెప్పండి. రాత్రి జరిగిన సంగతి మీకు బొత్తిగా తెలియదు."

"తెలియదు. ప్రమాణపూర్తిగా చెప్తున్నాను."

"నిద్రలో మీరు చేసివుండవచ్చునని మీకు అనుమానం ఏమైనా వుందా ?"

"నాచేత అటువంటి పని జరగదని నా నమ్మకం ఇన్‌స్పెక్టర్ గారూ. కాని జరగవచ్చునని డాక్టర్లంటున్నారట. నాలో ఆ సత్తా, ఆధైర్యం లేదు.

"మరి ఈ నటనంతా ఎందుకోసం. దీనివల్ల మీపైన నేరం స్థిరపడటం లేదా?"

"అట్లా కాదు. ఎప్పుడో ఏదో ప్రమాదం జరిగితీరుతుందని నాకు అనుమానం గట్టిగా ఉంది. అందువల్ల భయంతో ఈవిధంగా చేస్తున్నాను."

"కాని అది మానండి. అంతేకాదు, మీరే ఈ హత్యచేసినప్పటికీ నిర్భయంగా చెప్పండి. చెయ్యాలని చేసినదైనా చెప్పండి, మీ ప్రాణాన్ని కాపాడే బాధ్యత నాది."

"నేను నిజమే చెప్తున్నాను. నాకేమీ తెలియదు. నేను చెయ్యాలని చెయ్యలేదు. నిద్రలో తెలియకుండానైనా సరే నేను చేశానో లేదో నాకు తెలియదు."

"సరే. కాని పరిస్థితులన్నీ మీకు వ్యతిరేకంగా ఉన్నాయి. మీరు పారిపోకండి. నేరం మీపైనే మోపబడుతున్నది. కాని మీరు జంకవద్దు. మీరు ఇంటివద్దనే ఉండండి. మిమ్మల్ని అరెస్ట్ చేసినా భయపడవద్దు. ఆపైన నేను చూస్తాను. మీరు తెలిసిచెయ్యనిపక్షంలో నేను మిమ్మల్ని తప్పకుండా కాపాడగలనని ధైర్యంగా చెప్పగలను. అయితే ఒక ముఖ్యమైన పనివుంది. అంకరాజుతో వ్యవహారం తగువు లేకుండా పరిష్కారం చేసుకోవాలి. అతనికి కబురు పంపండి నేను మాట్లాడతాను."

గభాలున దుర్గయ్య మాధవరావు కాళ్లపైన పడ్డాడు. రక్షించవలసిందని ప్రార్థించాడు.

అందరూ మౌనంగా కూచున్నారు. రామచంద్రరావు వచ్చాడు. అంకరాజు ఇంట్లో లేడు. ఎక్కడికి వెళ్ళాడో తెలియదు.

దుర్గయ్య ఇంటికి చేరడంతోనే పోలీసులు ఒక వారంట్ అందచేశారు. ఆయన్ని ఆ యింటినుంచి కదలరాదని ఆజ్ఞాపించారు.

తమాషా ప్రశ్నకు జవాబు:—
తుమ్మెదలు 4; పువ్వులు 8.



ఒక చీకటి రాత్రి



భోజనం చేస్తున్నప్పుడు గొణుక్కున్నాం - రాత్రికి సిగరెట్లు లేవు ఎలాగా అని. ఎలాగా అని గొణుక్కోవడమయితే గొణుక్కున్నాం గాని ఇలాగా అని నిర్ణయించుకోడం మటుకు మా చేతకాలేదు.

చివరికి టీ. యస్. ఓ. గారు పడుకుందుకి పోయేవరకూ మాకు ఎలాగో ఉంది. రాత్రి తొమ్మిది గంటలయింది; అప్పటికి నాకూ రామక్రిష్ణారావుకీ మా అవుసరాల గురించి చర్చించుకోడానికి సమయం దొరికింది. పరాయి వూరు వొచ్చాం. నేను యఫ్. ఎస్. ఓని. వాడు కేంపు క్లార్కు.

అవుసరాలంటే మరేం లేవు; తెల్లారి మరో వూరు పోవలసి వచ్చినా, అథవా ఆవూళ్లోనే వున్నా సిగరెట్లు మొట్టమొదటి అవుసరం. ఇక రెండోది - ఆకలికి ఆగలేనివాళ్లమూ, పల్లెటూళ్ల హోటళ్ళకి అలవాటుపడ్డ వాళ్ళమూ అవడంచేత పొద్దున్నే నాలుగిడ్డెన్లూ ఓ కప్పు కాఫీ; అనగా వీటికి డబ్బులు. ఒకటీ డబ్బులేకండా రాదు; మా ఇద్దరిలోనూ ఒకడి దగ్గిరా డబ్బు లేదు.

రేపొద్దున్న అవుసరానికేం గాని, ఇప్పుడు భోంచెయ్యగానే ఎలాగా అని భోంచేస్తున్నప్పుడు మేం బెంబేలు పడ్డమాట వాస్తవమే. కాని టీ. యస్ ఓ గారు భోజనం చేశాక ఏదో అర్జంటు వ్యవహారాలగురించి మాటాడుతూ కూచోబెట్టేయడంవల్ల తొమ్మిదింటివరకూ పస్తున్నాం.

సాయంకాలం నాలుగింటికి "పంతులు గారు" కంపెనీలో సిగరెట్లు పైకితియ్యడం వల్ల టీ యస్. ఓ. గారితోబాటు మాకూ చెరో టీ ఇచ్చుకోవలసి వచ్చింది. రామక్రిష్ణారావు సగంలో కాస్త అవతలికి వెళ్లి దాన్ని ఆర్పి జాగ్రత్తగా జేబులో దాచాడు. ఆ బాపతే యిప్పుడు ముట్టించాడు. మరి నేనప్పుడు మర్యాదాకోసం వాళ్లమధ్యనే ఉండిపోవడంవల్ల అలా చెయ్యలేకపోయాను. ఇప్పుడు ఏమీ లేగు. చికాగ్గావుంది. వెనవదిఅలవాటుపడ్డప్రాణం.

మేం ఉన్నది ఆవూరి ట్రావెలర్స్ బంగళా. టీ. యస్. ఓ గారు పక్కగదిలో నిద్రచెయ్యడానికి వెళ్లిపోయారు.

నేను నెమ్మదిగా లేచి అలమార్లు రెండింట్లోనూ ఎక్కడైనా "సీతారామ ప్రసాదాలు" గాని ఉంటాయేమోనని వెతకడం ప్రారంభించాను. పూర్వం కేంపులకొచ్చినప్పుడు టీ. ఎస్. ఓ గారికి తెలియకుండా గదిలో హాస్కు కొడుతూ అకస్మాత్తుగా ఆయనొచ్చేసరికి గుబుక్కున నోట్లో వున్న సిగరెట్లని అలమారుల్లో పడేసే వాళ్లం. (మా టి. యస్. ఓగారు సిగరెట్ద్వేషులే కాక తత్స్నేహిత, తదిష్ట ద్వేషులు కూడాను; అలాంటప్పుడు ఆయన ఎదురుగా ధూమపానకరణం శ్రేయస్కరం కాదు; సాయంత్రం ఎందుకు కాల్చగలిగామంటే అది కంపెనీలో గనక—) అలా అలమారులో పడవేయబడిన ముక్కల్ని "సీతారామ ప్రసాదాలు" అని పిలుస్తాం. ఆబాపతేమైనా మిగిలున్నాయేమో అని వెతికాను.

నా అదృష్టవశాత్తూ రెండు మువ్వావు ముక్కలూ ఒక అయిదూ బై ఆరోవొంతు సిగరెట్టూ దొరికాయి. కాని ఈ అదృష్టంలో విషాద మేమిటంటే ఆ మూడూ

నిజరు మార్కు వే. నేను వదిలినవి కావన్న మాట.

"ఆఖరికి నీ యెంగిలి గతైందిరా!" అన్నాను.

రామక్రిష్ణ "హాఁ! మన మంటే యేమి టను కున్నావోయ్!" అని నవ్వుతూ అగ్గి పెట్టె అందించాడు.

నేను "జై సీతారామ్!" అన్నాను "సిగరెట్టు" నోట్లో పెట్టుకునే ముందు.

రామక్రిష్ణ నవ్వాడు. "జై సీతారామ్" కాదురా, "సర్వం శ్రీ జగన్నాథం!" అన్నాడు.

"అంటే?"

"అంటే యేమిటి నీబుర్ర కాయ. నువ్వు కాల్చింది మళ్లీ నువ్వే తీస్తే జై సీతారామ్; నేను కాల్చింది తీస్తే శ్రీ జగన్నాథం!"

నేను మొదటి పఫ్ వొదిలి నవ్వాను.

ఇంకా సిగరెట్టు అయిపోలేదు; బయట ఒక మనిషి వచ్చిన అలికిడి అయింది. "ఎవరదీ?" అన్నాడు రామక్రిష్ణ.

గదిలోకి ఒక నడివయస్సులో వున్న నాయుడు ప్రవేశించాడు. లోపలికి వొచ్చీ రావడంతో కాలుస్తున్న చుట్ట ఆర్పి చెవిని పెట్టుకుని "దండాలు బాబయ్యా" అన్నాడు.

"ఏంవొచ్చావ్?" అన్నాడు రామకృష్ణ

"ఏటి నేదు బాబూ – ఉత్తినే నూసి పోదామని" అన్నాడు నాయుడు చిన్న నవ్వుతో.

"చెబుదూ!" అన్నాడు రామకృష్ణ.

వాడు నూటిగా చెప్పలేదు. "తొందరేటి బాబూ! ఆ డెక్కడికి పోతాదు, నక్షలు నాగ తను రుంటుంటే!!" అన్నాడు విలాసంగా నవ్వుతూ.

ఏదో కయ్యం తెచ్చాడనుకున్నాను. కొంచెం భయం వేసింది. నక్షుగాళ్లమే గాని నక్కల్లాగ లేము.

"ఏమిట్రా?" అన్నాడు రామకృష్ణ - నూటిగా చెప్పమన్నట్టు.

ఆ నాయుడు నెమ్మదిగా నాదగ్గిరకొచ్చాడు, నెమ్మదిగా "ఏటి నేదు బాబయ్యా! పంతులు గోరు, పాలిగోడిసేత అత్తోరింటికి ఇయాల రేత్తిరి నాలుగుబత్తాలుపమ్మిస్తండు" అన్నాడు.

రామకృష్ణ నా వేపు ప్రశ్నార్థకంగా చూస్తున్నాడు.

"అయితే యేంటంటావు?" అన్నాను నేను నాయుడుతో.



"—నూత్తారేటి బాబూ: నాలుగు డబ్బులు ఒడ్డిచ్చినన్నా ఒడ్డిచ్చండి గవుర్మెంటోరికొప్పగించనన్నా వొప్పగించండి." అన్నాడు నాయుడు తొందరగా.

"ఏమిటంటాడురా?" అన్నాడు రామక్రిష్ణ.

"చెప్తానుండు-" అని నాయుడువేపు తిరిగి "సరే నువు పోరా!" అన్నాను.

వాడు బుర్రగోక్కుంటూ "బాబూ! ఒడ్డిచ్చేయ్యాల. నన్నో కంటనూడాలి బాబూ!" అన్నాడు. అని చిన్న నవ్వు వెలిగించాడు.

"సరేలే; నువ్వెళ్లు. మళ్లీ ఎప్పుడు వుపిస్తావు?"

"పెందిలి—"

"కాదురా. బళ్ళెన్ని గంటలకి తోల్తారు?-"

"సకం రేతిరప్పుడు."

"అప్పుడో మాటు రా!"

"ఎందుకు బాబు?"

"మాతో రావ్రా?"

"-అమ్మయ్యో; తెల్లారి ఊళ్లో బతకొద్దా బాబు?"

"ఉత్తినే సాయానికి రా! నువు వాళ్లకి కనపడక్లరేదు. ఓపక్కని నిలబడుదుగాని."

"సంపేశినారు బాబూ." అని వాడు వెళ్లిపోయాడు.

"ఏమిట్రా నీ వుద్దేశం?" అన్నాడు రామక్రిష్ణ.

"రాత్రి దార్లో కాద్దాం. బళ్లు ఆపేద్దాం. నాలుగు డబ్బులు లంచం గుంజుకుని వొదిలేద్దాం." అన్నాను నూత్కృంగా.

వాడికి అర్థంకాలేదు. అర్థమయ్యేదాకా బోధపరిచాను. అనక లంచం పుచ్చుకోవడం నీతి గురించి నామీద ఓ ఉపన్యాసం విసిరాడు. నేను దానికి తగ్గట్టుగానే మరో వుపన్యాసం తిరగ్గొట్టాను. దాని ఉద్దేశమేమిటంటే ఈ కలికాలంలో లంచం పుచ్చుకోనివాడు మూర్ఖుడనీ, ఈ డెమోక్రసీలో దేనికి స్వేచ్ఛ లేకపోయినా అన్యాయంగా డబ్బు గుంజుకుందుకి స్వేచ్ఛ వుందనీ, ఈ పరిస్థితుల్లో లంచం పుచ్చుకోకపోతే రేపు

సిగరెట్ల విషయంలో అయితే నేం, ఇడ్లీ కాఫీల విషయంలో అయితే నేం కటికి ఉపోషం ఉండవలసివస్తుందనీ. ఎలాగ యితే నేం వాడిని ఒప్పించాను.

రాత్రి పదకొండు పైగా ఆ య్యాక ఇందాకటి నాయిడు వచ్చాడు. "బాబూ! ఆళ్లు బయిలు దేరతన్రు.'' అన్నాడు.

"ఎన్ని బళ్లురా?''

"రెండు బాబయ్యా!''

రామక్రిష్ణగాడితో "ఒరే అబ్బీ! నువ్విలా బయల్దేరితే లాభంలేదు. కాకీ సూటు నా పెట్లోవుంది. తీసిస్తాను. అది వేసుకోవాలి అన్నాను.

ఇప్పుడెందుకా పటాటోపాలన్నీ? అన్నాడు వాడు, కాని నా వుద్దేశం వేరే వుంది. తత్ ప్రకారం వాడు సూటు వేసుకోవలసి ఉంది.

అయితే, కోటు లేని సూటు మాత్రమే వుంధి. పోనీ ఇదిమాత్రం ఎంతగాదని అదే తొడిగించాను.

ఎంగిలి సిగరెట్లు కూడా లేవు. టార్చి పట్టుకున్నాను. ముగ్గురం బయలుదేరి రోడ్డు పట్టాం. ఊరికి మైలున్నర అవతల కోనేరొకటి ఉంది. ఆగట్టు మధ్య ఒక జువ్వి చెట్టుంది. నాయిడు "నేను సెట్టెక్కిపోతాను బాబూ!'' అన్నాడు భయంగా.

సరిగ్గా పన్నెండింటికి రెండు బళ్లు వొస్తున్న చప్పుడు వినిపించింది. గాఢాంధకారం. ఏం కనిపించదు. టార్చి ఉపయోగించడానికి జంకుగా వుంది. తల పైకెత్తి "ఏంరా, ఏమిటా బళ్ల చప్పుడు?'' అన్నాను.

నాయిడు చెట్టు మీద లేడు. అప్పుడే దిగి నా పక్కకొచ్చేశాడు. మెల్లిగా "అయ్యో బాబూ; గంటల బళ్లు, అల్లరయె." అన్నాడు. నేను హడావిడిగా "ఒరే రామక్రిష్టా; ఇలాంటప్పుడు నువ్వు నాన్ కో ఆపరేషన్ పెట్టావంటే పికాక్కు పేలదు.; నడ్డీ వాచిపోతుంది; ఊళ్ళో అందరికీ తెలిసిపోతుంది.? అన్నాను.

"ఏం చెయ్యమంటావురా?" ,అన్నాడు వాడు.

"ఈ రాతిమీదపోజు పెట్టి నుంచోవాలి. చేతులు రెండూ జేబుల్లో పెట్టాలి. నీ తస్సాచెక్క అప్పుడే చొక్కా ఎంత బైటికి తీశావురా! సరిగా లోపలికి తోయ్. ఊఁ ఈ హేటు తగిలించు." అని వాణ్ణి సరిదిద్ది మేకప్ చేశాను.

"భేష్ అచ్చు మనం అనుకున్నట్టు వొచ్చింది. ఇప్పుడు నిన్ను చూసి టీ. యస్. ఓ అనుకోక పోయినవాడు ఫూలన్నమాట. రైట్; అలాగే నిలబడు. పోజు చెదరకూడదు సుమీ!'

బళ్ల చప్పుడు అవి దగ్గిర కొచ్చినట్టు సూచించింది.

నేను "రైట్!" అని ఓ చేతులో వెదురు కర్రా, మరోచేత్తో టార్చి పట్టుకొని రోడ్డు దగ్గిర కొచ్చేను. ఎక్కడలేని ధైర్యం నన్నావహించింది.

"ఎవర్రా ఆ బళ్లూ?" అన్నాను. గొంతుక కొద్దిగా వణికింది.

"మేం బాబూ; పంతులిగోరి తాలూకు."

"నిలబెట్టు."

"........హూ...హూ...హూ..... హో—ఒరే యెంకా! సెగశ్శ! అప్పుడే తొంగున్నావట్రా?" అన్నాడు బండీవాడు. బళ్లు రెండూ ఆగాయి. నేను దగ్గిరిసా వళ్ళేను. టార్చి వెలిగించాను.

"ఏమిట్రా బళ్ళు?"

"గడ్డి బాబయ్యా!"

"రాత్రి తోల్తున్నారేం?"

"—ఏటి సెయ్యనం బాబూ; పెందిలి కాడొచ్చి పెద్ద పొలం సేను నూర్నాల వొలసకి గడ్డి దెమ్మని పెద్ద పంతులు కవురంపిండు; రాత్తిరిగాక పోతే పొగులెట్టాదో లేది?"

"అయితే గడ్డేనంటావ్."

"అగ్గిపెట్టుందా బాబు?"

"అగ్గిపెట్టె సంగతి తరవాత మూద్దాంలే." అంటూ బండీదగ్గిరగా వెళ్లి చేతులోవున్న కర్రతో బండిమీద ఉన్న గడ్డిని పొడిచాను కొంతవరకు బాగానే వెళ్లింది. అక్కడ గట్టిగా తగిలింది ఆశ్చర్యపడలేదు.

"ఏమిరా, గడ్డిగట్టిగా తగుల్తోందీ?" అన్నాను; టార్చిని వాడి ముఖంమీదికి ఫోకస్ చేస్తూ.

"అయన్నీ మీ కెందుకండె సా!" అన్నాడు వాడు చిరాగ్గా.

"కోప్పడుకురా బాబూ - అదుగో; జువ్వి చెట్టుకింద టీ. యస్. ఓ గారు నిలబడున్నారు. ఆయనకను క్కొమంటేను-;" అని టార్చి రామక్రిష్ణ మీదికి ఫోకస్ చేశాను.

అదృష్టవశాత్తు వాడు పోజు ఘనంగా పెట్టాడు. నేనూ వాడు టీ. యస్. ఓ వే అనుకుందును, తెలీకపోతే.

"ఏటి సేదు బాబూ! గడ్డి బళ్ళే."

"తగ్గరా!- పరవాలేదులే; నిజం చెప్పెయ్. ఆగడ్డి తీసి, బస్తాలు గాబోలు, సేల పడేసి పో."

"ఇః ఇః - బస్తాలేటి బాబూ; గడ్డి బల్లంతుంతే?"

"కబుర్లు చెప్పక పడెయ్యవోయ్!"

వెనక బండీవాడు అకస్మాత్తుగా కలగజేసుకుని "సెప్తుంటేటిది బాబూ!- గడ్డి బల్లండీ యంతుంతే యివ్వ; పడెయ్య-ఎంతుకు బాబు!" అన్నాడు.

నేను స్నేహస్వరంతో - "ఒరే - గడ్డిబండే అయితే ఓమారు విప్పడానికి భయం దేనికిరా?" అన్నాను.

కొంచెంసేపటివరకూ ఎవరూ మాటాడలేదు. ఆనక మొదటి బండీవాడు "తమరెందుకు మచ్చపెట్టాలగాని, పంతులుగోరి బత్తావొకటుంది; ఆళ్లత్తోరింటికి పమ్మిత్తన్రు." అన్నాడు.

"ఒక్క బస్తావా?"

"అవును బాబూ."

"ఒరే - వేషాలు వేసేరంటే మీకూ మీ పంతులికీ కూడా అయిపోతుంది. చెప్పెయి ఆరా, అయిదా? ఎన్ని బస్తాలు?"

మొదటి బండీవాడు దిగి "యెంకా!' అన్నాడు. ఆ వెనక్కివెళ్ళి ఇద్దరూ గుసగుసలాడుకున్నారు. అదయిపోయాక నాదగ్గిర కొచ్చారు. మొదటి బండీవాడు "బాబూ; మరి తమర్తో యెందు కబద్ద మాడాల? నాలుగు బత్తాలున్నయి. ఇప్పుడు మల్లా పంతులు గోరిదగ్గిరి కెల్లలేం - ఇయిగో యీ అయిదు రూపాయల్తోనీ కటాచ్చించాల" అన్నాడు.

నేను ముక్కుమీద వేలు పెట్టుకుని "ఎంతపని? లంచమిస్తార్రా?-అక్కడెవరున్నారో చూసేరూ? టీ. యస్. ఓ గారు! లంచమంటే యింకేమున్నా వుందిరా?" అన్నాను మెల్లిగా.

వాళ్లిద్దరూ ఒకళ్ల తరవాత మరొకళ్లు బతిమాలారు. చివరికి యిరవై రూపాయలకి బేరం చేశాను. కాని వాళ్లదగ్గిర యిరవై లేవు. వెనకబండీవాడు ఊళ్ళోకెళ్లాడు. తిరిగొచ్చి "సరింగా సమయానికి పంతులు గోరింటికాడ నేరు. అబ్బాయి గారితో సెప్పినాను — ఇలా పెమాద మొచ్చినాది యిరవై కావాలంటుండారు అని. అరు తీసిచ్చినారు. ఇయిగో బాబు! నెక్కెట్టుకోండి.'' అన్నాడు - ఇరవై రూపాయలూ ఇస్తూ.

పాపం మళ్ళీ ఊళ్లోకి వెళ్ళడానికి కష్టపడ్డాడు గదా అని ఆ బండీ వాడికి అర్ధరూపాయిచ్చాను. తోటివాడని మొదటి బండీవాడికీ యిచ్చాను. వాళ్లు బళ్లు తోలుకుని వెళ్తున్నారు.

(31-వ పేజీ చూడండి)



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౨౪

"యస్యోత్తుంగతరంగతాడిత వియత్సప్తార్ణవీయంజలమ్
పాదాంగుష్ఠ నఖాగ్రదఘ్న మభవ ద్భూమండలోద్ధారణే
దంష్ట్రాగ్రికోటి కుటీరకోటరగతం త్రైలోక్య మబ్జిందువ
ద్భ్రష్టాహ్నం ఇవ రోమకండనికరో, వందే వరాహం హరిమ్."

వసంతనవరాత్రములు దీక్షతో సుపవసించి శ్రీ రుద్రదేవ మహారాజులు గడిపినారు. ఇన్ని దినములును అన్నమంత్రి తల్లియగు గౌరమయు, పత్నులగు పార్వతీదేవియు లకుమమ్మయు, పుత్రిక యగు బాలయు రాజమందిరముననే విశేషగౌరవముతో పూజింప బడుచు గౌరవింపబడుచున్నారు. వారికి రుయ్యమ్మ సమస్త విధముల నుపచరించుచున్నది. కాని అన్నమంత్రి మాత్రము చెర సాల విడిచిరాలేదు.

దశమినాడు ఉదయమునను, సాయాహ్నమునను శ్రీ మహారాజులు పేరోలగము తీరవలసియుండెను. ఆ యుదయము సభకు పోకముందు, రుద్రమ్మ రుయ్యమ్మను వెంటబెట్టుకొని, అన్నమంత్రి కుటుంబమున కిచ్చిన మందిరమునకు బోయెను. రుయ్యమ్మ గౌరమ్మకు నమస్కరింపగానే ఆమె 'శీఘ్రమేవ కళ్యాణసిద్ధిరస్తు' అని దీవించెను.

వెంటనే రుద్రము యిందుకొనెను.

"అమ్మా, ఇది నా ముద్దుల కుమార్తె. దీనిని నీ కోడలిగా గ్రహింపవలెనని నా యభ్యర్థనము!"

గౌరమ్మ శాంతముగా "అంత మహా భాగ్యమా? అవశ్యము!" అన్నది. వెంటనే రుద్రము చెప్పెను.

"కాకతిసామ్రాజ్యనౌకను కష్టకాలమున మునిగిపోకుండ నిలువబెట్టిన నీ కొడుకు మరల చెరసాలకు పోయి కూర్చున్న కారణ మిప్పుడు తెలిసినదా?"

గౌరమ్మ: "కారణజన్ముడైన మా అన్నయ్యకు చెరసాల వింటి? వానికి జన్మమే చెరసాల!"

రుద్రము: "పెద్దదానివి నీకు తెలియదులే. అటెంతయు మా అల్లుని బెట్టు! వద్దన్న కొలదియు చెరసాలలో పోయి కూర్చుండి వేద పారాయణము చేయుచున్నాడు. ఇప్పుడే తగిన గౌరవముతో కొలువుకూటమునకు రావింతును."

ఇట్లనుచు సల్లాపములతో రుద్రమ్మ యొక్క నిమమ మెచ్చుట నుండెను. జరిగిన తొమ్మిదినాళ్లను కుమారీపూజలు పొందుచున్న బ్రాహ్మణ బాలికలు పలువు రా సమీపమున ఉదకక్ష్వేడిక యను క్రీడ సల్పుచుండిరి. నవరాత్రదీక్ష ముగిసినదికనుక ఈనాడు పిచికారులవంటి గొట్టములతో వారు ఒకరిపై నొకరు వసంతము చల్లుకొనుచుండిరి. వారిలో బాల యున్నది.

బాల రుద్రమ్మను తామున్న మందిరములో చూచినది. వసంతముతో పూరించిన ఉదకక్ష్వేడిక దానిచేతిలో నున్నది. దానితో నది సరాసరి వచ్చి రుద్రమను సమీపించినది. ఇతరులు వారించు వ్యవధానము లేదు. ఆ వసంతము బాల స్వయముగా రుద్రముపై కొట్టినది. వెంటనే రుయ్యమ్మపైనను కొట్టినది.

అది చూచి పార్వతమ్మయు లకుమమ్మయు 'అదేమి యాగడమమ్మా!' అనుచు శీఘ్రగతి వచ్చుచుండిరి.

రుయ్యమ్మ చిరునవ్వు నవ్వినది. రుద్రమకు నవ్వు రాలేదు. మనస్సులో నొక వికార ముదయించినది. కన్నులు చెమరించినవేమోగాని, కోపించినట్లు లేదు. సత్వరమున రుద్రము బాలను చేతులలోనికి తీసికొన్నది.

పార్వతమ్మ: "అమ్మా, తప్పుకాదా, బాలా?"

లకుమమ్మ: "ఎప్పుడైనా, అల్లరిచేయనిదానవు ఈరోజున ఇలా చేసితి వేమమ్మా!"

బాల తెల్లవోయినది. క్రీడోత్సాహముతో నది చేసివేసినది. తల్లు లిద్దరును కోపించుచున్నారు, ఈ నా తిట్లు మాట్లాడుటతో అకస్మికముగా దాని మనస్సు వెనుకాడినది. సాయమమ్మవంక చూచినది. గౌరమ్మ నిశ్చలముగా నున్నది.

రుద్రమ్మ బాలను చేతిలోనికి అదరముతో తీసికొని అన్నది:

"నీకు దీనికై శిక్ష వేయకతప్పదు. ఈ పిల్లను వెంటనే అంటకట్టింపవలెను!"

పార్వతమ్మయు, లకుమమ్మయు వెరుపుతో చూచుచుండిరి.

"పాపము, చిన్నపిల్ల. తెలియక తొందరపడ్డదమ్మా!"

రుయ్యమ్మ అందుకున్నది:

"అమ్మా, నీకీ ఈయులో వసంతోత్సవము చేసిన బాలకు బహూకృతి చేయక శిక్షటమ్మా?"

రుద్రమ్మ: అంటకట్టుట శిక్ష కాదా?"

గౌరమ్మ: ఎవరికి అంటకట్టెద వమ్మా?"

ఆ మాటలతో రుద్రమ్మ హాస్యమాడుచున్నదని అందరకూ తెలిసిపోయినది. "ఇంత అల్లరిదానికి తగినవానికే! ఓర్పుగలవాడు ఉండవద్దూ!"

ఆ మందిరము ఆ స్త్రీజనము నవ్వులతో చిరుగంటల నాదము వలె నిండి ధ్వనించినది.

గౌరమ్మ: "నీ మనుమరాలికి అప్పుడే సంబంధ మాలోచించి నావు కాదనా?"

రుద్రమ్మ: "ఆ! మా తిక్కచమూపతి కుమారుడు!"

అందరు నిర్ఘాంతపోయిరి. తిక్కచమూపతి కుమారు డెవడు?

రుయ్యమ్మ: "మారన!" ఇట్లనుచు ఆ కథ వివరించెను.

గౌరమ్మ: "మొదటిమారు వానిని చూచినప్పటినుండియు నాకదే భావము కలిగినది. అతడు తిక్కచమూపతికుమారుడని తెలిసినందున మరింత సంతోష మగుచున్నది!"

ఏమిటీ యింటి తీరు? అవల ఇంటియల్లు డగు అన్నమంత్రి చెరసాలలో ఉన్నాడు! అతనికిని అతని కూతురుకునుగూడ అతని తల్లి వివాహసంబంధములు నిశ్చయించినది.

బాలకొట్టిన వసంతముతో అంకితమైన వస్త్రములతో డాసి శ్రీ రుద్రదేవమహారాజు లానాడు కొలువుకూటమున కేగిరి. వందిమాగధులు కైవారము లొనర్చిరి. అక్కడ గౌరవాసనముల నుపవిష్టులై యున్న రాజగురువులకును గణపతిదేవ చక్రవర్తులకును నమస్కరించి శ్రీ రుద్రదేవమహారాజు సింహాసన మలంకరించెను.

రాజగురువులకును, గణపతిదేవులకును దప్ప ఆ సభాస్థానమున నున్న తక్కిన యందరకును, పిన్నలకు, పెద్దలకు, వస్త్రములపై వసంతములు చల్లబడిన గుర్తులు కొంచెమో, గొప్పవో ఉన్నవి. ఈనాటి యుత్సవములో జనుల కొక స్వాతంత్ర్య మున్నది. అందును ఆంధ్రరాజు లీ యేడు దిగ్విజయము చేసి యుండిరి కూడ నాయెను! దారిలో నాయకుల కందరకును, అశ్వములపై వచ్చినను, గజములపై వచ్చినను, ఆందోళికలలో వచ్చినను—ఆ వసంత మర్యాద జరిగినది. మహాదేవరాజు తనపై వసంతము చల్లవచ్చు వానిపై కోపముతో తిలకించినందున, ఒక్కసారిగా పదిపండ్రెండు మంది యాతని వసంతముతో ముంచివేసిరి. అతని యుష్ణీషము నుండి పాదములవరకు వసంతము నిండిపోయినది.

సభాప్రారంభమునకు ముందుగనే మహారాజులు మేచయను పిలిచి, అన్నమంత్రీశ్వరులు దోషులేమో యని కలిగిన భ్రాంతి కారణములు వివరించునట్లు చేసి, యాతడు నిర్దోషియని ముందు ఉద్ఘోషింపజేసెను. పిమ్మట కార్యభరణుడగు దామనామాత్యుడు కాకతిసామ్రాజ్యమును కష్టకాలమున నుద్ధరించిన నాకడూడ నాతడే యని రాజాజ్ఞచే ప్రకటించెను. అంతట వెనుకటికంటె నధిక గౌరవములతో నాతని సభాముఖమునకు తోడుకొనివచ్చుటకు మహారాజులు మేచయనాయకులనే నియోగించిరి. అన్నమంత్రియు మేచయతో సభాస్థానమునకు వచ్చెను. ఎట్లు?

"అయిదువన్నె లగొడుగు గర్దగటారి విం
జామరల్ గల్గ భూమిపతికి
గంధవారణ మైదుఘంటలు వులితలా
టంబు ప్రధాన ఘోటకము నమరి
వెలసిన సామంతవిధుల గొల్చెన
నడయాలమే నాయకాగ్రణికిని
అవని మూరురాయర జగదాది గండ
బిరుద జగమ ర్త్య గండర బిరుదకీర్తి
మహితహితుడు మహోత్కృడు మంత్రి యిందు
లూరి యన్నయ విభునకు నరులు సరియె!
"చండ భుజబలుండు సంకెట నారాయ
ణుండు, కలియుగ భీముండు నుతయశుండు
ఘనుడు మండలీక ఘంటాది నాద వి
ఖ్యాతు డిందులూరి యన్నవిభుఁడు" *

ఇంత యార్భాటముగా వందిమాగధుల కైవారములతో అన్నమంత్రి సభాస్థానమునకు వచ్చుచున్నను, ఆతనికిని వసంతమర్యాద తప్పలేదు. దారిపొడవునను ఆబాలగోపాలము ఆనందముతో నాతనిపై వసంతము చల్లి యర్చించిరి. అది యంతయు నాతడు ఆదరముతో శిరసువంచి గ్రహించెను. అతి దాపాదమస్తకము వసంతముతో తడిసి, సాక్షాత్తుగా వసంతమూర్తియై సభాప్రవేశ మొనర్చెను. సభామధ్యమున నాతని కానాడు జరిగిన మర్యాదలు వర్ణించుచు బోయిన మహాగ్రంథ మగును.

కార్యభరణు డానాడు ముందు మహారాజుచే స్వయముగా శిక్షింపవలసిన ద్రోహులవిషయము ప్రస్తావించెను. చేతులకు కాళ్ళకు సంకెలలు తగుల్పబడియున్న రేచర్ల మల్లయరెడ్డిని, మల్రెడ్డిని భటులు మహారాజుల ముందుంచిరి. వీరు కాకతిరాజ్యభారధౌరేయుడగు రేచర్ల రుద్రసేనానివంశజులు. నగరి పెద్దలను బంధించుటకు వసదివారికి మహాసేనలతో నిప్పుడు తోడ్పడిన ద్రోహులు ఇట్టివారిని శిక్షించు టెట్లు? వారి కొరాత్రి యుద్ధములోనైన గాయము లింకను మానలేదు. అట్టి యుత్తమవంశసంభూతు లిట్టి హీనస్థితిలో రాజాస్థానమున ప్రవేశపెట్టుటయే, వారికి తలలు నరికించినకంటె నధికమగు శిక్షగా నుండెను. వారు ఇద్దరును తలలు వంచుకొనిరి.

"ఇక్కడ నిలుచుండబెట్టుటకంటె ద్రోహముచేసిన మమ్ము తలలు తీయింప వేడెదము!"

* శివయోగసారము.

వా రిద్దరు నట్లు కోరుట సభవారికి కష్టమయ్యెను. బుద్ధిమంతులుగూడ ఒక్కొక్క సమయమున భ్రాంతిలో పడిపోవుదురు!

కార్యభరణుడు వారు చేసిన ద్రోహములు వినిపించెను. వా రన్నిటికి నొప్పుకొనిరి. శ్రీ రుద్రదేవమహారాజు పితృపాదుల వంక తిలకించెను. గణపతిదేవులు మాటాడలేదు. కాని వారలవంక కరుణాపాంగవిలోకనము ప్రసరించుచుండిరి. మహారాజు తీర్పు చెప్పెను.

"వీరి కిద్దరకును సంకెలలు వెంటనే తొలిగింపుడు. వీరికున్న సర్వస్వము రాజకోశమునకు చెందును. వీరి కున్న సమస్త పదవులు, మర్యాదలు తీసివేయుచున్నాము. మా కొలువు అర్థించినచో వారి కేదో గతి చూపకపోము. వీరి పితామహాదు లీ సామ్రాజ్యమునకు చేసిన యుపకారము మరచిపోలేము!"

వెంటనే వారికి శృంఖలములు భటులు తొలగించిరి. వారును వినీతులై, "మహారాజుల సేవచేసి మా యపరాధమునకు నిర్వృతి చేసికొన నిశ్చయించితిమి!" అని యర్థించిరి. మహారాజులు త్వరలో తెలిపెదమని వారిని సభనుండి పంపివేసిరి.

కార్యభరణు డంత రాజబంధువగు కోటకేతరాజును మహారాజులముందు నిలువమని కోరెను. అట్లు చేయగా మహారాజు లిట్లనిరి:

"మీరు శత్రువులతో మంతనములు చేసితిరి. కాని ప్రత్యక్షముగా ఏ యకార్యమును చేయలేదు. శత్రుప్రయత్నములు మాకు తెలుపకుండుటయు సామాన్యదోషము కాదు. మీరు మా కెటుయు

చెప్పుకొన నక్కరలేదు. మీ కిక రాజబంధువుల కున్న మర్యాద లుండవని తెలిసికొనవలసినది!"

కోటకేతరాజు శిరస్సువంచి నమస్కరించెను.

కార్యభరణుడు ఆనెగొంది పాలకుడగు రామదేవరాయలు పారిపోయినాడని నివేదించెను. అతడు దొరికినపిమ్మట నాతని శిక్షవిషయ మాలోచింపవచ్చునని మహారాజులు సెలవిచ్చిరి.

అంతలో దౌవారికుడు వచ్చి వీరభద్రేశ్వరులు వచ్చుచున్నారని మహారాజులకు నివేదించి వారి యనుజ్ఞతో నాతని బ్రవేశ పెట్టెను.

వీరభద్రేశ్వరుని దక్షిణ బాహువుపై గాయము మానినది. కాని యా బాహువు సన్నగిలిపోయి నిస్సారమై యున్నది. దౌవారికుడు చెప్పకున్న నీతడు చాళుక్యవీరభద్రేశ్వరుడని సభలో పలువురు గుర్తించియుండరు. అతడు సర్వవిధములా హీనస్థితిలో నున్నాడు. ఇద్దరు భటులు సహాయము చేయనిది యాతడు నిలువలేకున్నాడు. ఆ భటులే యాతనికి కాపుగాకూడ నుండిరి. అతనికి రాజచిహ్నములు లేవు; చక్రవర్తి జామాతృచిహ్నములును లేవు. కేవల మొక సామాన్యయోధునివలె నున్నాడు. అతడు ప్రవేశించుచుండగనే సభ నిశ్శబ్దమయ్యెను.

వీరభద్రేశ్వరుడు వచ్చి రాజగురువులకును, గణపతిదేవులకును రుద్రదేవమహారాజులకును తలవంచి నమస్కరించి నిలువబడెను. మరుక్షణమున నాతనికి సామాన్యమగు నొక సుఖాసనమున గూర్చుండ ననుజ్ఞకాగా నట్లు చేసెను.

శ్రీ రుద్రదేవమహారాజుల కార్యభరణుడగు దామనామాత్యుడు మహారాజుల పక్షమున వ్యవహరించెను.

"గతించిన యాశ్వయుజ శుద్ధదశమినాడు శ్రీ చాళుక్య వీరభద్రేశ్వరులు తమ కనుగ్రహింపబడిన సర్వబిరుదాదికము మహారాజులకు పంపుకొనుచు తాము విరక్తులై సన్యసించు నుద్దేశమున్నట్లు వార్త పంపిరి. సన్న్యాసమునకు ముందు పరిషదనుజ్ఞ యావసరమని వారికి తెలిసియుండు ననుకొందును. వా రేమందురు?"

వీరభద్రేశ్వరుడు చిత్తమని యంగీకరించెను.

దామనామాత్యుడు: "ఇప్పటికిని వారి కీ యిచ్ఛ యున్నచో ఈ పరిషత్సమక్షమున ననుజ్ఞ వేడవచ్చును."

వీరభద్రేశ్వరుడు: నేను విరక్తుడను. నాకు సన్యసింప నీ పరిషత్తు ననుజ్ఞ యీయ వేడుచున్నాను!"

వెంటనే స్మార్తపండితులు "క్షత్రియులు తురీయాశ్రమము స్వీకరించుట శాస్త్ర మంగీకరింపదు!" అని నిష్కర్ష చేసిరి.

వీరభల్లటదేశికు లిట్లు సెలవిచ్చిరి.

"జినదీక్ష పుచ్చుకొన్నవారు ఎవరైనను సన్యసించుటకు మే మంగీకరింతుము."

పలువురు జైనవిద్వాంసు లందు కంగీకరించిరి.

దామనామాత్యుడు: "వీరభద్రేశ్వరులే వారు జినదీక్ష పుచ్చుకొనిరేమో సెలవీయగలరు!"

వీరభద్రేశ్వరుడు : "లేదు!"

రాజగురువులు మాట్లాడదలచినట్లు సూచించిరి. అందరూ నిశ్శబ్దముగా నుండిరి:

"స్మార్తపండితుల నిర్ణయమునకు అపవాదము లుండునేమో గాని, ముందు వీరభద్రేశ్వరులు విరక్తులో కాదో నిర్ణయించుట ముఖ్యము. వారు విరక్తులమని విజయదశమినాడు తెల్పుకొనిరి. ఈ యారునెలలు వారు చేసిన కార్యములు విరక్తులు చేయునవిగనే ఉన్నవా? అన్నాడు వీరు అహింసాప్రతిజ్ఞ చేసినచో నీపాటికి ఏమైయుండువారు?"

మోమోటములేని రాజగురువుల వాక్కులకు ఆ సభ నివ్వెరగందెను. వీరభద్రేశ్వరుడు తలవంచి ప్రత్యుత్తర మిచ్చెను.

"అప్పటి విషయము వేరు. అప్పుడు క్రోధలోభము లట్లు పలికించినవి. ఈనాడు నాకు విరాగము కాక వేరు దిక్కు లేదు!"

రాజగురువు: "మీ రానాడు అధికారము లేకుండ పంపిన సందేశమును, ధర్మదేవత మరియొక రూపమున నింత కఠినముగా మీకు కటాక్షింపనెంచి యుండదగును. మీరు వనప్రస్థవృత్తికి సదృశమైన స్థితికి వచ్చితిరని మీ ప్రవర్తనచే నిరూపింప నీ పరిషత్తు ఆరునెలలు గడువీయ గలదు!"

పండితులు 'తథాస్తు!' అనిరి.

వీరభద్రేశ్వరుడు మహాప్రసాద మనెను. మరల విశ్వేశ్వర శంభుదేశికులు సెలవిచ్చిరి.

"మీ కిప్పుడు పుత్రులు లేరు. మీ దౌహిత్రులగు శ్రీ ప్రతాపరుద్రకుమారులను మీ పుత్రులుగా దత్తస్వీకారము చేసికొనుట కంగీకరించునెడల, ఇప్పుడు మీరు వనప్రస్థవృత్తికి అధికారము సంపాదింప నిజముగా యత్నింతురని ఈ పరిషత్తుముందు కొంత విశ్వసింపగలదు!"

వెంటనే వీరభద్రేశ్వరుడు వినీతుడై పరిషదాదేశము శిరసావహించెను. మంగళతూర్యపంచకము మ్రోసెను. వజ్రకంఠికాది సర్వాలంకారములతో నలంకృతుడగు శ్రీ ప్రతాపరుద్రకుమారుని మాచల్దేవిపురస్సరముగా కన్యకలు సభాస్థానమునకు దెచ్చిరి. గణపతిదేవ చక్రవర్తి ఆనందపారవశ్యముతో నోట మాటలేక తిలకించుచుండెను. పరిషదనుజ్ఞతో మహాదేవరాజు లేచి, ప్రతాపరుద్రకుమారుని చేతుల నందుకొని, తాంబూల ఫలపురస్సరముగా నాతని వీరభద్రరాజుచేతుల నుంచగా, నాతడు స్వీకరించెను. జయజయ నినాదములు మ్రోసెను. భూసురుల యాశీర్వచనములు చెలంగెను. విద్యానాథుడను యువకవి యిట్లు వర్ణించెను.

"శార్ఙ్గోష్మ నిరవగ్రహః ప్రతినృపాస్స ర్వేపి నమ్రీకృతాః
పాతివ్రత్యముపైతి భూరియమయం నాథస్వయంభూశ్శివః
ధీరోయం యువరాజ ఏవ వహతి శ్రీ వీరరుద్రో ధురం
సర్వామిత్యనుమోదతే ప్రతికలం శ్రీ కాకతీంద్రో నృపః!"

శ్రీ రుద్రదేవమహారాజు ప్రతాపరుద్ర కుమారుని దన యంకస్థలి జేర్చుకొని యాదరించెను. పెద్ద లందరు నాశీర్వచనపురస్సరముగా నక్షతలు కుమారుని శిరస్సుపై నుంచిరి. వీరభల్లట దేశికులును వీరభద్రేశ్వరులునుగూడ తమ యక్షతలు కుమారుని శిరస్సున శ్రద్ధగా నుంచిరి.

ఇంతవరకు నిశ్శబ్దముగా నున్న గణపతిదేవ చక్రవర్తి యిప్పుడు ఆనందముతో గద్గదమగు కంఠముతో మాటాడెను.

"వెనుక మేము శ్రీ రాజగురువుల యాజ్ఞ శిరోధార్యముగా శిరసావహించి శ్రీ రుద్రదేవమహారాజులను యౌవరాజ్యమునకు అభిషేకింప నిశ్చయించినపుడు, ఆ నిర్ణయము ధర్మేతరమని సందేహించిన వారి సంశయములు ఇప్పటికి తీరినవని విశ్వసింతును!" ఇట్లనుచు చక్రవర్తి తన దృష్టి వీరభల్లటదేశికులపై బరపెను.

వెంటనే వీరభల్లట దేశికులు సభలో లేచి, సర్వాత్మనా తన యంగీకారము తెలిపెను. ధర్మనిశ్చలుడగు నాతనికి ముందు కలిగినదియు ధర్మసందేహమే కాని పక్షపాతకృతము కాదు. అతడును అతనితోపాటు పలువురు జైనపండితులును రాజశత్రువుల చర్యలతో నెట్టి జోక్యమును కలిగించుకొనలేదు. వారలను రాజభటులుకూడ నెట్టి యలజడియు పెట్టియుండలేదు.

చక్రవర్తి ప్రసాదదృష్టితో సభను తిలకించుచుండెను.

(34 వ పేజీ చూడండి)

క్యూ



సంఘం అనేది ఒక పెద్ద యంత్రశాల. యంత్రశాలలో రక రకాల యంత్రాలు ఉంటాయి కొన్ని మానవాభ్యుదయానికి తోడ్పడేవి - మరికొన్ని మానవ పతనానికి దారి తీసేవి - మానవులు ఈ యంత్రాలలోని మరలు - హోదాను, ప్రతిపత్తినిబట్టి పెద్దవిగాను, చిన్నవిగాను ఉండడం అతి సహజం - కాని అసలు మరలు లేకుండా యంత్రమే ఉండదు. ఒక మర చెడిపోతే దాని స్థానాన్ని ఒక కొత్త మర తీసుకుంటుంది. అప్పుడు చెడిపోయిన మరకు ఎట్టి విలువా ఉండదు. నిలువలో మరలు ఎక్కువగా ఉంటే మరల విలువ తగ్గిపోతుంది సముచితస్థానంకోసం, మరలు ఒకదానితో ఇంకొకటి పోటీపడవలసివస్తుంది పోటీలో గెలుపొందిన మరకు మాత్రమే యంత్రంలో తగిన స్థానం లభిస్తుంది ఇక తక్కిన మరలు అవకాశంకోసం నిరీక్షించాల్సి ఉంటుంది. అవకాశం ఎప్పుడు దొరుకుతుందో ఏమో చెప్పలేము. కాని అవకాశం ఏనాటికైనా రాకపోదనే ఆశతో మరలు, తమ తమ chance కోసం ఎదురుచూడక తప్పదు ఎదురుచూడకపోతే ఆ అవకాశం తరువాతి మరకు దొరుకుతుంది అప్పుడు విచారించి ఏమీ లాభం ఉండదు. ఇదే మన జీవిత రహస్యం

ఒక రోజు లేచీ లేవడంతోనే నాకు బాగా ఆకలివేసింది కాలకృత్యాలు తీర్చుకుని ఆత్మారాముడిని సంతృప్తిపరచడంకోసం, కాఫీ దేవాలయం వైపు బయల్దేరాను ప్రధానార్చకుడు గుమాస్తానికి ఎదురుగా ఒక టేబుల్ దగ్గర కుర్చీలో కనబడ్డాడు - కైంకర్యానంతరం అతనికి దక్షిణ సమర్పించిగాని, మనం బయటపడడానికి వీలులేదు ఆనాడు దేవాలయంలో భక్తులు క్రిక్కిరిసి ఉన్నారు ఎక్కడా కూర్చోవడానికి కూడా చోటులేదు ప్రధానార్చకుడిని చోటుకోసం అడిగితే, మహాభక్తులంతా అన్నపూర్ణాదేవికటాక్షం కోసం ఎంతోకాలంనించి, ఏకాగ్రతతో "క్యూ" లో నిలబడి ఉన్నారనీ, "మీరు" కూడా శ్రద్ధాళువులై నిలబడక తప్పదని సెలవిచ్చారు భారతావనిపై అన్నపూర్ణాదేవి కటాక్ష వీక్షణం తొలగిపోయిన రోజులివి అర్చకుడిసూచనను త్రోసివేస్తే, పాదచారులమై ఇంకొక దేవాలయానికి వెళ్ళవలసి ఉంటుందని, ఏ దేవాలయంలోనైనా భక్తుల సంఖ్య ఇంతకంటె తక్కువేమీ ఉండదని మొండికేసి వడితే మనం యిడ్లీ, టీ, కాఫీ గతప్రాణులంగనక అసలు తీర్థప్రసాదాలకే మోసం రావచ్చునని చేసేదేమీలేక ఆ"క్యూ"లో నిలబడ్డాను. సెకండ్లు నిమిషాలుగా మారుతున్నాయి.

"మురళి"

కాలచక్రం మహావేగంగా ముందుకు పరిగెడుతున్నది ఆలస్యంగా వచ్చినా, కొందరు దౌర్జన్యంచేసి "క్యూ" లో ముందుకు తోసుకొని వెడుతున్నారు కాని "క్యూ" ముందుకు సాగేలక్షణమేమీ కనబడదు స్వార్థపరులు ప్రగతిని అడ్డగిస్తున్నారు. చివరికి వారిస్వార్థమే వారిని బెడిసికొడుతుంది. అదిఏనాటికైనాతప్పదు. కాంగ్రెస్‌లో కొంతకాలం పనిచేసి, సత్యాహింసల్ని అలవరచుకున్నాను. కనక ముందుకు తోసుకొని వెళ్ళడానికి, దౌర్జన్యరూపేణా నేను సాహసించలేకపోయాను దౌర్జన్యానికి ఆక్షేపణ సూచకంగా 'క్యూ' లోంచి తప్పుకుందామనుకున్నాను. కాని ఇంట్లో ఇల్లాలు లేకపోవడంవల్ల వెనుకంజ వేయవలసివచ్చింది.

ఒకతను 'క్యూ' విడిచి అన్యాయంగా ముందుకు తోసుకొని వెడుతుంటే చూడండి అతను ఎంత దౌర్జన్యం చేస్తున్నాడో!' అని పక్కనున్న మనిషితో అన్నాను.

"ఎవరి దౌర్జన్యం వాళ్లనే బెడిసికొడుతుంది" అని నాపక్కనున్న మనిషి సమాధానం చెప్పాడు

మనది ఆధ్యాత్మికదేశంగనక దౌర్జన్యం జరిగినా చూచీ చూడనట్లు నలుగురితోపాటు నేనూ మౌనం వహించాను

తరువాత తీర్థ ప్రసాదాలు పుచ్చుకొని దేవాలయంలోనించి బయటపడ్డాను. అప్పటికే తొమ్మిది దాటింది. ఆనాటికి ఇక భోజనానికి జలాంజలులు వదిలి దుస్తులు వేసుకొని ఆఫీసుకు బయల్దేరాను.

* * * *

హైద్రాబాద్ ఒక పెద్ద నగరం-దానిని city of distanese అంటారు ఒక మూల మాయిల్లు ఉంటే, ఇంకొకమూల ఆఫీసువుంది నడిచి వెళ్ళడానికి అధమం ఒక గంట పడుతుంది భోజనం లేక అప్పటికే శరీరం నీరసంగా ఉంది ఆఫీసుకు నడిచివెడితే, కోపవచ్చి దారిలో పడిపోతానేమో నసే భయంవేసి, మాయింటి పక్కనేఉన్న Bus stand దగ్గర ఆగిపోయినాను నా ఖర్మంకాలి, ఆరోజు అక్కడకూడా ఒక "క్యూ" ప్రత్యక్షమైంది. "క్యూ"లో వందకుపైగా జనం ఉన్నారు. రంగురంగుల దుస్తులతో, వంకరటింకరగా "క్యూ"చూడ ముచ్చటగా ఉంది 'క్యూ'లో నిలబడడం కొందరికి నామోషీ—అందువల్ల వారు తామరాకుపై నీటిబొట్టువలె, "క్యూ"కి అందకుండా, ముందుకో, వెనక్కో నిలబడుతారు. సుశిక్షితంగా మెలగడం వారికి గిట్టదు. అలా ఎందుకు నిలబడ్డారని వారిని అడిగేవారెవ్వరూ ఉండరు. భారతావని ప్రజాస్వామికదేశం - సమావేశ ఉపన్యాస స్వాతంత్ర్యాలవలె, వారికి ఎక్కడబడితే అక్కడ నిలబడడానికి హక్కువుంది. "కాదంటే" మనం వారి స్వాతంత్ర్యాన్ని అపహరించినవాళ్ళ మవుతాము—

(19-వ పేజీ చూడండి)

కథానిక:

రాముడు జైల్లోనించి బయటికి వచ్చేటప్పుడు, "నువ్వు యెక్కడికి వెళ్లా లనుకుంటున్నావ్?" అని జైలరు అడిగాడు.

రాముడు యింతవరకు యీ విషయాన్ని గురించి ఆలోచించనేలేదు. వాడిది షహాబాదు జిల్లా. వాళ్ల వూళ్లో దాదాపు అందరూ అగ్రవర్ణస్థులే! వాడు బ్రాహ్మణవిధవయింట్లో

బర్ఖాసా



చోరీ చేశాడు. చోరీసొత్తు తిప్పి తిప్పిచూసినా, నాలుగు తంగాలకైనా ఖరించదు. యీ కొద్దికే పన్నెండు మాసాలు శిక్ష వేశారు. పైగా కఠినశిక్ష. ఇంటికి చేరితే అగ్రవర్ణాలవారు వొకందాన వూరుకుంటారా? వూళ్లో అడుగుపెట్టగానే మళ్లీ పంచాయతీ కూడుతుంది. న్యాయం పేరిట పెద్ద తతంగం జరిపితీర్పు చెపుతారు. 'యాభై చెప్పు దెబ్బలు, పైన పంచాయతీదార్ల మామూలు!' ఇవన్నీ జరిగినాకకూడా, తనమానాన తనని బతకనిస్తారా? అయినదానికీ, కానిదానికీ వేలెత్తిచూపుతారు. వూళ్లో తనలాంటివాళ్లకి కరువు లేదు. కాని తనుచేసిన నేరం రుజువయింది, శిక్ష అనుభవించి వచ్చాడు. అదీగాక తను కటికిబీదవాడు. వూళ్లో తనకంటె పెద్ద పెద్ద నేరాలు చేసినవాళ్లు, చేసేవాళ్లు చాలామంది వున్నారు. వాళ్ల గుట్టు మట్టంతా తనకి తెలుసు. జమీందారుగారి పురోహితుడు వొక

మూలం: శ్రీ త్రివేణీప్రసాద్ - అనువాదం: శ్రీ నన్నపనేని సుబ్బారావు

మాదిగదాన్ని మరిగాడు; నిత్య జపతపాలు చేసే శాస్త్రిగారు కలకత్తాలో ముండని పెట్టాడు. సింగు బందిపోటుజట్టుకి నాయకుడు, యిక జమీందారుగారు సరేసరి. వారు చేసే ఘోరాలకి అంతు లేదు. కాని వాళ్లని వేలెత్తి చూపటానికి యెవరికి దమ్ములున్నవి? అందరూ చూసీ చూడనట్లు వూరుకోటానికి కారణం వారి నేరాలు రుజువుకావని కాదు! వాళ్ల యిళ్లల్లో డబ్బు మూలుగుతూవుంది. వారంతా గ్రామంలో జరిగే నేరాలువిచారించి శిక్షించే పంచాయతీసభ్యులు! ఇక అలాంటి తావులో తను యెలా బతుకుతాడు?

రాముడు మౌనంగా వుండటం చూసి, జైలరు మళ్లీఅడిగాడు.

"అలహాబాదు వెళ్తానుబాబూ!" అన్నాడు రాముడు.

"అలహాబాదా? నీ యిల్లు ఆరాలో వుండికదూ?"

"అవును బాబూ- అలహాబాదే వెళ్లాలిబాబూ."

"దేనికి?"

"యింటిదగ్గర యేముంది. బాబూ అక్కడే యేదైనా నౌకరీ చేసుకుని పొట్ట పోసుకుంటాను."

జైలరు యిక యేమీ ప్రశ్నించలేదు. వాడి వేళ్లముద్రలు తీసుకుని, కొంత డబ్బు లెక్కపెట్టి యిచ్చాడు. తర్వాత సిపాయిని పిలిచి, వాడిని బయటికి పంపించమన్నాడు.

రాముడు జైలు గోడలు దాటివచ్చి స్వేచ్ఛావాయువులు పీల్చాడు.

వాడు ఆ సాయంత్రమే అలహాబాదు రైలు యెక్కాడు.

౨

రాముడు అలహాబాదు వచ్చిన వుద్దేశ్యం వేరు! ఇక్కడ కుంభమేలా జరుగుతూంది. దూరదూరాన్నించి యాత్రికులు వస్తారు. వారిలో కూర్చుని లేవలేని వట్టి చవటరకం లక్షాధికార్లుకూడా వుంటారు. వీలుగా వుంటే, వొక ఛాన్సు చూడవచ్చు! చేతి దెబ్బ కొట్టటంలో దిట్ట!

రోడ్డుమీద పూరీలు కొనుక్కుతిని, సంగమంవేపు బయలుదేరాడు. వాడి మనస్సు చాలా సంతోషంగా వుంది. మంచి శకునంకూడా అయింది. ఇవాళ మంచి మొత్తం దొరుకుతుం దనుకున్నాడు. వాడు చౌకుకి వెళ్ళే రోడ్డున పోతున్నాడు. ధనవంతులు యీదారినె వస్తూ పోతుంటారు.

కాని ఇవాళ రోడ్డుమీద జనసమ్మర్దం లేదు. అసలు కుంభస్నానం చేసేవాళ్లు చౌకుకి దేనికి వెళ్తారు? పనిపాట లున్న వాళ్లు సైకిళ్లమీదా, టాంగాలమీదా, కార్లమీదా పోతున్నారు. యీదారిని బయలుదేరినందుకు కొంచెం పశ్చాత్తాపపడ్డాడు; కాని చాలా దూరం సాగివచ్చాడు. శుభశకునసంగతి గుర్తుకొచ్చి, కొంచెం మనస్సు తేలికపడింది. గాలిమేడలు కట్టుకుంటూ, కాలు సాగించి పోతున్నాడు. ఇంతలో పక్కన పెద్దచప్పుడు అయింది; అటు తిరిగిచూశాడు. వొక సైకిలు మోటారుకి కొట్టుకుంది. మోటారువాడు వొకే పోకడ పోతున్నాడు! సైకిలుమీదనుంచి పడ్డ వ్యక్తి తెలివి తప్పి రోడ్డుమీద పడిపోయాడు. రాముడి హృదయంలో యేదో అచేతనప్రేరణ కలిగింది. పరుగెత్తుకుంటూ అతనివద్దకి వెళ్లాడు. నడికారుమనిషి; నలభై సంవత్సరాలు వుంటవి. తలకి బాగా దెబ్బ తగిలింది. నెత్తురు కారుతూవుంది. కోటు, పాంటు బదాబద లయినై; హాటు, మనీ బాగ్ పక్కన పడివున్నవి. బాగ్ బటన్లు వూడి, లోపలినుంచి నోట్లు బయటికి తొంగిచూస్తున్నవి. రాముడు ముద్దుడై ఆబాగ్ చేతిలోకి తీసుకున్నాడు. కాని కొన్ని క్షణాలు అలానే నిలబడిపోయి, చివరికి బాగ్ అతని పాంట్ జేబులో పెట్టివేశాడు. తర్వాత ఖాళీగా వచ్చే టాంగా ఆపి, సైకిలుని, అతన్ని టాంగాలో యెక్కించి, దగ్గర్లోవున్న ఆస్పత్రికి పోనివ్వమన్నాడు టాంగాని.

రాముడు బాబుని డాక్టర్లకి వప్పగింత పెట్టి, టాంగావాడికి తన జేబులోవున్న డబ్బునిచ్చి, అక్కడినించి వెళ్ళిపోయాడు.

కుంభమేలావద్దకి పోదామని బయలుదేరాడు. దారిలో హస్తలాఘవం చూపించటానికి చాలాసార్లు అవకాశం దొరికింది. కాని ఇవాళ యెందుకనో కాలూ, చెయ్యీ ఆడటంలేదు. వుండి వుండి తనమీద తనకే చిరాకు కలుగుతూవుంది. కారణం యేమిటో అర్థంకాకుండావుంది. ఇవాళ వాడి మనస్సు యేదో వొకవిధంగా వుంది. మనసులో ఇంత వుద్వేగం యెన్నడూ కలగలేదు. చేతిదెబ్బలో దిట్ట అనిపించుకున్న తను ఇవాళ....

పొద్దు గుంకే వేళకి రాముడు మళ్లీ ఆస్పత్రికి బయలుదేరాడు. ఆస్పత్రిలోకి వెళ్ళి విచారించి బాబుపక్క దగ్గరికి చేరుకున్నాడు. వారికి అనుకున్నంత దెబ్బ తగిలినట్టు లేదు. తెలివిలోనే వున్నారు. వారి భార్యా పిల్లలు అక్కడికి వచ్చారు. యీ దుర్ఘటన నించి బయటపడినందుకు అందరూ మహాసంతోషంగా వున్నారు. ఆ బాబు రాముణ్ణి చూసి, రెండు చేతులూ యెత్తి నమస్కరించాడు— వాడేదో గొప్పవ్యక్తి అయినట్టు రాముడి మనస్సులో ఆత్మప్రశంసాభావం తళుకెత్తింది. కాని వెంటనే గతజీవితం గుర్తుకొచ్చి, ఆ భావం తేలిపోయింది. ఆ బాబుగారి అదృష్టం కాని వారిని నేను కాపాడింది యేముంది? ఎందుకో ఆ సమయాన నేను మంచి గుణంలో వున్నాను. లేకపోతే యీ శ్రమంతా ఎవడు చేసేవాడు? ఆ బాగ్ ఆయనజేబులోకి యెందుకు పోయేది? రాముడు ఇలా ఆలోచనలో వున్నాడు.

ఆ బాబు తన భార్యతో—"వీరే నా ప్రాణాలు కాపాడింది. సమయానికి వీరు లేకపోతే, నాగతి యేమయ్యేదో? బాగ్ లో పదివేల కరెన్సీనోట్లు వున్నవి. మన పాలిటి పెన్నిధిలాగా వీరు లేకపోతే మన కొంప దివాళాతీసేదే" అని చెప్పారు.

ఆమె సంతోషంతో, కుతూహలంతో రాముడివంక చూసింది. మోకాళ్లదాకా పంచకట్టి, చొక్కా తొడుక్కున్నాడు. కాళ్లకి చెప్పులు లేవు. గడ్డం బాగా పెరిగివుంది. మీసాలు దట్టంగా చిక్కురు బొక్కురుగా వున్నవి. చాలారోజులనించి తైలసంస్కారం లేకపోవటంవల్ల, తల వెంట్రుకలు నిక్కబొడుచుకునివున్నవి. నల్లగా వున్నాడు. రాత్రిపూటచూస్తే దెయ్యం అనుకోవలసిందే. ఆ తీక్ష్ణమైన నేత్రాలు రెండూ విచిత్రంగా వున్నవి. పెద్దమనుషుల నేత్రాలు యిలా వుండవు. ఆమె యిలానే రాముణ్ణిగురించి వూహించుకుంటూవుంది. రాముడు స్వార్థచింతతో— బక్షీషుకోసం వచ్చాడేమో నను కుని పర్సుతీసి అయిదు రూపాయల నోటు యివ్వబోయింది.

కాని రాముడు స్వార్థచింతతో రాలేదు. వాడికి దెబ్బలు తగిలిన వ్యక్తిమీద జాలికలిగి సానుభూతితో చూసి పోదామనివచ్చాడు. ఇవాళ ఇలాంటినోట్సు యెన్ని వదిలివేయలేదు? నోటువంక చూడబుద్ధి వేయలేదు. వాడు ఆమెకి చేతులెత్తి నమస్కరించాడు. ఆమె తన పొరపాటు గ్రహించి సిగ్గుపడింది. నోట్లు పది రూపాయలవి, వంద రూపాయలవి కూడా వున్నవి. కాని వాటిని ఆమె బయటికి తీయటానికి సాహసించలేకపోయింది. బాబుకుకూడా అయిదురూపాయల నోటు యివ్వబోవటం బాగుండలేదు. వారు యీ పొరపాటును సరిదిద్దుకునే వుద్దేశంతో— "భాయీ! మీ రెక్కడ వుంటున్నారు?"ని అడిగాడు.

"రోడ్లమీద" అని సూటిగా చెప్పివేశాడు.

"యెక్కడైనా పని చేస్తున్నారా?"

"లేదండీ. పనికోసమే తిరుగుతున్నాను. యెక్కడా దొరకలేదు."

"మంచిది, ఎల్లుండి వుదయం యెనిమిదింటికి మా బంగళాకి రండి - 20, స్టాన్లీ రోడ్డు. మీ కేమైనా సహాయం చేయగలనేమో ప్రయత్నిస్తాను."

రాముడు నమస్కారంచేసి వెళ్ళాడు.

"చాలా పెద్దమనిషి. మనీబాగ్ లో పదివేల రూపాయలు వున్నా, అలా తాకలేదు" అన్నాడు బాబు.

3

నెంబరు 20, స్టాన్లీరోడ్డు. బంగళా కనుక్కోవటానికి రాముడికి పెద్దకష్ట మనిపించలేదు. ఎనిమిదింటికి ముందే అక్కడికి చేరాడు. అది వారు టీతాగే వేళ. వాడికి బిస్కట్లు, టీ యిచ్చారు. తర్వాత బాబుగారి రూములోకి తీసుకెళ్ళారు. గది అలంకరణం చూసి, రాముడు విస్తుపోయాడు. 'వీరు యెంత గొప్పవాళ్లు, నే నెంత క్షుద్రుణ్ణి. అయినా యింతవరకి నన్ను మీరనితప్ప, 'నువ్వు' అని పిలవలేదు. గొప్పతనమంటే యిలా వుండాలి. నేను కాస్త వుపకారం చేశానో లేదో, నాకు యెంత కృతజ్ఞత చూపిస్తున్నారు. కాని నిజస్వరూపం బయటపడితే?' రాముడు యిక ఆపైన ఆలోచించలేకపోయాడు. తనమీదనే యెక్కడలేని అసహ్యం పుట్టుకొచ్చింది. 'నేనూ మానవుల్లో లెక్కేనా? నిజంగా మానవుణ్ణి అయితే యిలా దిక్కూదరీ లేక దేనికి తిరుగుతాను?'

బాబు తలయెత్తి - "మీ కేంపని చేయ గలవు?" అని అడిగాడు.

రాముడు యథార్థం చెప్పటమే వుత్తమ మనుకున్నాడు. "బాబుగారూ, నేను పెద్ద చదువు లేమీ చదువుకోలేదు. ఇంగ్లీషు అసలు రాదు. కొద్దిగా హిందీ చదువు కున్నా. ఇంతవరకి నేను యెక్కడా పని చేయలేదు. ఇంటిదగ్గరే వున్నా, యేదైనా నౌకరీ చేసుకు బతుకుదామని అలహాబాదు వచ్చాను."

బాబు కొంచెం ఆలోచించి, చెప్పాడు- "మా ఆఫీసులో వొక బంట్రోతు కావాలి. మీకు యిష్టమయితే..."

బాబుసంకోచం గమనించి - "యేం పర్వాలేదు. సంతోషంగా యీ నౌకరి చేస్తాను" అన్నాడు రాముడు.

బాబుకి వొక బరువు తీరినట్టుగా వుంది. యీ నౌకరీవ్యవహారం ఆఫీసుకు సంబంధించినది. తన తరఫున కృతజ్ఞత కనబరచటానికి మరో వుపాయం ఆలోచించాడు. "మీరు ఇవాళే వున్న సామాను తీసుకొని యిక్కడికి వచ్చివేయండి. ఇక్కడే భోంచేస్తూవుండవచ్చు. చిన్న పిల్లలున్నారు, వాళ్ళతో మీకూ పొద్దుపోతుంది."

రాముడికి వొక పెద్ద బరువు మీద పడినట్టుంది. ఇక తన వ్యాకులమంతా కట్టిపెట్టి యీ బంగాళాలో వచ్చివుండాలి. యింట్లో యెక్కడచూసినా విలువైన వస్తువులు పడివున్నవి. యీ గదిలోనే వెయ్యి రూపాయలు చేసేవస్తువులకి తక్కువ లేవు. ఎప్పుడు గుబులు పుట్టుతుందో యీ నౌకరీలో మనస్సు కుదిరికగా వుంటుందా? కాలంగడపటానికి యేదో వొక వ్యాపకంవుండాలి. ఇక్కడ యెలా సంభవం?

రాముడు వెనకాముందాడటం చూసి— "మీరేమీ ఆలోచించవద్దు. వెంటనే వచ్చేయండి. ఇది మీస్వగృహంగానే భావించండి" అని చెప్పాడు బాబు.

ఇంకేం చేస్తాడు? రాముడు సాయంత్రమే గుడ్డలు రెండూ చేతబట్టుకుని బంగళాకి వచ్చాడు.

4

రాముడు మూడేళ్లనించీ బ్యాంకులో వుంటున్నాడు. ఆబాబు బ్యాంకులో డైరెక్టరు మేనేజరు. బాబుకి అందరికంటె రాముడి మీదే ఏక్కువ నమ్మకం. హెడ్‌క్లార్కుకి తెలియని రహస్యాలుకూడా కొన్ని రాముడికి తెలుసు. ఒకసంస్థానాధీశుడు బ్యాంకులో మణుగు బంగారం వుంచాడు. యిది చాలా రహస్యం. ఆఫీసులో యిద్దరికో ముగ్గురికో తెలుసు. వారిలో రాముడు ఒకడు. వేలకొద్ది రూపాయల బాధ్యతకూడా వాడికి అప్పచెప్పతుంటారు. వాడికి యిది బొత్తిగా యిష్టంలేదు. బుద్ధి యెప్పుడు గడ్డితింటుందో అని వాడిభయం. డబ్బుకి దూరంగా వుండటమే మంచిది. బాబుకు వాడి జీవితాన్ని గురించి యేమీ తెలియదు. యీ విషయమే వాణ్ణి సర్వథా బాధిస్తూవుంటుంది. తెలిసివుంటే డబ్బువిషయంలో యింత భరవాసాగా వుంటాడా? ఈ భర్వాసాయే వాడికి ప్రాణాంతకంగా వుంది. ఇదే వాణ్ణి నిలువునా కుంగతీసింది. మనస్సుని నిగ్రహించుకోటానికి యెంత మథనపడుతున్నాడో, యెంత పోరాడుతున్నాడో ఆ అంతర్యామికే తెలుసు. ఆ బాబుగారి భర్వాసా ప్రతినిమిషమూ వాణ్ణి వెన్నంటి, ప్రతిపనినీ పరిశీలిస్తున్నట్టుగావుంది. ఈ భర్వాసామూలంగా వాడు తలవొగ్గాడు. దడదడకొట్టుకునే గుండెతో సంయమమునే కఠినపరీక్షకిసిద్ధమైవున్నాడు.

ఇలాళ అకస్మాత్తుగా వొకబాధ్యత వచ్చిపడింది. లక్ష రూపాయల కరెన్సీనోట్లను రిజర్వుబాంకుకి తీసుకెళ్లాలి. ఇలాంటి పని హెడ్‌క్లార్కుకి తప్ప ఎవరికీ అప్పగించరు. కాని ఆయనికి జబ్బుగావుండి ఇవాళ ఆఫీసుకి రాలేదు. బాబుగారు స్వయంగా వెళ్లేవారే! కాని రేపు డైరెక్టర్లమీటింగువుంది. రిపోర్టు తయారుచేయాలి. వారు చాలా పనివత్తిడిలో వున్నారు. ఇలాంటి పరిస్థితులో వారికి రాముడు గుర్తుకొచ్చాడు.

గంట మోగింది. రాముడు బాబుగదికి వెళ్లాడు. బాబు స్పష్టంగా -"కొంచెం రిజర్వుబాంకుకి వెళ్లిరావాలి. ఒక లక్ష కరెన్సీ అక్కడ జమకట్టాలి!" అని చెప్పాడు.

రాముడి మొఖాన నెత్తురుచుక్క లేదు. లక్ష రూపాయల కరెన్సీ! బాబుగారు తనని యెంత చిక్కులో పెడుతున్నారు. రాముడు నమస్కరించి - "బాబుగారూ, నౌకరు దొరలు చెప్పినట్టు నడుచుకోవలసిందే! వెళ్లిరాగలను కాని చాలా గొప్ప బాధ్యత బాబుగారూ!" అన్నాడు.

"అందుచేతనే నీకు . అప్పగించింది; నౌకర్లు యెవరూ లేకనా? నువు యింటి మనిషివి వాళ్లు పరాయివాళ్లు!"

ఈమాట రాముడి హృదయంలో నాటుకుంది. లోలోపల చాలాసార్లు వల్లించాడు. తర్వాత వెళ్లటానికి సిద్ధపడ్డాడు.

5

రాముడు పరధ్యానంగా సాగిపోతున్నాడు. ఒక చిల్లరకొట్టుదగ్గరికి వచ్చి ఆగిపోయాడు. కొట్టు, కొట్టుయజమానిని చూడగానే తప్పు తెలుసుకొని మళ్లీ కాలు సాగించాడు. వాడు చాలా తొట్రుపాటు పడుతున్నాడు. రిజర్వుబ్యాంకువద్దకి వెళ్లి, కాసేపు మెదలకుండా నిలబడ్డాడు. రెండడుగులు ముందుకు వేసి, మళ్లీ రెండడుగులు వెనక్కి వేశాడు. ఇలానే కొన్ని క్షణాలు గడిచినవి. వున్నట్టుండి తిన్నగా బ్యాంకు లోపలికి వెళ్ళిపోయాడు. పరిచయంవున్న, బంట్రోతులు పలకరించి బీడీ యివ్వబోయారు. కాని వాడికి అటు ధ్యాసే లేదు. వాడికి యేమీ వినిపించటంలేదు; అంతా అయోమయంగా వుంది. మెదలకుండా కౌంటరువద్దకి వెళ్లి క్షణకాలం నిలబడి, మళ్ళీ గిరుక్కున వెనక్కి తిరిగాడు. బయటికి వచ్చి, దారినిపడి పట్టణం వెలుపలికి బయలుదేరాడు.

వాడు నిరుద్దేశ్యంగా, దిక్కూ దరీ లేకుండా పోతున్నాడు. త్రివేణివద్దకి చేరుకున్నాక మళ్ళీ బాహ్యప్రపంచంలోకి వచ్చాడు. ఎందుకు యిలా చేసినట్టు? ఇప్పటికి బ్యాంకు మూసివేసివుంటారు. వెనక్కి రెండడుగులు వేసి, మళ్ళీ ఆనకట్టదగ్గరికి పోయి, మర్రిచెట్టుకింద చతికిలబడ్డాడు.

అలా అక్కడ యెంతసేపు కూర్చున్నాడో తెలియదు. వాడి పాతస్నేహితుడు, కూలిడబ్బులు చేతిలో వేసుకుని, సంతోషంగా యింటికి తిరిగివస్తున్నాడు. చెట్టుకింద రాముణ్ణి చూసి ఆశ్చర్యంతో - "ఎవరు? రాముడా! ఇక్కడు న్నావేమిటి?" అన్నాడు.

కాని అతీపతీ చెప్పలేదు. ఆగంతకుడు మాత్రం యెంతసేపు నిలబడతాడు. తన దారిన తను పోయాడు - మూగవాడిమాదిరి కూచున్న రాముణ్ని వొంటరిగా వదిలి.

పొద్దు కూకింది. బాగా చీకటి పడింది. ఏడు, ఎనిమిది - పన్నెండు కొట్టాయి. అటు వచ్చేపోయే జనం పలచబడ్డారు. అంతటా నిస్తబ్ధత వ్యాపించింది. రాముడు అక్కడినించి లేచి, వచ్చినదారిని బయలుదేరాడు. కొంచెం దూరం పోయి నాక అడుగు ముందుకు పడటంలేదు యంత్రచాలితునివలె ఒకతోటలో నిలబడిపోయాడు.

నలువైపులా పిండారబోసినట్టు వెన్నెల కాస్తూవుంది. మహాకవి కాళిదాసు వర్ణించినట్టు గంగా యమునల శ్వేతశ్యామల ప్రవాహాల కలయికవలె, జ్యోత్స్నా ఛాయల అద్భుతదృశ్యం కన్పిస్తూవుంది. రాముడి హృదయాన్ని అనుకరిస్తున్నట్టు, గాలి వీచినప్పుడు వృక్షలతల శాఖాపల్లవచిత్రం చలిస్తూవుంది. వాడు వొకచెట్టుకింద కూచుని సీలువేసిన తోలుసంచి ముందు పెట్టుకున్నాడు. మాటిమాటికీ చేతితో సీలును సవరిస్తున్నాడు. తర్వాత తల పైకెత్తి పైకో ఆలోచిస్తున్నాడు. మళ్లీ తల కిందికి వంచుకున్నాడు. బాహ్యప్రపంచంలో యేమీ సంబంధం లేనట్టు కూచున్నాడు. వున్నట్టుండి వాడిశరీరంలో వొకవిధమైనస్ఫూర్తి వచ్చింది. చప్పున లేచి సంచి నడుముకు కట్టుకుని రోడ్డుమీదికి వచ్చాడు. ముఖం మలినంగా వుంది. నడకలో తొట్రుపాటు కన్పిస్తూవుంది. అదేమయిన కొంచెంసేపు అచేతనంగా నడిచిపోయాడు. మళ్ళీ నెమ్మదిగా ఆగిపోయాడు. రెండడుగులు ముందుకు పడితే, రెండడుగులు వెనక్కు పడుతున్నవి. తత్ఫలితంగా వున్న చోటనే వుండిపోతున్నాడు. ఒకసారి మళ్లీ నడుంమీద చెయ్యి వేసిచూశాడు. అడుగు ముందుకు పడలేదు. చెయ్యి తీసివేశాడు. క్షణక్షణం మారుతున్న వాడి ముఖకవళికల్ని మనస్తత్వశాస్త్రజ్ఞులే వూహించగలరు. వ్యతిరేకభావాల సంఘర్షణ ముఖాన స్పష్టంగా గోచరిస్తూవుంది. మనిషిలో చలనమున్నట్టు కన్పించటంలేదు. పగలయితే, యే కారుకిందో పడిపోయేవాడు. ఇప్పుడు ముఖాన స్థిరత్వం కన్పిస్తూవుంది. బాగా కాలు సాగించిపోతున్నాడు. మళ్ళీ పరుగుతీస్తున్నాడు బలం కొద్దీ. పగటిపూట అయితే ఎంతమందిని ఆతృతలో పడగొట్టేవాడో. అసలు ఎవడో పిచ్చివాడు అనుకుని పోలీసుపట్టుకోకుండా వుంటేవాడా? ఒంటిగంట కావస్తూంది. రోడ్లమీద జనసంచారం లేదు. ప్రకృతి నిశ్శబ్దంగా వుంది. ప్రకృతి పగలంతా అలసిపోయి యిప్పుడు విశ్రాంతి తీసుకుంటున్నట్టుగా వుంది.

రాముడు వొకేమయిన పరుగెత్తుతున్నాడు. దారిలో అడపాతడపా ఇళ్లు కన్పిస్తున్నవి. పెద్దదుకాణాలు దాటి పాకికి వచ్చాడు. పాకలో వొకటీ అరా బస్సులు వస్తూ పోతూన్నవి. వాటి గరగరధ్వనికి వాతావరణం ప్రతిధ్వనిస్తూవుంది. వాడు ఎటూ చూడకుండా ఫుట్‌పాత్ మీద పరుగెత్తుతున్నాడు.

రాముడికి వొంట్లో యీ జవసత్వలు యెక్కడినించి వచ్చినవో కాని వున్నకొద్దీ యింకా వేగంగా పరుగెత్తుతున్నాడు. వాడు తెలిసుంటే యిలా పరుగెత్తి యెరగడు! రన్నింగురేసుకనక పెడితే, పెద్ద పెద్ద మొనగాళ్లనికూడా చిత్తు చేయవచ్చు; రికార్డు బ్రేకుకూడా చేస్తాడేమో యెలా చెప్పగలం? కాని యిది మాటుమణిగిన అర్ధరాత్రి అయిపోయింది!

వాళ వనక వడింది; స్ట్రాక్టీరోడ్డు కన్పిస్తూవుంది. వేగం తగ్గింపు చేశాడు. చెమటలు దిగకారుతున్నవి; గుడ్డలు ముద్ద అయిపోయినవి; నోటివెంట నురుగు జొబ్బట్లు పడుతున్నవి. కాని వాటికి యితేమీ పట్టే లేదు. ఇప్పుడు చెదిరిపోయిన శక్తులని కూడదీసుకుని, ప్రాణాలు వొడ్డి అయినా సరే, యీ భీషణ సంగ్రామంలో విజయం సాధించాలి! 'నువ్వు యింటిమనిషివి, వాళ్లు పరాయివాళ్లు' యీమాట మాటిమాటికీ తలపుకు వస్తూవుంది. తనమీద యెంత బర్వాసా! దీన్ని ప్రాణాలు అర్పించి అయినా కాపాడుకోవాలి!

స్ట్రాక్టీరోడ్డులో చాలా యిళ్లు దాటిపోయాడు. కాళ్లు తేలిపోతున్నవి. అవయవాలు యెడుదు తిరుగుతున్నట్టుంది. ప్రాణాలు నిలిచేటట్టు లేవు. కాని ఆగకూడదు. ఆగితే బుద్ధి తిరిగిపోతుందేమో! తను 'యింటిమనిషి' నమ్మకం నిలబెట్టుకోవాలి!

పరుగులో వెనకటి తీవ్రత లేదు. వాడి పరిస్థితిని నోటివెంటవచ్చే నురగే చెప్పక చెపుతూంది. కాని క్షణకాలం ఆగకూడదు! బాబుగారి బంగళాదగ్గరైనా ఆగాలి లేక ప్రాణాలు వదిలిఅయినా ఆగాలి. యీ బుద్ధిని నమ్మటి యెలా? బాబుగారి బర్వాసాకి అవమానం యే పరిస్థితుల్లోనూ జరగకూడదు!

అదిగో బాబుగారి బంగళా! రాముడి ముఖాన తీవ్రమయిన జ్యోతి మెరిసింది. 'హో భగవాన్! నన్ను విశ్వాసఘాతకుణ్ణి చేయవద్దు. యీ జీవితానికి నా పెన్నిధి యిది!'

6

రాముడు నాలుగింటికి పోయాడు యింత వరకు పత్తాలేడు. బాబు రిజర్వుబ్యాంకుకి ఫోనుచేస్తే, అతని గాబరా యింకా యినుమడించింది. రాముడు యేమయినట్టు? ఏ కారు కిందయినా పడ్డాడేమో! లేక యెవరైనా దారిలో ఆ డబ్బు దోచుకున్నారా? రకరకాల చింతలతో అతని మనసు, చాలా వుద్విగ్నమవుతూవుంది.

"మీరు వాడంటే యెక్కడలేని బర్వాసా! నేను యెన్నిసార్లు మొత్తుకున్నాను వాణ్ణి అంతగా నమ్మవద్దని. కాని మీరు నామాట చెవినిపెట్టారా? ఇప్పుడు తెచ్చికట్టండి లక్షరూపాయలు!" అని భార్య యింట్లో దెప్పుతూవుంది.

ఆ బాబుకి భార్యమాటలు కటువుగా తోచి, కోపంగా ఆమెవంక చూశాడు. రాముడు విశ్వాసఘాతం చేస్తాడా! అసంభవం.

భార్య మళ్లీ మొదలుపెట్టింది—"నేను మొదటినించే, ఆ దొంగచూపు చూసి ప్రమాదకరమయినమనిషి అనుకున్నాను. మీ తెలివితేటలకి నాకుజాలికలుగుతూవుంది. అందర్నీ మీవాడికే అనుకుంటారు."

బాబు అప్పటికీ యేమీ మాట్లాడలేదు.

అవతలనించి జవాబు లేకపోయేటప్పటికి భార్యకూడా కొంచెం మెత్తపడింది. "ఇంకా వ్యవధి వుంది. పోలీసులకి ఎందుకు రిపోర్టుచేయరు."

బాబు యీసారి నోరు విప్పాడు—"లేదు అలా జరగటానికి వీల్లేదు. డబ్బుకోసం రాముణ్ణి అరెస్టు చేయించను" బాబుగారి కళ్లనిండా కన్నీరుకమ్మి, రుద్ధకంఠంతో—"అతను క్షేమంగా వున్నట్టు తెలిస్తే నాకదే పదివేలు." అన్నాడు మళ్లీ.

రాత్రి బాబుకి పక్క కుదరలేదు. అటూ యిటూ వొత్తిగిలుతున్నాడు. 'నిజంగా రాముడు, మోసగించాడా? దొంగగా మారాడా? అతనిమీద నాకు యెంత నమ్మకం యేర్పడింది! అతని హృదయాన్ని అర్థంచేసుకుంటే?...నువ్వు యిలా చేయటం న్యాయమేనా? రేపు ప్రపంచానికి నేను యెలా ముఖం చూపించను?' బాబు నేత్రాలనించి కన్నీరు ధారగా ప్రవహిస్తూవుంది.

బాబుహృదయంలో రాముడిమీద క్రమంగా అపనమ్మకం మొలకలెత్తుతూవుంది. మనస్సుకు నచ్చచెప్పుదామని యెంత ప్రయత్నించినా, యేదో వొక మూలనించి 'రాముడు మోసం చేశా'డనిపిస్తూవుంది.

అర్ధరాత్రి దాటింది. ఒంటిగంటఅయింది. కంటిమీద కునుకులేదు. రకరకాల ఆలోచ

క్యూ

(14-వ పేజీ తరువాయి)

వందకు పైగా జనంగల "క్యూ"ని చూడడంతోనే, నాకు గుండెలు జారిపోయినాయి.

ఆఫీసుకు "నడిచా" వెళ్ళలేను - "క్యూ"లో గంటల తరబడి "నిలబడనూ" లేను— Hamlet పడ్డ అవస్థలో పడ్డాను-"క్యూలో నిలబడడమా? లేక నడిచివెళ్ళడమా?" అని- నడిచి ఎల్లాగూ వెళ్ళలేను కనుక, చివరకి "క్యూ"లో నిలబడడానికే నిశ్చయించాను.

మా ఊళ్ళో మాకు మల్లేనే మాబస్సులది కూడా చాలా విచిత్రమైన "నడవడి" - వస్తే ఒకేమాటు, ఒకటి తరువాత ఇంకొకటి చొప్పున, రాజఠీవిగా, వరసగా పది బస్సులు వస్తాయి. రాకపోతే గంటలతరబడి అసలే రావు. ఇది ప్రజాస్వామిక యుగం కనుక మాకుమల్లే వాటికి కూడా రాకపోకలవిషయంలో సంపూర్ణస్వేచ్ఛ ఉంది. రాకపోతే సమయానికి ఎందుకు రాలేదని వాటిని అడిగేనాథుడు ఎవ్వడూ ఉండడు. నాథుడంటూ ఒకడున్నా అతని మాట అవి లక్ష్యపెట్టవు. వస్తే Stand కి వందగజాలముందో, లేక వందగజాలవెనకాలో నిలుస్తాయి. ప్రయాణీకులను దింపి, చోటు ఉన్నా ఇతర ప్రయాణీకులను తీసుకోకుండానే వెళ్ళిపోతాయి. బస్సు చప్పుడు వినపడ్డంతోనే, "క్యూ"లో ఒక గొప్ప సంచలనం బయల్దేరుతుంది. మొదట సుషుప్తిలోవున్న శ్రేణి, అంటే "క్యూ", Bus దర్శనభాగ్యం కలగడంతోనే జాగ్రదవస్థలోకి వస్తుంది. ఉద్వేగాన్నీ, ఉక్రోషాన్నీ కక్కుతుంది. ఆగ్రహావేశాల్ని కనపరుస్తుంది. దుమ్ములో, పొగలలో యావత్తుశ్రేణీ బస్సుపై విరుచుకుపడుతుంది. జనసమూహం కోతుల దామెరగా మారుతుంది. పక్కలనించి ఎక్కేవాళ్లు కొందరు - వెనకాముందులనించి ఎక్కేవాళ్లు మరికొందరు - తోసుకొని వెళ్ళడంలో జాతి మత లింగ విభేదాలు ఉండవు - ప్రజాస్వామికాదర్శాలు, నగ్నంగా కట్టెదుట కనబడుతాయి. "క్యూ" చివరవున్న మనిషి, బస్సులో మొదటి "సీటు"లో ఉంటాడు. "క్యూ" మొదటవున్న మనిషి, బస్సుకి వందగజాల ఎడం అవుతాడు. ఇంతలోకే బస్సు వెళ్ళిపోతుంది. రెడ్డివచ్చె మొదలాడన్నట్లు, మళ్లీ కొత్తగా "క్యూ" ఏర్పడుతుంది. అప్పుడు ఏవ్యక్తికూడా "క్యూ"కి అతీతంకావడానికి వీలు లేదు. అతీతం అవుతే, వున్న కాస్త అవకాశం చేతులారా జారవిడుచుకోవాల్సివస్తుంది.

అప్పట్లో నాలుగు బస్సులు వచ్చాయి - నాలుగూ వెళ్ళిపోయినాయి. నాలుగుసార్లు క్యూలు ఏర్పడినాయి. కాని చివరవరకూ నేను "క్యూ"ని వదిలి ఉండలేకపోయినాను - దయ్యాలులేవని ఇతరులకి నమ్మకంగా చెప్పి, మనంమాత్రం భయపడకుండా ఉండలేనట్లు - దేవుడులేడని నమ్మిన నాస్తికుడు, ఎందుకైనా మంచిదని దేవాలయం కనపడడంతోనే, "మెకానికల్"గా దండం పెట్టినట్లు - ఆరోజు Necessary Evil గా "క్యూ" నా వెంట బడింది. అయిదోసారి సాధించి ఏదోవిధంగా బస్సు ఎక్కాను- జుట్టూ, కనుబొమలూ దుమ్ముతోనిండిపోయినాయి. టోపీ క్రిందపడిపోయింది. పోటీలో ఉత్సాహం, త్యాగం ఎందుకు ఉంటాయో తెలియదు- ఆఫీసులో మాటకి ముందు ఆఫీసర్ నన్ను పిలవడం కద్దు. నాలో ఏదో విశిష్టత ఉండికాదు- అతని అధికారగర్వాన్ని నాపై ప్రయోగించి నా దాస్యవృత్తిని నాకు కళ్ళకి కట్టినట్లు చూపడానికి. టోపీలేకుండా అతని ముందుకు వెళ్లడం బాగుండదని తోచి సెలవు చీటీ వ్రాసి హెడ్‌గుమాస్తాకి యిచ్చాను. నా అవతారం చూచి "ఏమిటిదని?" అతను అడిగాడు. "మరేమీలేదు - ఒంటి నిండా దుమ్ము అయింది - ఇది "క్యూ" ప్రభావమని చెప్పాను- అతను ఒకవింత మృగాన్ని చూచినట్లు నా వేపు చూచాడు - అతని టేబుల్ పైన నాకు Seniority list కనపడింది. దానిలో ఒక ఉద్యోగి పేరు తరువాత, ఇంకొక ఉద్యోగి పేరు వ్రాసి వుంది. అక్కడకూడా ఒక "క్యూ" ప్రత్యక్షమైనందుకు విచారంతో గుండె బరువెక్కింది. ఇక ఈ "క్యూ" నించి మానవమాత్రుడికి విముక్తి ఉండదనితోచింది. జీవితావసరాల వలె, ఈ "క్యూ" పద్ధతి, ఒక అవసరంగా మారింది.

"క్యూ" కి దడిసి కాలినడకనే, ఆఫీసు నించి యింటికి తిరిగి వచ్చాను.

* * * *

మధ్యాహ్నం ఒక కునుకుతీసి లేచేసరికి, శరీరం తేలికగా కనపడింది. ఉత్సాహం వెల్లివిరిసింది. తీసుకోక, తీసుకోక ఆనాడు సెలవు తీసుకున్నాను. మళ్లీ మళ్లీ సెలవు అడిగితే దొరకదు. జన్మకు ఒక శివరాత్రి వలె సెలవు లభించింది. కనక ఆరోజు హాయిగా గడపాలనుకున్నాను. "హాయిగా గడపడమంటే, ఏమిటని" ఆలోచించాను. మూడవతరగతి గుమాస్తాకు, సినిమాకి వెళ్లడం తప్ప, హాయిగా గడపడానికి, యితరవ్యాసంగమేమీ ఉండజాలదని తోచింది. పత్రిక తిరగవేస్తే, Royal లో "The best years of our lives" నడుస్తున్నదని తెలిసింది. "మనదీ ఒక బ్రతుకేనా? ఇవేనా మన మంచిరోజులని?" నిస్పృహకలిగింది. ఇది చాలా గడ్డు సమస్య - దీనినిగూర్చి ఆలోచించి లాభం లేదని తోచి, కాలినడకని Royal కి వెళ్ళాను. Royal లో ప్రతి కిటికీ దగ్గర నాకు ఒక పెద్ద "క్యూ" కనపడింది. ఏడు అణాల కిటికీదగ్గర, పన్నెండణాలకి కిటికీ దగ్గరికంటె రెండింతలు జనం కనపడింది. రూపాయి రెండణాల కిటికీ దగ్గర జనం కొంచం తక్కువగా ఉంది. పైగా ఆ "క్యూ"లో యిద్దరు ముగ్గురు స్త్రీలుకూడా ఉన్నారు. క్యూని ఎంత అసహ్యించుకున్నా, భౌతికాకర్షణలకి దాసుడినై, చివరికి అదే క్యూలో వెళ్ళినిలబడినాను.

మా "క్యూ"లో ఒక యువకుడి పక్కన ఒక అందమైన అమ్మాయి నిలబడిఉంది. యువకుడు సూటిగా ఆ అమ్మాయి కళ్లల్లోకి చూస్తున్నాడు. యువతి Receptive గా, అతని చూపులకి తన చూపులతో మారుపలుకుతున్నది. కొంతకాలం చూపులతో

(31-వ పేజీ చూడండి)

నలు అతని మనస్సుని చీకాకు పరుస్తున్నవి. అరాత్తుగా వున్మత్తునిమాదిరి లేచి కూచుని వుద్రేకంగా- "నిన్ను అరెస్టు చేయిస్తాను. జైల్లో పెట్టిస్తాను. నువ్వు ఎక్కడున్నా వదలను! బద్మాష్ జాగ్రత్త! నా కంట పడ్డావంటే షూట్ చేస్తాను." అంటూ పక్కమీదినించి తుపాకి తీసుకురావటానికి దూకాడు. ఇంతలో యేదో తలుపుకు కొట్టుకున్న ధ్వని అయింది

అంతా వొక్కసారిగా మేల్కొన్నారు. స్విచ్ నొక్కారు. లైట్లన్నీ వెలిగినై. వచ్చి చూస్తే రాముడు బోర్లపడివున్నాడు. రాముడి నోటినించి రక్తం కారుతూవుంది. సీలువేసిన మనీబాగ్ చెక్కుచెదరకుండా రాముడి నారలేని చేతుల్లోవుంది! "అరే! రాముడు!"అని, బాబు పెద్దగా కేకవేశాడు.

బాబు వాణ్ణి లేవదీయబోయి, కెవ్వుమన్నాడు. పాపం బాబు తలపట్టుకుని, అక్కడే చతికిలపడ్డాడు. డబ్బు దక్కింది కాని రాముడు దక్కలేదు! వాడి హృదయవేదనకూడా బాబుకి అజ్ఞాతంగానే వుండిపోయింది!



బొమ్మరిల్లు

బాలగేయం:

పుల్లా రావు

శ్రీ గణపతి రాధాకృష్ణమూర్తి

బెల్లం కొండను
పల్లె టూరులో
పుల్లా రావను
పిల్లా డుండెను.

బడిలో చదివే
ఈడుకు సరిగా
వాడిని బస్తీ
బడిలో వేసిరి.

ఆ రోజునసే
పరీక్ష పంతులు
పరి వారంతో
తరలి వచ్చెను.


దడదడ లాడిరి
బడిలో పిల్లలు
పంతులు కూడా
హడలి వణికెను.

పరీక్ష పంతులు
పుల్లా రావుని
'స్టాండప్' అంటూ
ప్రశ్నను అడిగెను.

కొత్తగ చేరిన, ఆ
కొత్తబ్బాయీ
తత్తర పడుతూ
బిత్తర పోయెను.

"నాలుగు నెలల దూడకు
నాలుగు కాళ్లుంటే, పదు
నాలుగు నెలల దూడకు
కాళ్లెన్నుండును?"

పుల్లారా వప్పాడు, "పదు
నాలుగు కాళ్లు" నె చల్లగ
గొల్లున నవ్విరి పిల్లలందరూ
తెల్లబోయె మన పుల్లా రావూ.



ఆ ఆదివారం పదిన్నర గంటలకి చర్చికి వెళ్లాడు టామ్. కూడా పోలీ పెద్దమ్మ, సిడ్, మేరీ ఉన్నారు. ప్రార్థనలూ మొదలైనవి నడుస్తున్నాయి. కాని ఏవీ టామ్‌కి చెవి కెక్కడం లేదు. మధ్య మధ్య గుసగుసలు తప్ప ఎక్కువ సద్దు వినపడ్డం లేదు. ముందున్న బెంచిచెక్కమీద ఈగ ఒకటి వాలింది. అది చూసేసరికి టామ్‌కి చెయ్యి ఆగడం లేదు. ఆ ఈగ ఊరికే చేతులు (ముందు కాళ్లు) నులుముకుంటోంది. మెడ వొంచి చేతుల్తో రుద్దుకుంటోంది. నన్నని మెడ కనిపించీ కనిపించకుండా ఉంది. తల ఊడిపడుతుందా అనిపించింది టామ్‌కి. ముఖం సబ్బుతో రుద్దుకుంటున్నట్టు గబగబా చేతుల్తో తల రాచుకొంటోంది ఈగ. అది చూసినకొద్దీ టామ్ ఉండబట్టలేకపోతున్నాడు. కాని అక్కడ దేవుడి ప్రార్థన జరుగుతుండగా ఇలాంటి పని చేస్తే అమ్మో! అనుకున్నాడు టామ్. అలాగే చూస్తూ ఊరుకున్నాడు. ప్రార్థన పూర్తికావడం తడవు గభాల్న పట్టేశాడు ఈగని. చక్కగా చేతిలో చిక్కింది ఈగ. పోలీపెద్దమ్మ వీడిని కనిపెడుతూనే వుంది. వెంటనే ఈగని వొదిలిపెట్టించింది.

ప్రార్థనతరవాత ఫాదర్ ఏదో చెప్పుకుపోతున్నాడు. అదంతా ఏమిటో టామ్‌కి ఒక్కముక్కైనా అర్థం కాలేదు. కాని ఒక మాట మాత్రం వాడికి చిత్రంగా తోచింది. అదేదో గొప్ప రోజు వొస్తుందట. ఆరోజున సింహం మేకపిల్ల కలిసి చెట్టాపట్టాలు వేసుకుని నడుస్తాయట. చిన్న పాపకూడా వాటిని నడపగలుగుతాడు. ఈ మాటలుమాత్రం టామ్ చెవి కెక్కాయి. వాడి కప్పుడు బలే ఉద్దేశం తట్టింది. ఆ నడిపే పిల్లవాడు తనే ఎందుకు కాకూడదు? సింహం అంత మంచిదీ, సాధువు అయితే?

ఇంతలోకే టామ్‌కి తన జేబులో దాచుకున్న పేడపురుగు జ్ఞాపకం వచ్చింది. దాన్ని అగ్గిపెట్టిలో దాచాడు. మెల్లిగా పైకి తీశాడు. అగ్గిపెట్టి తెరవగానే అది చేతిమీదికి పాకింది. దానికి పెద్ద నోరుంది. అది తెరిచి వేలు కరిచింది. దాంతో వాడు వేలు టపటప విదిల్చాడు. పురుగు వెళ్లి బెంచీలపక్కగా నేలమీద పడింది. పడ్డంలో వెల్లకిలా పడి బోర్లపడలేక వెన్నుమీద గుండ్రంగా తిరగడం మొదలెట్టింది. కాళ్లు ఊరికే తన్నుకుంటోంది కాని బోర్లపడలేదు. టామ్ చూశాడు. వెళ్లి పట్టుకోవాలనివుంది కాని కదలడానికి వీల్లేదు. పురుగుని పక్కనున్నవాళ్లు కూడా చూశారు. ఫాదర్ ప్రబోధంతో విసుగెత్తింది కాబోలు వాళ్లు పురుగునే చూస్తూ ఉండిపోయారు.

మెల్లిగా అక్కడికొక బుల్లి సీమకుక్కపిల్ల వొచ్చింది. దాని కూడా యజమానిదగ్గర అంతసేపు ఏమీ చెయ్యకుండా కూచోడానికి విసుగు పుట్టింది. ఏమి చేద్దామా అని ఆలోచిస్తూ నడిచి వొస్తోంది. దారిలో పురుగు కనిపిం

చేసరికి దాన్ని పరామర్శించాలని బుద్ధిపుట్టింది. ముడుచుకున్న తోక లేచి నాట్యంచెయ్యడం మొదలెట్టింది. పురుగుని శ్రద్ధగా అంత దూరంనించి చూసింది. కొంతదూరంగానే వుంటూ చుట్టూ తిరిగి నాలుగు పెడల్నించీ పరికించింది. వాసన చూసింది. ఇంకోచుట్టు తిరిగింది. ఈమారు కొంచెం దగ్గరకి వచ్చి చూసింది. వాసన చూసింది. మరోచుట్టు తిరిగింది. మరి కొంత ధైర్యం చిక్కింది. పురుక్కి దగ్గరగా ముక్కుపెట్టి వాసన చూసింది. ముట్టి పైపెదవి తెరిచి పళ్లతో పట్టుకోబోయింది. కాని కాస్తలో తప్పిపోయింది. సరిగా పట్టుకోడానికి ధైర్యం లేకపోయింది. ఇంక పురుగుని తాకకుండా దానిచుట్టూ ఆడుతోంది. ఇంక పురుగు తననేమీ చెయ్యదని ధైర్యం తోచినప్పుడు మెల్లిగా దానిదగ్గిర పొట్టమీద పడుకుంది. ముందు రెండు కాళ్ల మధ్యనూ పురుగు వుంది. ముక్కుతో వాసన చూడ్డం కొంతసేపు జరిగాక కుక్కపిల్లకి విసుగుపుట్టింది. ఆట మార్చాలనుకుంది. తల కొంచెం ఓరగా పెట్టి ముట్టెతో పురుగుని ముట్టుకుంది. ముట్టుకోడంతడవు పురుగు ముట్టెని కరిచి పట్టుకుంది. కుక్కపిల్ల కుయ్యో, మొయ్యోమంటూ గంతు లేసింది. బుర్ర గట్టిగా ఝాడించింది. పురుగు వెళ్లి రెండు గజాలదూరంలో పడింది. కాని మళ్లీ వెల్లకిలానే పడింది. చూస్తున్న వాళ్లందరికీ నవ్వొచ్చింది. విసనకర్రలూ, రుమాళ్లూ ముఖాలకి అడ్డుపెట్టుకున్నారు. టామ్‌కి ఇదంతా బలేగా ఉందనిపించింది.

కుక్కపిల్ల వెర్రిమొహం వేసుకు చూసింది. కొంచెం ఉక్రోషం వచ్చింది. పురుగుమీద కసితీర్చుకోవాలనుకుంది. పురుగు దగ్గిరకెళ్లి దాడి మొదలెట్టింది. పురుగు చుట్టూ తిరిగి అన్నివైపుల్నించీ దానిమీద కురకడం మొదలెట్టింది. కాలితో పురుగుని బాదడానికి ప్రయత్నించేది. కాని ధైర్యంచాలక కొద్ది దూరంలో పడేది కాలు. పళ్లతో పట్టుకోబోయి మానేది. తల అటూ ఇటూ తిప్పేది. చెవులు టపటపమనేవి. కొంతసేపటికి కుక్కపిల్లకి మళ్లీ విసుగు పుట్టింది. ఆ పరిసరాల్లో ఈగలూ, చీమలూ ఏవైనా దొరకుతాయేమోనని వెతికింది. గోడమూలలు చూసింది. ఒకచోట ఒక కండచీమ కనపడింది. దాని వెనకాలే ముట్టెలో చూసుకుంటూ వెళ్లింది. కొంత దూరం పోయాక అది ఒక కన్నంలో దూరిపోయింది. ఇంక చెయ్యడానికేం లేక కుక్కపిల్ల అటూ ఇటూ చూసుకుంటూ వెళ్లింది. ఆవులించింది. కూచుంది. పేడపురుగుమాట మరిచిపోయింది. వెళ్లి వెళ్లి చూసుకోకుండా దానిమీద కూచుంది. కూచునీ కూచోడంతోనే మళ్లీ కుయ్యోమంటూ పరుగు తీసింది. బెంచీలకింద దూరి పరుగులెత్తింది. తలుపుల్ని రాసుకుంటూ హాల్లో అటూ ఇటూ తెగ గంతులేసింది. పరిగెత్తిన కొద్దీ అరుపు లెక్కువైనాయి. ఒకచోట ఆగి ముడ్డి రాసుకుంటూ గిరగిరా తిరిగింది. తరవాత దేకింది. అప్పటితో బాధ తీరింది. ఇంక మరి ఆగలేదు. యజమానిదగ్గిర కెళ్లి పడింది. అత నొక్క తోపు తోశాడు. ఒక్కసారి కుయ్‌మంది. తరవాత కొంతదూరాన వెళ్లి దీనంగా చూస్తూ కూచుంది.

ఈ గొడవతో ఫాదర్ ప్రబోధం హరాంచేసింది. అందరూ నవ్వుతు- న్నారు. ధ్యానం మళ్లిపోయినందు- వల్ల ఫాదర్ ఎంత పవిత్రసందే- శాల్ని గురించి చెప్పినా అందరికీ వేళాకోళంగా, అదో తమాషాగా తోచాయి. ఫాదర్ ఇంక ఆట్టేసేపు ఉపన్యాసం చెప్పలేదు. రెండు మాటల్లో పూర్తిచేశాడు.

చర్చికి వెళ్లడం అంటే ఇంక ఫరవాలేదనుకున్నాడు టామ్. ఇలాటి గమ్మత్తులుంటే చాలు ఫరవా లేదు. కాని తన పురుగుమాత్రం తనకి మళ్లీ దొరకలేదు.

సోమవారం వచ్చింది. సోమవా- రం వచ్చిందంటేనే టామ్‌కి బాధ రెండురోజులు సెలవులతరవాత వారంరోజులు బడి. అసలు సెలవులు రాకుండాఉంటే మంచి దనిపిస్తుంది

టామ్ ఆలోచిస్తూ పడుకు- న్నాడు. ఈపళాన్ని తనకి ఏదో జబ్బు రాకూడదూ! వస్తే స్కూలుకి వెళ్లనక్కరలేకుండా ఇంటిదగ్గిరే ఉండిపోవచ్చు. ఇదెందుకు వీల్లేదు టామ్ గట్టిగా ఆలోచించాడు ఒంట్లో ఇప్పుడేం బాధ వుంది? ఏదీ ఉన్నట్లు కనిపించడంలేదు ఒంట్లో ఎక్కడా ఏకాస్త కూడా నెప్పి లేదు? అని పరీక్షచేసుకు- న్నాడు. పొట్ట ఉబ్బరం ఉందేమో నెప్పిపెట్టడంలేదూ? కాస్సేపు నెప్పి

ఉంటే ఎలా వుంటుందో ఆలోచించుకున్నాడు. అబ్బే ఆ లక్షణమేమీ కనపట్టంలేదు. ఇంకో ఆలోచన చటుక్కున తట్టింది. పై పళ్ళలో ఒకటి కొంచెం కదుల్తోంది. ఆ బలేగా దొరికింది. ఇంక మూలగడం మొదలెట్టాలనుకున్నాడు. కాని తీరా ఇది మొదలెడితే పెద్దమ్మ వచ్చి ఆ పన్ను పీకుతుందేమో నని భయంవేసింది. ఇదిప్పటికి మూసేద్దా మనుకున్నాడు. ఎప్పుడో ఒక డాక్టర్ ఒకటి చెప్పినట్లు జ్ఞాపకం వచ్చింది. అదొస్తే రెండుమూడు వారాలు మంచం పట్టాలట. కాలి బొటనవేలు కోసెయ్యవలసివస్తుంది కూడా. కప్పుకున్న దుప్పటి కొంచెం పైకి లాగి కాలి బొటనవేలు—దెబ్బ తగిలిన ది—పైకి తీశాడు. పడుకునే దానివంక చూశాడు. మరైతే దీని లక్షణాలేమిటో టామ్‌కి తెలియదు. అయితే అయింది ప్రయత్నం చెయ్యా లనుకున్నాడు. అక్కడ నించి గట్టిగా మూలగడం మొదలెట్టాడు. సిడ్ లేవలేదు. మరీ గట్టిగా మూలిగాడు. సిడ్‌కి మెళుకువ రాలేదు. గుర్రుపెడుతున్నాడు చూడా. ఇంక టామ్ మోరెత్తి అబ్బో అమ్మో అని గట్టిగా అరిచాడు. ఊహు. సిడ్ కదల్లేదు. ఒళ్లు మండుకొచ్చింది. సిడ్‌ని ఒక్క గుంజు గుంజాడు. వాడు లేచాడు. కళ్లు నులుముకుని చూసేటంతలో గట్టిగా మూలగడం రొప్పడం మొదలెట్టాడు టామ్.

"అరె. ఏమిట్రా, ఏమయింది?"

టామ్ జవాబివ్వలేదు. మరీ గట్టిగా మూలిగి చేతులూ కాళ్లూ గిజగిజ కొట్టుకుంటున్నాడు.

సిడ్‌కి భయంవేసింది.

"అరె టామ్. ఇదిగో చూడు, ఏమిటయింది, నాకు చెప్పు."

"ఉండరా బాబూ. నన్ను ముట్టుకోకు. చచ్చిపోతున్నాను."

ఛ. అదేమిటి. అసలు బాధేమిటో చెప్పరా. కాస్సేపు మూలగటం ఆపెయ్. ఏమిటో నాకు చెప్పు."

"వొద్దులేరా ఉండు. అదే తగ్గిపోతుందిలే. ఎవర్నీ పిలవకు."

అదేమిటి, అస లెంతసేపట్నుంచి?"

"అబ్బో చాలాసేపట్నుంచి."

"మరి నన్నెందుకు లేపలేదు"

"పోనీలేరా. ఇంతవరకూ నువ్వు చేసిన వాటన్నిటికీ నిన్ను క్షమించాను సిడ్. నేను పోయినప్పుడు...

"ఛ, అవేం మాటల్రా! ఉండు చెప్తా......"

"ఏం వొద్దురా సిడ్. అందర్నీ క్షమించాను. అలాగని అందరితోను చెప్పు. నా ఒంటి కన్ను పిల్లిని ఆ కొత్తమ్మాయి కిచ్చెయి. ఆ అమ్మాయితో చెప్పు..."

"పెద్దమ్మా, పెద్దమ్మా రావాలి. తొరగా రా. టామ్ చచ్చిపోతున్నాడు." అంటూ పొలికేకలు పెట్టాడు సిడ్.

"ఏడిశావు. అంతా ఉత్తదే" అంటూనే పెద్దమ్మ గబగబా వచ్చింది. వెనకాలే మేరీకూడా వచ్చింది. టామ్‌ని చూసేసరికి పెద్దమ్మకి ముచ్చెమట్లు పోశాయి.

"నాయనా ఏమిట్రా. చెప్పు టామ్, ఏమిటి?

"పెద్దమ్మా..."

"ఏమిటి"

"బాబో నావేలు పుండు బాబో"

పెద్దమ్మ గబగబా బొటనవేలు చూసింది. కుర్చీలో కూలబడి "ఓరి. నీ కడుపుడుక. ఎంత అల్లరి చేశావురా దీనికి. చాల్లే ఇంక నోర్ముయ్."

మూలుగు ఆగిపోయింది.

"కాదు పెద్దమ్మా నిజంగా చచ్చిపోతా ననుకున్నాను. అంత బాధ పెట్టింది. పన్ను పోటుకూడా మరిచిపోయాను."

"ఓహో పన్ను పోటా. ఏదీ చూడనీ"

"ఒకటి కదుల్తోంది."

"అలాగా, అయితే ఉండు. కదలకు. చూడు మేరీ పట్టుపేను దారమూ కొరకంచూ పట్టుకురా."

మేరీ వెళ్లి తీసుకొచ్చింది.

"వొద్దు పెద్దమ్మా వొద్దు, పన్ను పీకెయ్యకు. ఇంక అట్టే నెప్పిపెట్టడంలే."

"ఫరవాలేదు, ఒక్క క్షణం ఓర్చుకో."

పెద్దమ్మ పట్టుదారంతో పన్ను బిగించింది. రెండో కొస మంచం కోడుకి కట్టింది. కొరకంచు తీసుకొచ్చి ముక్కుమీద పెట్టబోయింది. టామ్ గుంజుకోడంతో పన్ను ఇట్టే ఊడివచ్చింది.

అబ్బో అన్నాడు టామ్. "ఫరవాలేదులే. ఇంక నెప్పి వుండదు" అని బుజ్జగించింది పెద్దమ్మ.

టామ్‌కి ఇదీ ఒక మంచికే వచ్చింది. నోట్లో నీళ్లు నింపాపోసుకుని తొస్సిలోనుంచి జంయ్‌ని ధార వొదలచ్చు. దర్జాకి ఆమడదూరానికి కూడా గురిచూసి ఉమ్మి వెయ్యవచ్చు. స్కూల్లో ఈ గొప్ప చూపించుకున్నాడు.

స్కూల్‌కి వెళ్లే దారిలో రాడీ హక్కల్ బెరీఫిన్ కనిపించాడు. వీడి తండ్రి తాగుబోతు. వాడితో స్నేహం చెయ్యకూడదనీ, అసలు వాడితో మాట్లాడకూడదనీ పిల్లల్ని అమ్మలు ఆంక్ష పెడతారు. వాడితో మాట్లాడ్డం తిరగడం పిల్లలకి సరదా. అదో గొప్పనుకుంటారు. పిక్కలు దిగే పెద్దవాళ్ల చొక్కా, నేలని తుడుచుకుపోయే లాగు తొడుగుతాడు. మాసి అట్టులుకట్టివుంటాయి ఆ బట్టలు. నడనెత్తిని పెద్ద బ్రారి ఉన్న టోపీ వేసుకుంటాడు. దాని చుట్టూ రంగుల కాగితాలు అంటిస్తాడు.

వాడిష్టంవొచ్చినట్టు తిరుగుతాడు. వాడి ననేవాడెవడూ లేడు. మంచి బట్టలు వేసుకోవాలనీ, ముఖం రుద్దుకోవాలనీ, రాత్రి ఎనిమిదింటికే పడుకోవాలనీ కాలవలో ఈతలు కొట్టకూడదనీ వాడిమీద ఎవరూ పెత్తనం చెయ్యరు. బలే స్వేచ్ఛ. అలా వుంటే ఎంత బాగుండు ననిపిస్తుంది టామ్‌కి.

"ఏమోయ్ హక్."

"ఏయ్ చూడు. చవుడా నాదగ్గిరేముంది!"

"ఏముంది."

"చచ్చిన పిల్లి."

"బలే. బాగా బిగుసుకుపోయింది."

"ఆ మరేమి టనుకున్నావ్"

"ఎక్కడిది?"

"కొన్నాను, ఒక నీలంటిక్కట్టు, ఒక ఉతతతోకా ఇచ్చి తీసుకున్నాను బెన్‌రోజర్స్ దగ్గిర."

"ఎందుకూ?"

సురుపుడుకాయలు తీసేసుకోడానికి"

"అచ్చ, దీంతో ఎల్లా తీసేస్తారేమిటి; నాకు మంచి పద్ధతొకటి తెలుసు మంత్రపు నీళ్లతో."

"ఓస్ నాకది తెలుసుతే. కాని అది పనిచెయ్యదు."

"నీకెల్లా తెలుసేమిటి? చెప్ప ఏం చేస్తారో"

"ఏంచేస్తాడు? బాబ్ టానర్ చేశాడు. కొట్టేసిన చెట్టుమొదలు చూశాడు. దాని గతుకుల్లో నిలవున్న నీళ్లలో చెయ్యి పెట్టాడు. అంతే."

"ఏం అనలేదా అప్పుడు"

"ఏమో. లేదనుకుంటాను."

ఇంకనేం. మరి అలాగే నా ఏమిటి చెయ్యడం! నే చెప్తా చూడు. ఎవ్వరూ కూడా ఉండకూడదు. ఒక్కడే అడివిమధ్యలోకి వెళ్లిపోవాలి. అక్కడ నరికేసిన చెట్టుమొదలు వెతకాలి. సరిగా అర్ధరాత్రి వేళకి దానిదగ్గిర కెళ్లి దానికేసి చూడకుండా—వెనక్కి తిరిగి నిలబడాలి. చెయ్యి— వెనగ్గానే— ఆ నీళ్లలో పెట్టి సురుపుడుకాయలుపోవాలి, పోవాలి, పోవాలి అని మూడుసార్లు అనాలి. వెంటనే కళ్లు మూసుకుని పదకొండు అడుగులు ముందుకి వెయ్యాలి. అక్కడే మూడుసార్లు కళ్లుమూసుకునే చుట్టూ తిరగాలి. ఆపైన ఎవ్వరితోనూ మాట్లాడకుండా ఇంటికొచ్చెయ్యాలి. మాట్లాడితే మంత్రంపట్టుపోతుంది.

"అవును. ఇది బాగుంది. ఇలా చేస్తే ఫరవాలేదు. వాడికి తెలియదు కాబట్టే ఎన్నిసార్లు ఏంచేసినా వాడి సురుపుడుకాయలు పోలేదు."

"మరి చచ్చినపిల్లితో నువ్వెల్లా చేస్తావ్?"

"ఏముంది! చూడు చెప్తా. ఒట్టి దుర్మార్గుడైనవాడు చచ్చిపోయిన రోజున అర్ధరాత్రివేళ ఈ చచ్చిన పిల్లిని తీసుకుని శ్మశానానికి వెళ్లాలి. సరిగ్గా అర్ధరాత్రయ్యేసరికి దెయ్యాలొస్తాయి. అవి కనిపించవు గాని వచ్చినట్టు వినిపిస్తుంది అంతే, ఒక్కొక్కప్పుడు అవి మాట్లాడుకునే మాటలుకూడా వినిపిస్తాయి. చచ్చిపోయినవాడిని అవి తీసుకుపోతున్న సమయంలో పిల్లిని వాటి వెంట విడిచిపెట్టాలి. 'శవం వెంట పిల్లి, పిల్లి వెంట సురుపుడుకాయలూ పోవాలీ పోవాలీ పోవాలి' అనాలి. అంతే అవ్వి పోతాయి."

"బలే బాగుంది. మరెప్పుడెడతావు శ్మశానానికి?"

"ఈ రాత్రే. హోస్ విలియమ్స్ చచ్చిపోయాడుగా."

మరి వాడిని మొన్ననే పాతిపెట్టారే"

"అయితే ఫరవాలేదు. మధ్య ఆదివారం వచ్చిందిగా. బహుశా దెయ్యాలు రావు ఆదివారంనాడు."

అయితే ఇవ్వాళ రాత్రే వెడతావన్నమాట. నేను నీ కూడా రానా?"

"ఓ. కాని నీకు భయముండ కూడదు మరి."

"ఓశ్ నా కెప్పుడూ భయం లేదు. సరేకాని ఆ గుప్పిట్లో ఏమి టుంది హాక్"

"అది జోరిగ"

"అది నాకివ్వవ్'

"అబ్బే అది నే నమ్మదల్చుకో లేదు"

"పోనీలే. వెధవ జోరిగలు బోలెడు దొరుకుతాయి."

"ఇది నీ కిస్తే నువ్వు నాకే మిస్తావ్.?

టామ్ ఆలోచించాడు. జేబులోంచి మెల్లిగా పన్ను తీసి చూపించాడు.

అది నిజమైన పన్నేనా?"

"ఓ. ఇటు చూడు" అని టామ్ పైపెదవి ఎత్తి తొస్సిచూపించాడు.

"రైట్."

టామ్ జోరిగ. తీసుకుని అగ్గిపెట్టిలో దాచుకున్నాడు. ఇద్దరూ చెరోదారినీ వెళ్లిపోయారు. టామ్ స్కూల్‌దారి పట్టాడు.



సుహాసిని కథ



అనగా అనగా ఒక ధనవంతుడు ఉండేవాడు. ఆయనకు సుహాసిని అనే ఒక కూతురు వుండేది. పాపం ఆ అమ్మాయికి చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. ఆ అమ్మాయిని పెంచేందుకని తిరిగి పెళ్ళిచేసికొన్నాడు. ఆ రెండవ భార్యకు కొంతకాలానికి ఇద్దరు కూతుళ్ళు పుట్టారు. ఈ రెండవ భార్య గయ్యాళిది. ఆ ఇద్దరు పిల్లలూ తల్లికన్నా గడుసువారు. వీళ్ళవలన పాపం మొదటిభార్య కూతురికి కష్టాలు వచ్చాయి. తను అందంగావుంటుందని ఆ సవతి చెల్లెళ్ళు కన్నెర్ర చేసేవారు. వారు అసహ్యంగా వుండేవారు. వీళ్ళందరూ కలసి సుహాసినిచేత వంటపని చేయించేవారు. చింకిపాతలు ఇచ్చేవారు. 'వంటలక్క' అని పిలిచేవారు.

ఆ దేశాన్ని పాలించే రాజుకి ఒక్కగానొక్క కొడుకు వున్నాడు. అతనికి వివాహం చేయాలని రాజు తొందరపడ్డాడు. అందుకని రాజు ఒక పెద్ద నృత్యం యేర్పాటుచేశాడు. ఆ దేశంలోని అందగత్తెలంతా ఆ నృత్యంలో పాల్గొనాలని చాటించాడు. ఆ నృత్యం మూడు రాత్రిళ్ళు జరుగుతుంది. ఆ వచ్చిన అమ్మాయిలందర్లోనూ ఎవరు అందంగా వుంటారో వారినే యువరాజు పెళ్ళిచేసి కొంటాడు.

సుహాసిని చెల్లెళ్ళకు ఆహ్వానం వచ్చింది! ఏ బట్టలు వేసికొంటే అందంగా వుంటామా అని ఆలోచించుకున్నారు. ఒకరికి తెలియకుండా ఒకరు యువరాజు నన్నే పెళ్ళిచేసికొంటాడంటే నన్నే పెళ్ళి చేసికొంటాడని అనుకున్నారు.

'కలిపద భూషణ్'

ఆరోజు వచ్చింది. ప్రొద్దున్నించి సాయంత్రంవరకూ సింగారించుకున్నారు. సుహాసినే వారిని అలంకరించింది. వాళ్ళని చూస్తే సుహాసినికి కూడా ఆ నృత్యం చూడటానికి వెళ్ళాలనిపించింది. 'నేనూ వస్తా'నని అడిగింది. "నీవా వస్తావ్? ఆ చింకిపాతలు ఆ వెధవముఖం వేసికొని ఎల్లా వస్తావ్. పో పో. పొయ్యిదగ్గరకు వెళ్ళి నీపని నీవు చెయ్యి" అని విదిలించివేశారు. ఆ ఇద్దరు అక్కచెల్లెళ్ళూ, వాళ్ళ అమ్మా కలసి రెండు గుఱ్ఱాలబండి మీద వెళ్ళారు. సుహాసిని యేడుస్తూ పొయ్యిదగ్గర కూర్చుంది ఒంటరిగా.

ఆమె ముఖం చేతుల్లో దాచుకుని వెక్కి వెక్కి యేడుస్తుంటే "సుహాసినీ! సుహాసినీ!" అని ఎవరో పిలిచినట్లు వినిపించింది. ఎవరా? అని తలెత్తింది. ఎదురుగా ఒకావిడ నిలబడివుంది. తెల్లని బట్టలు కట్టుకునివుంది. వేలాడుతూన్న పొడుగాటి జుట్టు వుంది.

ఆవిడ ఎక్కడనుండి వచ్చిందో, ఎలా వచ్చిందో సుహాసినికి తెలియదు. తలుపులు, కిటికీలు వేసేసి వున్నాయ్. మరి ఎలా వచ్చిందీ?

"దేనికి ఏడుస్తున్నావ్?" అని ఆవిడ అడిగింది.

"మా అమ్మా, ఇద్దరు చెల్లెళ్ళూ నన్ను వదలివేసి రాజుగారింట్లో నృత్యంచూట్టానికి వెళ్ళారు."


"నీవు కూడా వెళ్తావా నృత్యానికి" అని అడిగింది.

"వెళ్తాను. కాని ఎలా? ఈ చింకిగుడ్డలు చూసి యెవరు రానిస్తారు?" అని వెక్కి వెక్కి యేడ్చింది.

"నీవు మంచిదానవుగదూ. ఏడ్వకమ్మా. నే నెవరో తెలుసా చచ్చిపోయిన మీ అమ్మను. నేను చెప్పినట్లు చేస్తే నీవూ అక్కడకు వెళ్ళగలవు. పరుగెత్తుకుని వెళ్ళి ఆ తోటలోని గుమ్మడికాయ తీసుకురా"

(38-వ పేజీ చూడండి)

పులుల మారిగాడు



శ్రీ భావరాజు వీరేశలింగప్రసాదరావు

అనగనగా ఒక వూళ్ళో ఒక అబ్బాయి వుండేవాడు. అతని పేరు రంగడు. ఆ అబ్బాయికి ఒక మేనత్త వుంది. ఆవిడ ఒకసారి రంగడిని వాళ్ళింటికివచ్చి కొన్నాళ్ళుండమని ఒక కార్డురాసింది. అది చూసి రంగడు మురిసిపోయాడు. వాళ్ళ నాన్నతోటి, అమ్మతోటి చెప్పగా "సరే అలాగే వెళ్ళు" అన్నారు. వెంటనే గంతులు వేసుకుంటూ రంగడు మేనత్తగారి వూరికి బయలుదేరాడు.

ఆ మేనత్తకి ఒక చిన్న కూతురు కూడా వుంది. రంగడి వయస్సు ఆ అమ్మాయి వయస్సుకూడా ఒకటే. ఆమెకీ రంగడికీ ఎంతో స్నేహం. మరి ఆ అమ్మాయికి ఒక బహుమతి పట్టుకువెళ్ళొద్దూ? అంచేత మంచి అందమైన అద్దం ఒకటి బుల్లిది కొన్నాడు. వాళ్ళ నాన్న ఒకసారి చిన్న బ్యాటరీ లైటు కొనిచ్చాడు రంగడికి. ఆ రెండూ చిన్న సంచీలో పెట్టాడు. ఆ సంచీలోనే నాలుగు రొట్టెలు, రెండు చొక్కాలూ, నిక్కర్లూ, ఒక దుప్పటి, తువ్వాలు అన్నీ పెట్టి జాగ్రత్తగా సర్దాడు. బూటు వేసుకొని టిక్‌టాక్ మంటూ బయలుదేరాడు.

వాళ్ళ మేనత్తగారి వూరు చాలా దగ్గరే-కాని మధ్యలో ఒక పెద్ద అడవివుంది. అందులో పగలుఅంతా మామూలుగా నడిచిపోతారు. రాత్రిళ్ళు ఎవరో కాని ప్రయాణం చెయ్యరు.

రంగడు ఆ అడవిదగ్గరకు వచ్చేసరికి మిట్టమధ్యాహ్నం అయింది. కడుపులో బాగా ఆకలి వేసింది. అక్కడ ఒక చిన్న కాలవ వుంటే దాని ఒడ్డున కూర్చొని, రొట్టెలు తిని కడుపునిండా ఇన్ని మంచినీళ్ళు తాగాడు.

మళ్ళీ బయలుదేరాడు. దారిలో రకరకాల చెట్లూ, చెట్లనిండా పళ్ళూ కనిపించాయి. అవన్నీ కోసుకుతినాలని బుద్ధిపుట్టింది రంగడికి. ఏదైన తోస్తే చాలు వెంటనే చేసేస్తాడు. అతడికి మంచి సాహసం, తెలివి వున్నాయి. ఎంత పెద్ద చెట్టైనా ఇట్టె ఎక్కేస్తాడు. అందుచేత జామచెట్లు, మామిడి చెట్లు, ఒకటేమిటి అన్ని చెట్లూ ఎక్కి పండ్లు కోసుకుని తినడం మొదలెట్టాడు. దాంతో బాగా అలసిపోయాడు. ఎండకూడా చాలా తీవ్రంగా వుందేమో వెంటనే ఒక మామిడి చెట్టుక్రింద పడుకొని గాఢంగా నిద్ర పోయాడు.

అతను మళ్ళీ లేచి చూసేసరికి బాగా చీకటిపడింది. "అయ్యో తెలివితక్కువగా నిద్రపోయానే! వెళ్ళవలసింది ఇంకా చాలా దూరంవుంది" అంటూ గబగబా లేచి ముందుకు నడిచాడు.

ఇంతలో కాండ్రు కాండ్రు మని పులి వొకటి పొదలలోంచి బయటకు వచ్చింది. పాపం! రంగడు హడలిపోయాడు. కాళ్లూ చేతులూ వణికాయి. "దిక్కుమాలిన నిద్ర ఎందుకుపోయానురా" అని విచారించాడు. కాని ఏంలాభం! పులి చాలా దగ్గరగా వుంది. పారిపోదామన్నా సందులేదు. భయపడి మాత్రం ఏంజేస్తాడు.? అందుచేత ఎలాగోలాగ ధైర్యం తెచ్చుకొని, కళ్ళురెండూ పెద్దవిచేసి దాని వైపు కోపంగా చూశాడు. పిడికిలి

బిగించి కాళ్ళు బాదుతూ పులివైపే పడిచిపోయాడు.

పులికి చాలా ఆశ్చర్యం కలిగింది. దానికి గుండెలు దిగజారిపోయాయి. తనని చూస్తే మనుష్యులంతా పారిపోతారే! "అరే! వీడెవడో నావైపే వస్తున్నాడు! బాబోయ్ వాడికళ్ళు నా కళ్ళల్లోకే చూస్తున్నాయి! పారిపోనా యేమిటి" అని పులి ఆలోచించి ఆగింది. అయినా వీడెవడో అడిగి తెలుసుకుందాం, అని దగ్గరగా వచ్చింది.

"ఏ అబ్బాయ్! ఆగు! ఎవరు నువ్వు! ఈ రాజ్యంఅంతా నాదని తెలియదూ! మహా ధైర్యంగా వస్తున్నావు. నీ పేరేమిటి? అని దబాయించింది.

"పులుల మారిగాణ్ణి" అని గట్టిగా అరిచాడు రంగడు. "మహాయజ్ఞం చేస్తున్నాను. పులుల్ని బలియ్యాలి. కొన్ని దొరికాయి. ఇంకా కావాలి. దూరంనుంచి చూశా. నువ్వు దొరికావు. ఇంక తప్పించుకోలేవు. రా. సంచిలో పెట్టేస్తా. తీసుకుపోతా. హ్రాం, హ్రూం, హ్రేం." అని మొదలెట్టాడు రంగడు మంత్రాలు చదువుతూ.

పులికి కాళ్ళు వణికిపోయాయి. రంగడు శివమెత్తినట్లుగా చిందులు త్రొక్కుతున్నాడు. కాని పులికి ఒక సందేహం వచ్చింది. అదేమిటంటే—తనంత పెద్ద జంతువుని అంత చిన్న సంచీలో ఎలా పెట్టగలడా? అని.

ధైర్యంచేసి అడిగింది పులి. "నన్ను అంతచిన్న సంచిలో ఎలా పెట్టావు" అని. వెంటనే రంగడు బ్యాటరీలైటు తీసి నొక్కాడు. పులి కళ్ళల్లోకి సూటిగా వెళ్ళిపడింది వెల్తురు. కళ్ళు జిగేలుమన్నాయి. ఆ వెలుతురు చూడలేకపోయింది. బుఱ్ఱ అటూ ఇటూ ఎంతో త్రిప్పింది. కాని ఎటు చూచినా కళ్ళు విప్పకోలేదు. రంగడు లైటు ఆర్పేశాడు.

రంగడిదగ్గర చిన్న అద్దంకూడా వుందికదూ. అది తీసి పులి ఎదురుగుండా పెట్టాడు. అందులో పులికి ఇంకొక చాలా చిన్నపులి కనబడింది. "చూశావా! ఇప్పుడు తెరిచాసే, నా దివ్యనేత్రం. దాంతో ఇంకాసేపు చూస్తే ఎంత పెద్ద జంతువైనా ఇట్టే బుఱ్ఱ వేడెక్కి టప్పమని చస్తుంది. అప్పుడు ఈ అద్దంలో పులుల్ని నొక్కేసి చిన్నవిచేసి సంచిలో పారేస్తాను." అని ఆ అద్దం మళ్ళీ సంచీలో పెట్టాడు.

పులికి ఇదంతా నిజంగానే తోచింది. సంచినిండుగా వుండడం చూసి "బాబో ఎన్ని పులుల్ని పట్టేశాడో! నిజంగా పులుల మారిగాడే వీడు" అని అనుకుంది. ఇంక అతన్ని ప్రార్థించడం మొదలెట్టింది. "మహాప్రభో క్షమించు. ఇంకెప్పుడూ నీకంటబడను. ఈసారికి నన్ను విడిచిపెట్టు." అని బ్రతిమాలింది.

ఇంతలో జిత్తులమారి నక్క అక్కడకు వచ్చింది. "ఏమండోయ్ పులిరాజా! ఏమిటి, అలా ప్రాధేయ పడుతున్నారు. సంగతేమిటి" అని అడిగింది. పులి భయపడుతూ అంతా చెప్పింది. కాని నక్క చాలా మోసకారిగదా. అది ఇట్టే గ్రహించింది, ఇదంతా వట్టి కపటనాటకం అని. అయినా, ఏమో, నిజంగా వాడిలో అంత మంత్రశక్తి వుందేమో, అనికూడా సందేహించింది.

నక్క పులిచెవిలో ఏవేవో చెప్పింది. నక్క ఆలోచన ఏమంటే యితన్ని పులుల గుహదగ్గరికి ఎలాగో తీసుకువెళ్ళాలి. అక్కడ పులులు ఇతన్నైనా చంపుతాయి. లేకపోతే అతనే పులుల్ని చంపుతాడు. రెండువిధాలా లాభమే. పులికి కావలిసినంత మాంసం దొరుకుతుంది.

నక్క రంగడితో ఇలా అంది. "ఓ అబ్బాయీ! మా పులిరాజు చాలా మంచివాడు. నిన్ను తన యింటికి తీసుకువెళ్ళి అతిథిసత్కా

కాలన్నీ చేయాలని కోరుతు న్నాడు. కాబట్టి నీవు తప్పకుండా మా పులిరాజుఇంటికి వచ్చి ఆయన చేసిన సత్కారం పొంది, తరవాత కావలిస్తే ఆయన్ని చంపి తీసుకువెళ్ళొచ్చు," అన్నది. పులి రాజుకూడా రమ్మని బలవంత పెట్టాడు.

అబ్బ! చాలా చిక్కువచ్చిందే! ఏదో పులి వదిలిపోయిందంటే, నక్కవచ్చి పట్టుకుందే! ఏం చెయ్యాలిరా భగవంతుడా! అని రంగడికేమీ తోచలేదు. ఇంత వరకు వచ్చినతరువాత సందేహిస్తే లాభం లేదు. గుట్టు కాస్తా బయట పడుతుంది.

రంగడు ధైర్యంచేసి "సరే పదండి యీవేళ రాత్రికి మీయింట్లోనే వుంటాను." అన్నాడు.

పులీ, రంగడూ, నక్కా, ముగ్గురూ బయలుదేరారు. చివరకి పులిరాజుగుహ చేరుకున్నారు.

ఆనాటివేళ రాత్రి పులిరాజింటికి చాలామంది చుట్టాలు వచ్చారు. మేనమామబిడ్డలూ, మేనత్తకొడుకులూ, అప్పలూ, చెల్లెళ్ళూ, అంతా వచ్చారు. కాని పులిరాజు ఇంత రాత్రిపడి సా యింటికి రాలేదు అని అవన్నీ ఎదురుచూస్తూ గుహముందర చిన్న చలిమంట వేసుకుని చుట్టూ కూర్చు న్నాయి వెచ్చదనంకోసం.

ఇంతలో పులిరాజు, రంగడూ నక్కా అక్కడ ప్రత్యక్ష మయ్యారు. "అమ్మయ్య" అను కున్నాయి పులులన్నీ. నక్క వాటిని చాటుగా తీసుకుపోయి సంగతంతా చెప్పింది. ఇంకా ఏమిటో రహస్యంగా చెప్పింది.

ఆవేళ రంగడికి తియ్యటి పాయసాలూ, కమ్మటి కూరలతో భోజనం పెట్టాయి పులులు. నక్క చెప్పినప్రకారం ఒక ప్రత్యేక గుహలో ఇతనికి పడుకోడానికి పక్క ఏర్పాటుచేశాయి. సరే రంగడు భోజనం చేసివచ్చి ప్రక్క మీద పడుకున్నాడు.

పడుకున్నాడేగాని రంగడికి నిద్రపట్టటంలేదు. పేరుకి పులుల మాదిరిగానేగాని అంతా మేకపోతు గాంభీర్యం. గుండెలు భయంతో టకటకా టకటకా కొట్టుకుంటు న్నాయి.

పులులు ఏంజేస్తున్నాయో చూడాలని బుద్ధిపుట్టింది. అయినా రాత్రి పక్కమీదే మురచిపోయి నిద్రపోతే ఏం ప్రమాదమో! అంచేత రహస్యంగా వెళ్ళి అంతా కనుక్కోవాలి. అని లేచాడు. ఆకులన్నీ పేర్చి వాళ్ళే అక్కడ ఒక మనిషి పడుకున్నట్లుగానే పరిచాడు. అలా పేర్చి దానిమీద సంచీలో వున్న దుప్పటి తీసి కప్పాడు.

బయటకు వెళ్ళి మెల్లిగా పాకుతూ ఇటూ అటూ జరుగుతూ వచ్చాడు. కొంచెందూరంలో పులులన్నీ కలిసి ఒక పెద్ద సభ చేశాయి. సభకు పులిరాజే అధ్యక్షుడు. నక్కబావ ఉపన్యాసం మొదలెట్టాడు. "అయ్యా, సోదరులారా! మన అరణ్యానికి ఒక మహామంత్రగాడు వచ్చాడు. పులులన్నింటినీ చంపి సంచీలో వేసుకు పోతున్నాడు. (ఆ మాటలు వింటుంటే పులులకన్నిటికీ వణుకు మొదలెట్టింది. బిక్కమొగం వేశాయి). ఇవాళ పులిరాజును కూడా చంపేసును. కాని ఏదో మోసంచేసి ఇలా లాక్కొచ్చాను. ఆ గుహలో పడుకున్నాడు. ఎలాగో యీవేళరాత్రి అతన్ని చంపెయ్యాలి. లేకపోతే తెల్లారిందంటే మనల్ని బ్రతకనియ్యడు. దానికి మనమంతా ఉపాయం పన్నాలి. మీలో బుద్ధిమంతులు లేచి చెప్పాలని నా ప్రార్థన"

పులులన్నీ చప్పట్లు కొట్టాయి. కాస్సేపు అయింది. ఎవరికీ ఆలోచన తోచలేదు. ఆఖరుకి పులిరాజు పీఠంనుంచి లేచి ఇలా అన్నాడు. "నక్కబావ చెప్పిందంతా నిజం. నక్కబావ చాలా కుశాగ్రబుద్ధి. అందుచేత ఆ వుపాయంకూడా అతడే చెప్తే బాగుంటుంది."

పులులన్నీ నక్కని మాట్లాడాలని కోరాయి. సరేనంటూ, నక్క ఇలా చెప్పింది. "అతనిదగ్గర దివ్య

నేత్రం వుంది. అదిగనక తెరిచి వుంటే దగ్గరకు వెళ్ళకూడదు. అందుచేత అది మూసివున్నప్పుడు, గాఢంగా నిద్రపోవడం చూసి, చప్పుడుచేయకుండా దగ్గరికి వెళ్ళాలి. ఒక గునపంతో సూటిగా అతని గుండెల్లో గుచ్చెయ్యాలి. దాంతో టప్పుమని చస్తాడు."

దీనికికూడా పులులు చప్పట్లు కొట్టాయి. కాని ఒక ముసలిపులి లేచి "నాయనలారా! అంతా బాగానేవుంది. కాని, గునపం పట్టుకు అతనిదగ్గరికి ఎవరెడతా" రంది.

ఒకళ్ళమొహాం ఒకళ్ళు చూసుకున్నాయి. నేను కాదంటే నేను కాదని తప్పుకున్నాయి అన్ని పులులూను. ఆఖరుకి పులిరాజు లేచి, "మన కింత ఉపకారం చేసిన నక్కబావ యీమాత్రం చేసి పెట్టకపోడు. అతని ధైర్యానికి మనమంతా ఆశ్చర్యపోతాం, చూడండి" అన్నాడు.

నక్కగారికి చచ్చినంత పనయింది. ఇది తన నెత్తిమీదే పడ్తుందని అనుకోలేదు. కాని చివరికి అందుకు ఒప్పుకోక తప్పలేదు.

రంగడు మెల్లిగా మళ్ళీ లోపలికి వచ్చి బండరాయి ప్రక్కన దాక్కున్నాడు. అనుకున్నంతపనీ అయింది. నక్క పెద్దగునపంతో వచ్చింది. దుప్పటిముసుగు చూసి "దగ్గరికి వెళ్తే లేస్తాడు." అని కొంచెందూరంనుంచే గునపం ఎత్తి సరిగ్గా గుండెల్లో పొడిచేసింది. గునపం భూమిలోకి దిగిపోయింది. "అంతాఅయినట్టే. కొంచెం ప్రాణం వున్నా తెల్లారేసరికి చస్తాడు." అని నక్క బయటికి వచ్చింది.

కాస్సేపు అయ్యేసరికి పులులికి చచ్చాడో లేడో చూద్దామని బుద్ధి పుట్టింది. "పదండి అంటే పదండి" అని అన్నీ మళ్ళీ రంగడు వున్న గుహదగ్గరికి వచ్చాయి. ఇదంతా చూసి రంగడు వెంటనే వచ్చి పక్కమీద దుప్పటీ ముసుగు తన్ని పడుకున్నాడు. గునపం తీసి జాగ్రత్త చేశాడు.

ఒక చిన్న పులి సాహసంచేసి లోపలికి వచ్చి మెల్లిగా ముసుగు లాగింది. ఇంకేముంది! హ్రాం హ్రీం, హ్రూం, అని లేచాడు పులుల మారిగాడు. ఆ గునపంతో పులి డొక్కలో ఒక్క పోటు పొడిచాడు. "బతికే వున్నానర్రోయ్" అంటూ ఆ చిన్నపులి ఒక్క గంతు బయటకు వేసి అదే పరుగు లంకించుకుంది.

అరుపుని వినడంతో తక్కిన పులులన్నీ పలాయనం చిత్తగించాయి. కొన్ని, ఆ కంగారులో కొండమీంచి దొర్లిపోయి పల్టీలుకొట్టాయి. కొన్ని గమ్మత్తుగా పిల్లిమొగ్గలు వేశాయి.

పులిరాజు అందరికన్నా ముందే కాలికి బుద్ధిచెప్పాడు. ఆ కంగారులో నక్క అడ్డం వచ్చింది. పులిరాజు నక్కమీద గభీలున పడ్డాడు. పాపం! ఆ దెబ్బకి నక్క చచ్చిపోయింది.

ఇంక పులుల భయం లేదు. తెల్లారేవరకు రంగడు అక్కడే వున్నాడు. ఆ గుహలో బోలెడు నగలూ, రత్నాలూ దొరికాయి. వాటితో సంచీ నిండిపోయింది.

ఇంకో గంటకి మేనత్తగారిల్లు చేరాడు. మేనత్తా, కూతురూ కూడా ఇతన్ని చూసి ఆశ్చర్యపోయారు. ఆ నగలన్నీ వాళ్ళకి చూపించాడు. ఆ తరువాత మధ్యాహ్నం సావకాశంగా తన కథంతా చెప్పాడు. మేనత్త ముక్కుమీద వేలు వేసుకొని అరె! పులుల మారిగాడా! అంది.

ఒక చీకటిరాత్రి

(10-వ పేజీ తరువాయి)

నాయుడు కొనా పక్కనించి గబుక్కి వొస్తున్నాడు.

"అరిఘా లా! నువ్విక్కడనక్కి వున్నావూ?" అన్నాను.

లేకపోతే తమురు నైటేస్తప్పుడు ఆల్లకి కనిపించనా?"

అందుకే రామక్రిష్ణమీదికి ఫోకస్ చేసినప్పుడు వీడు కనిపించలేదు. తెలివైనవాడే ఎలాగయితే నేం.

కాని వాడు ఎంత వుపకారం చేసినట్టు. ఇరవై రూపాయల ఖరం చూపించాడు. వాడిది చాలా వుదార స్వభావంలా తోచింది నాకు. ఎంత ఇస్తే బాగుంటుంది?

వాణ్ణి ఆపక్కని నిలబెట్టి రామక్రిష్ణని అడిగాను. "ఏమిరా, వీడి కెంత యిద్దాం?"

"పందొమ్మిదున్నాయి కదూ! మూడిచ్చెయ్. ఎనిమిదేసివుంటాయి మనకి."

"ఒరే, యిస్తూ యిస్తూ మూడేమిట్రా - అయిదేనా లేకుండానా? నిజానికి వాడు మనకి ఎంత ఉపకారం చేసినట్టు?"

"అయిదిస్తే మనకి ఏడేసి అవుతాయి. కొడుతూ కొడుతూ ఏడేసేమిటి- ఏడున్నర వుంటుంది నాలుగిచ్చెయ్."

ఇదో మోస్తరుగా వుంది. నాయుడుని పిలిచి నాలుగు రూపాయలూ లెక్కబెట్టి యిచ్చేశాను.

రామక్రిష్ణగాడు తెగనవ్వుతున్నాడు. స్కూల్లో జీరోలూ, డిజిట్ మార్కులూ వొచ్చేవి నీకు. ఇంతటివాడి వెలా అయ్యావు అని అభినందిస్తున్నాడు.

ఒంటిగంట న్నరయ్యేసరికి బంగాళా చేరుకుంటున్నాం.

అప్పటికి వరండామీద లైటు వెల్గుతోంది. ఓ కుర్చీమీద టి. యస్. ఓ. గారూ మరోకుర్చీమీద పంతులుగారూ కూర్చున్నారు. ఇదేమిటి చెప్మా రాత్రి ఒంటిగంట దాటాక ఆరాత్తుగా టీ. యస్. ఓ గారు లేచికూచున్నారు. అని నేను ఆశ్చర్యపడుతున్నాను.

"ఏదో పనుండి పంతులుగారు లేపివుంటార్రా" అన్నాడు రామక్రిష్ణ.

పంతులుగార్ని చూడగానే అకస్మాత్తుగా నాకో విషయం జ్ఞాపకానికొచ్చింది.

"ఒరే - పాపం పంతులుగారు సాయంత్రం సిగరెట్లు లేని ఆపత్సమయంలో మనకి సిగరెట్లిచ్చి వుపకారం చేస్తే ఆయన కిలా చేశాం; మనదేనురా, ధర్మ మన్నప్పుడు!" అన్నాను.

"లేకపోతే యేమిటనుకున్నావురా!" అన్నాడు రామక్రిష్ణ ఇదంతా వాడిప్రతాపమే అయినట్టు. ఇంకా ఇలా అన్నాడు. "ఉపకారికి నపకారము నెపమెన్నక సేయువాడె నేర్పరి సుమతీ! అన్నాడు కలి ధర్మస్మృతిలో"

"ఆహాఁ? ఈ కలి ధర్మాలూ, స్మృతులూ ఎవడిదగ్గిర నేర్చుకున్నావురా?" అని నేను గురుత్వంతో నవ్వాను.

టీ, యస్. ఓ గారు మామీద చాలా కోపంగా ఉన్నారు. "రండిరండి - మీకు ఘట్టిగా ఓ చురక వేస్తేనేగాని బుద్ధిరాదులా వుంది. నేను డి. యస్. ఓ. కి రాసేస్తానండి. ఇంతటి వాళ్ళయ్యారన్నమాట! మీకీ లంచంపుచ్చుకోడం ఎలా అలవాటయింది. వేషాలు వెయ్యదలుస్తున్నారే! ఇలా ఎందర్ని మోసం చేశారు. మీకు గూఢచారులు కొందరా? మీకేమన్నా బుద్ధులున్నాయా? తిన్నయింటికే వాసాలు లెక్కపెడుతున్నారే! లోగడ వొచ్చినప్పు డెవరింట్లో భోంచేశారో జ్ఞాపకం లేదేం, ఏమయ్యా యింతంత ఘోరాలకి తలపెట్టారు? ...... పోనీ ఏదో చేశారు. పంతులుగారు మంచివాళ్ళే - పడెయ్యండి- ఎంత తీసుకున్నారు? ఇరవైటు; ఆయిరవై ఇలాపడెయ్యండి." అన్నారు.

నాకు మీదప్రాణాలు మీదనే ఎగిరి పోయాయి.

పంతులుగారన్నారు "నేను మామూలుగా రామమందిరంలోకి పేకాటకి పోయాను. ఆ వెంకడొచ్చి అర్జంటుగా ఇరవై రూపాయలు కావాలి; ఇలా యిలా ప్రమాదం వొచ్చింది. టీ, యస్. ఓ. గారు బస్తాలు పట్టేసుకున్నారు. అని చెప్పేట్ట. పోనీ నాకు కబురేనా పంపేడు గాదు, తేల్చేద్దును. మన ఏర్పాటు వాడికేం తెలుసునూ, మా అబ్బాయి తీసిచ్చేసేడు."

"పోనీ ఇప్పుడు మించిపోయిందేమిటి? పడేయండోయి ఆ యిరవై. రూపాయలూ ఇలాగ!" అన్నారు టీ. యస్. ఓ. గారు.

టీ. యస్. ఓ. గారు సాయంకాలమే పంతులుగారిదగ్గిర ఓ పెద్ద మొత్తాన్ని "మామూళ్లు" గా తీసుకోవడమే వారిప్పుడు ఆయనమీద చూపుతున్న అభిమానానికి కారణమని మాకేం తెలుసూ?

క్యూ

(19-వ పేజీ తరువాయి)

మాటలు నడిచాయి. ఆ తరువాత మాటలకి, మాటలు బదులుపలికాయి. ఏదో అవ్యక్తానందాన్ని అనుభవించడంకోసమన్నట్లు, వారు మరికొంతకాలంతరువాత "క్యూ" నివిడిచిఎక్కడికో వెళ్ళిపోయినారు. అవ్యక్తానందాన్ని అనుభవించడం కోసం "క్యూ" ని వదిలివెళ్ళడం అవసరమేమోనని, నాకు తోచింది.........

మెదడు గిర్రున తిరిగింది...."క్యూ" రూపంలో ఆలోచనాపరంపరలు నా మెదడును చుట్టివేశాయి.....క్రమేణా ఈ ఆలోచనలు, ఒక నిర్దుష్టస్వరూపాన్ని పొందాయి......

చావుబ్రతుకులనుబట్టి చూస్తే, మానవులంతా, మానవమాత్రులుగా, ఒక "క్యూ" లో యిముడుతారు. ఒకరి తరువాత ఒకరు పుట్టడం, చివరకి గిట్టడం - దీనిని మానవమాత్రు డెవ్వడూ, ఇంతవరకు తప్పించుకో లేదు - "క్యూ" పద్ధతి అది మానవుడితో పుట్టింది - మానవప్రళయంతో అంతమొందుతుంది.

ప్రపంచమంతా "క్యూ"ల మయం. ఇందులో కొన్ని సహజమైనవీ, మరికొన్ని కృత్రిమమైనవి —

ఆదికవి వాల్మీకి కవుల "క్యూ"లో మొదటివాడు - ఈ "క్యూ" ఇంకా అంతం కాలేదు - కవిత్వం చచ్చి వూరుకున్ననాడు అంతమొందుతుంది. ఇదేవిధంగా, సంఘసంస్కర్తలది ఒక క్యూ - విజ్ఞానశాస్త్రవేత్తలది మరొక "క్యూ".

మానవమాత్రులు ఈ క్యూలని తప్పించుకోలేరు - సహజాసహజప్రసక్తి అటుంచి మరలు యంత్రంలో యిమిడినట్లే వారు ఏదో ఒక "క్యూ"లో యిమడక తప్పదు -

సహజమైన "క్యూ"లు ప్రగతిని ఆహ్వానిస్తాయి-మానవాభ్యుదయానికి సుస్వాగతం చెబుతాయి - మానవునిలో, క్లిష్టపరిస్థితుల్ని అధిగమించే శక్తినీ, ఉత్సాహాన్ని జాగరితం చేస్తాయి.

చీకటిబజారువర్తకులు, మతగురువులు, బూటకపు రాజకీయవేత్తలు, దోపిడిదారులు, హంతకులు, కృత్రిమమైన "క్యూ"లు ఏర్పర్చుకొని మానవాభ్యుదయానికి హానికరంగా పరిణమిస్తున్నారు - బ్రాహ్మలూ, రెడ్లూ, హరిజనులూ మొదలైన కృత్రిమమైన గోడల్ని నిలబెట్టి, సోదరమానవులమధ్య చీలికల్ని ఏర్పరుస్తున్నారు. ఈ కృత్రిమమైన "క్యూ"లు అమూలాగ్రంగా నశించడం అవసరమని నాకు తోచింది. వాటిని మూలచ్ఛేదం చేయడం మానధర్మమని, హృదయం హోరెత్తింది. ఆ అదృష్టం మనకి ఏనాటికైనా పడుతుందా? "ఏమోనని" ప్రస్తుతం నాహృదయం నిరాశతో మూల్గుతున్నది.......

1-11-50

సినీ మా:

సినిమాచిత్రాల విభజనకు అర్థంలేదు

దక్షిణదేశంలో తయారయే చిత్రాలను గురించి, అందులోనూ, తెలుగు చిత్రాలనుగురించి, ఇది పౌరాణిక చిత్రాలు, ఇవి సాంఘికచిత్రాలు, ఇవి జానపదచిత్రాలు, ఇవి చారిత్రకచిత్రాలు అనుకోవటం కొంతవరకు హాస్యాస్పదంగా కనిపిస్తుంది.

మన కిప్పుడు వాడుకలో ఉండే విభజన కేవలం ఇతివృత్తానికి చెందినది. ఇంకా అనేక విధాలుగాచిత్రాలను విభజించవచ్చు. చిత్రాలమీద ఖర్చుచేసే డబ్బునుబట్టి, ఆర్డినరీ, సూపర్, సూపర్ - సూపర్ చిత్రాలని విభజన చేయవచ్చు. కథా శిల్పాన్నిబట్టి డ్రామా, మ్యూజికల్, కామెడీ, ట్రాజెడీ, మ్యూజికల్ కామెడీ, ఫార్స్ అని విభజించవచ్చు. సెట్టింగులూ, దుస్తులూ వగైరాలను బట్టి, పీరియడ్ కాస్ట్యూమ్ చిత్రాలని విభజించవచ్చు. సెల్యులాయిడ్‌నుబట్టి కలర్, బ్లాక్ అండ్ వైట్ అనవచ్చు.

ఏ విధమైన విభజనచేసినా ఆ విభజనకు సార్థకత అంటూ ఉండాలి ప్రస్తుతంవాడుకలో ఉన్న విభజనలో ఆ సార్థకతే లోపిస్తున్నది.

భారతదేశంలో సినిమాలు- మూకీలు- పౌరాణికచిత్రాలుగానే ప్రారంభమైనాయి, కాని అప్పటికి వాటికి పౌరాణికచిత్రాలన్న నామధేయంలేదు. వాటితో బాటే కొన్ని స్టంటుచిత్రాలుకూడా వచ్చాయి. "అనార్కలీ" మొదలైన చారిత్రకచిత్రాలు కూడా వచ్చాయి. అప్పట్లో సోషల్ చిత్రం అంటే అది అంతో ఇంతో స్టంటుతో కూడుకుని ఉండేది. అందులో రాజులూ, మంత్రులూ, గజదొంగలూ, కథానాయికలను విలన్ నుంచి రక్షించేకథానాయకులూ, గుర్రాలు పరిగెత్తటాలూ, కత్తులపోట్లాటలూ ఈ సోషల్ చిత్రాల్లో ఉండేవి. వీటికే ఈనాడు మనం జానపదచిత్రాలన్న మాట ఉపయోగిస్తున్నాం. మూకీల యుగంలో ఏ తరగతిచిత్రానికి డబ్బు హెచ్చు వస్తుందన్న సమస్యే ఉండేది కాదు. ఆ చిత్రాలలో "వినేది" లేదుకనక "చూసేది" ఏమున్నా ఉందా అన్న సమస్య ఒకటే ప్రేక్షకుల కుండేది. కథకు—కనీసం సంఘటనలకు - పూర్తి విలువ ఉండేది.

ఇవాళ మనం చిత్రాలను పౌరాణికా సాంఘికాలనీ, జానపదాలనీ అనుకుంటున్నాం. పౌరాణికాల యుగం అయిపోయిందనే చెప్పవచ్చు. ఇవాళ మనం వెనక్కు తిరిగి చూసుకుంటే మన పౌరాణిక చిత్రాలలో నిజమైన పౌరాణిక చిత్రం అనదగినది ఒక్కటైనా ఉందా? కథలు పౌరాణిక కథలన్నది మినహాయిస్తే ఆచిత్రాలలో పౌరాణికచిత్రాల కుండదగిన లక్షణం ఒక్కటిలేదు. పౌరాణికచిత్రాలు తియ్యటంలో పెద్ద చిక్కు, ఆయా పురాణపురుషుల పాత్రలు ధరించడానికి సరి అయిన పాత్రధారులను తేవడం. రాముడు, కృష్ణుడు, మహావిష్ణువు, ఇంద్రుడు, విశ్వామిత్రుడు, సీత, రుక్మిణి, సత్యభామ, సావిత్రి - ఇటువంటి పాత్రలకు ఎటువంటి ముఖాలూ, ఆకారాలూ నియోగించబడ్డాయో మనలో చాలామంది కింకా జ్ఞాపకం ఉన్నది. వేషధారణలో కూడా పురాణయుగమన్న భ్రమ కలిగించటానికి చిత్రనిర్మాతలు ఎట్టి ప్రయత్నమూ చేయలేదు. ముఖ్యంగా స్త్రీపాత్రలు సాంఘిక చిత్రాలకు ధరించే వేషాలే ధరించారు - చిన్నచిన్న కిరీటాలు మినహాగా అనేక చిత్రాలలో పాత్రలవయసుకూడా పాటించబడలేదు.

సెట్టింగుల విషయంలోనన్నా పురాణ చిత్రాలలో ప్రత్యేకత చూపబడలేదు. అంతకు పూర్వం "సోషల్" చిత్రాలలో కనిపించిన రాజ దర్బారువంటివే జనకుడు మొదలైన పురాణరాజుల దర్బార్లుగా చూపబడ్డాయి.

పురాణచిత్రాల యుగం 1937,38 ప్రాంతాల వెనకబడి సాంఘికచిత్రాల యుగం వచ్చింది, ఇది సాంఘికచిత్రాల యుగం కావటానికి ప్రధానకారణం ఆర్థిక కాటకం ఇదే చౌకచిత్రాలయుగం కూడానూ. పెద్ద పెద్ద డ్రెస్సులతోనూ, సెట్టింగులతోనూ పనిలేకుండా, ప్రజాదరణ సంపాదించటానికి సాంఘిక సమస్యలు అడ్డంపెట్టుకుని, ఆర్థిక కాటకం ప్రజలలో తెచ్చిపెట్టిన సాంఘికచైతన్యాన్ని ధనార్జనకు వినియోగపరుచుకుంటూ చిత్ర నిర్మాతలు సాంఘికచిత్రాలు తీశారు. వీటిలో కొంత అల్పహాసంఉన్నా



రభస చేయడంలో రాణకెక్కాడు సి. ఎస్. ఆర్. సారథి, కో. భాస్కరరావుల సంయుక్తనిర్మాణం 'అగ్నిపరీక్ష'లో లక్ష్మీకాంతం బాకుచూపి భయపెట్టేవరకూ వచ్చింది వ్యవహారం!

నిజమైన సాంఘిక వాస్తవికత లేదు మాల పిల్లగా చూపబడ్డ పాత్ర మాలపిల్ల కాదు రైతుగా చూపబడ్డవాడు రైతూ కాడు కాని ప్రేక్షకులు ఖరీదైన డాన్సులుగాని, దుస్తులుగాని, సెట్టింగులుగాని అడగకుండా చిత్రంచూసి ఆనందించటానికి సాంఘిక సమస్య లన్నవి తోడ్పడ్డాయి

ఆర్థిక కారణాలవల్ల చిత్రనిర్మాణంలో సాంఘికచిత్రాలయుగం ఏర్పడిం దను కున్నాం అంటే ఈ యుగంలో చిత్ర నిర్మాణం ఖర్చు పూర్వంకన్న తగ్గిందని కాదు అది క్రమంగా - తారల వేతనాలతో బాటు - పాముకాటులాగా హెచ్చుతూనేవచ్చింది కాని ఈ కాలంలో చిత్ర నిర్మాణంలో కలిగే అభివృద్ధి యావత్తూ పౌరాణికచిత్రాలలో ప్రదర్శించవలసి వచ్చినట్లయితే అట్టి పౌరాణిక చిత్రం సాంఘిక చిత్రంకంటె చాలా హెచ్చు ఖరీదు అయిఉండేది "నలదమయంతి" చిత్రం ఈ విధంగా అయింది కూడాను ఈసంగతి ఆ రోజుల్లో అందరు చిత్ర నిర్మాతలూ బహిరంగంగా ఒప్పుకున్నారు యుగధర్మం ప్రభావమేగాని చిత్ర విభజనకు మరొక ఆధారం నిజంగా లేదనటానికి మరొక ఉదాహరణకూడా చూపవచ్చు "నలదమయంతి" చిత్రంతో బాటు దేశంలో విడుదల అయిన సి పుల్లయ్యగారి "సత్యనారాయణవ్రతం" అన్న చిత్రం, ఇతి వృత్తాన్ని బట్టి, పౌరాణికచిత్రంకింద జమచేయవలసినా అది అచ్చసాంఘిక-చిత్రంగా తీయబడింది ఇంతకంటె కూడా మంచి నిదర్శనం దీని తరువాత తీయబడిన "భస్మాసుర" ఇందులో భస్మాసురుడూ, శివుడూ, మోహినీ మొదలైన పాత్రలు ఎటూగాని వ్యావహారికం కూడా మాట్లాడారు దీని ఖర్చు సాంఘిక చిత్రానికి అయినంతే అయింది ఇతిహాసంకింద జమకట్టదగిన "చింతామణి" కథ సాంఘికచిత్రంగా తీయబడటం కూడా ఆ యుగప్రభావమే పురాణచిత్రాల కాలంలో దాని నెవరూ తీయటానికి ప్రయత్నించలేదు ఇదే "జయదేవ" చిత్రానికీ వర్తిస్తుంది

సినిమా చిత్రనిర్మాణంలో - శిల్పంలో - కలిగిన కొన్ని పరిణామాలు జానపదచిత్రాలనే వాటికి దారితీశాయి ప్లేబాక్ వచ్చాక పాటపాడగల తారల అవసరం తీరి పోయి అందమైన ముఖాలకు ప్రాముఖ్యం హెచ్చింది బ్రహ్మాండమైన సెట్టింగులూ, చక్కని ఛాయా-చిత్రగ్రహణమూ, నిర్దుష్టమైనది రికార్డింగూ, అంతులేని స్టూడియో సౌకర్యాలూ ఏర్పడ్డాయి బ్రహ్మాండమైన సెట్టింగులకు అవకాశం దొరికింది రకరకాల దుస్తులను అతిచక్కగా ఫోటోగ్రాఫు చేయవచ్చు ఇక్స్పెన్స్ పెరిగిందేమో చిత్రాలఖర్చు పెంచే అవకాశం దొరికింది ఇంతసబబ్బా, ఇన్ని సదుపాయాలూ వృధా చేసి ఏసాంఘికసమస్యతోనో ప్రేక్షకుల నలరించవలసిన ఖర్మమేం? జానపద చిత్రాలయుగం ప్రారంభమయింది ఇవే మన కాస్ట్యూమ్ చిత్రాలు, సంగీత చిత్రాలు!

యుగప్రభావాన్ని దాటటం ఎట్లా సాధ్యమవుతుంది? అందుచేతనే ఈ యుగంలో తీసిన "పల్నాటియుద్ధం" అన్న చారిత్రక చిత్రమూ, "ధర్మాంగద" అన్న పౌరాణికచిత్రమూ జానపదచిత్రాలలో జమఅయినాయి దీని ప్రభావం ఈనాడు తనే సాంఘికచిత్రాలపైనకూడా ఉండి తీరుతుంది "స్వర్గసీమ" లోనూ, "ద్రోహి" లోనూ చూసిన సెట్టింగులూ, దుస్తులూ జ్ఞాపకం తెచ్చుకోండి అవి జానపద యుగం నాటివి - సాంఘికవాస్తవికత వాటిలో ఏమీ లేదు



టి. యన్. టి. వారి "అదృష్టదీపుడు"లో ముక్కామల కృష్ణమూర్తి, అద్దాల నారాయణరావు.

పర్యవసానమేమిటంటే

చిత్రనిర్మాతలు ఏచిత్రాలు తీయాలి? ఏ చిత్రాలు తీయటం మంచిది? ఏ చిత్రాలు తీస్తే ఎక్కువ గిట్టుబాటు అవుతుంది? ఈ సమస్యలకు సరిఅయిన సమాధానాలిచ్చే శక్తులు వేరే ఉన్నాయి ఆ శక్తులను ప్రతిఘటించి ఎవరూ జయించలేరు వాటిని అర్థం చేసుకుని వాటికి తల ఒగ్గినవారు ఇవాళ పౌరాణికచిత్రం తీయవచ్చు, చారిత్రక చిత్రంకూడా తీయవచ్చు కాని అంత మాత్రంచేత ఇది జానపదచిత్రాలయుగం కాదని రుజువుచేశామని మాత్రం ప్రగల్భాలు కొట్టరాదు ఇది జానపదచిత్రాల యుగం - అంటే, పాటల, డాన్సుల,

రుద్రమదేవి

(13-వ పేజీ తరువాయి)

అంతలో సభాబహిరంగణమున నుచ్చైస్స్వరముతో జయఘోష వినవచ్చెను. దౌవారికుడు వెంటనే మహారాజులకు కైరిగించెను:

జన్నిగదేవులు జటావర్మ సుందరపాండ్యుని విక్రమసింహపురమునుండి పారద్రోలిన విజయవార్త గొని త్రిపురాంతకుడును అంబదేవుడును స్వయముగా సభాప్రవేశము జయఘోషలతో కాంక్షించుచున్నారు. సభయంతయు వికసించెను. వారిని వెంటనే ప్రవేశపెట్ట ననుమతి యైనది.

"దిగ్విజయీభవ రుద్రదేవమహారాజ!" అనుచు త్రిపురాంతకుడును, అంబదేవుడును ఉత్సాహాతిశయములతో సభలో ప్రవేశించి మహారాజులకు మ్రొక్కి జయజయనినాదము లొనర్చిరి.

వంది రుద్రదేవమహారాజుల దిగ్విజయయాత్ర వర్ణించెను. పల్లవ కొప్పెరుంజింగడు పరాభూతు డయ్యెను. మహారాష్ట్ర మహాదేవుడు వన్నెచ్చి పారిపోయెను. కళింగబలములు కొంది శీకము లయ్యెను. సుందరపాండ్యుడు తరిమివేయబడెను. చోళ సామంతులు శిక్షింపబడిరి. కర్ణాటులు కదలలేకైరి. ఆరునెలలలో కాకతిసామ్రాజ్యము శ్రీ రుద్రదేవమహారాజుల భుజస్తంభము లాశ్రయించి సుస్థిరశ్రీ వహించినది.

మహానందముతో నానాటి యుదయసభ ముగిసెను.

మరల సాయంకాలమున విజయసభ ప్రారంభమైనది. దానికి విజయదశమినాడు తాము పొందిన జమ్మిపత్రములు తమ వక్షో భాగముల నలంకరించుకొని మహారాజ మంత్రి సామంత దండనాథులు విచ్చేసిరి.

త్రిపురాంతకుడు సిద్దయదేవచోడని పత్రము ధరించెను. అంబదేవుడు, ఎఱువమల్లిచోడ, కేశవదేవ, సోమిదేవ, అల్లుగంగు, మల్లికార్జున, దామోదర, నాగదేవ నామాంకితములగు పత్రములు ధరించి పత్రసంకీర్ణుడై కనిపించెను. వ్యాకరణబ్రహ్మయగు కొలని రుద్రుడు, కళింగరాజ మురారిదేవ పత్రములు ధరించెను. అన్న మంత్రి హరిహరదేవపత్రము ధరించెను. జన్నిగదేవుడు సభకు రాలేనందున, నాతని గురువులగు శాంతపూర్వ శివదేశికు లాతడు సంపాదించిన కొప్పెరుంజింగ సుందరపాండ్యనామాంకిత పత్రములు తన సమీపమున కలశలో ప్రదర్శించెను.

శ్రీ రుద్రదేవమహారాజులు స్వయముగా వీరభద్రనామాంకితమగు పత్రమును, మహారాష్ట్ర మహాదేవ నామాంకిత పత్రమును ధరించిరి. ఈ సాయంకాలసభకు చాళుక్య వీరభద్రేశ్వరుడు రాలేదు. జీవచ్ఛవము లిక్క నిక్కడ నేటికి?

ముందు కార్యభరణుడగు దామనామాత్యుడు శ్రీ రుద్రదేవ మహారాజులు తాము మహారాష్ట్ర మహాదేవరాజునొద్ద నపరాధముగా గొనివచ్చిన కోటి సువర్ణములలో ఏబదిలక్షల సువర్ణములను ఆ యుద్ధములో పాల్గొనిన సైనికులకు యథార్హ విధమున పంచిపెట్ట దలచిరని ముందు ప్రకటించెను. అందులో వీరశైవవీరులకు లక్ష సువర్ణములు నిర్దేశింపబడినవి.

ఆయెడ తిక్కనసోమయాజులు మహారాజులు పంపిన యాందోళికపై సభాస్థానమునకు విచ్చేసిరి. వారివెంట కేతనయు గురునాథుడును, మారనయు నేగాక గోవిందశర్మయు మరియు కరణవిద్యలో నుత్తీర్ణులైన పలువురు వేదవిప్రులును అనుగమించిరి. వారికెల్లరకు నుచితాసనము లొసంగబడెను.

ముందు కార్యభరణుడు కృష్ణా, గోదావరీ మండలములలోనను గొంటూరుమండలమునను — అనగా వెలనాటియందెల్ల — కరణములు నమ్మరానివారుగా నున్నందున వారిపై కొఫ్రుగా మరి యొక కరణమునుగూడ ప్రతియూరను నియోగింప మహారాజు లాలోచింప నున్నారని విశదపరచెను.

అంతవరకు ఎక్కువ కల్పించుకొనని జాయపనాయకు డప్పుడిట్లు చెప్పెను:

"మన భద్రభూపాలుడు — నేను స్వతంత్రముచే బద్దెన యందును! — ఈ సందర్భమున నొక పద్యము చెప్పినాడు. అతడు ఋషివంటివాడు. అతి డుపదేశించు నీతి సుమతులందరు గణింపదగినది. ఏది, బద్దెనా, మహారాజులకు వినిపించు!"

చిరునవ్వుతో మహారాజు లనుమతించిరి.

సిగ్గుతో బద్దెనకు ప్రాణము పోయినట్లయ్యెను. అయిన నేమి చేయగలడు? రాజాజ్ఞయాయెను. అత డిట్లు చదివను.

"ఒక యూరికి నొక కరణము
నొక తీర్పరి యైన గాక నొగి దఱుచైనం
గకవికలు గాకయుండునె
సకలంబును గొట్టువడక సహజము, సుమతీ!"

ఆ పద్యమును సభయంతయు మెచ్చుకొనిరి.

మహారాజులతో కార్యభరణుడు ఆలోచించి మహారాజుల నిశ్చయ మిట్లు తెలియజేసెను.

"ముఖ్యముగా వెలనాటియందును, మరియు నితర గ్రామములను ఇప్పటిలో విశ్వాసపాత్రులు కానివారి కరణముల నందరను తొలగించి వారి స్థానములలో ఈ బ్రాహ్మణకరణములను నియోగింప నిశ్చయించినాము. గ్రామములలో నీసామ్రాజ్యకోశరక్షణ భారమంతయు నికముం దీ విప్రోత్తములే భరింతురు గాక!"

ఆ పిమ్మట మహారాజులు తిక్కనసోమయాజుల సంబోధించి వారిని గురుదక్షిణ కోరుకొమ్మని యర్థించిరి. "వెనుక మా మంత్రి సామంత దండనాథులు గురుదక్షిణ కోరుకొమ్మన విద్యాంతమందు గదా గురుదక్షిణ యంటిరి. మా మంత్రి సామంత దండనాథులకు గురువులైన మీరు మాకును గురుస్థానీయులే!"

తిక్కన సోమయాజులు ప్రత్యుత్తర మిచ్చెను.

"మా యల్లుడు మనుమసిద్ధిలోపము లేమైన నున్న క్షమించి యాతనికి మరల విక్రమసింహపుర రాజ్య మాతనికి దయచేయించుటే మేము కోరగల గురుదక్షిణ!"

మహారాజు: "అది పూర్వమే నిశ్చితమైనది! మీరు కోరుకొన నక్కరలేదు! మరియొకటి కోరుకొనవలెను!"

తిక్కన సోమయాజులు చిరునవ్వుతో నిట్లనెను: "మా అన్నమంత్రీశ్వరునకు మీ గాదిలిసుతయగు రుయ్యమ్మ నిచ్చి వివాహము చేయవేడెదను. అది బాలవీరుని వేషముతో అన్నమంత్రి ననుగమనించి యుద్ధమున నెంతయో సహాయపడినది!"

మహారాజు: "అదియు ముందే నిశ్చితమైనది. మీ వియ్యపురాలికి చెప్పి యొప్పించినాము. మరియొకటి కోరుకొనుడు."

తిక్కన: "అట్లా? ఐనచో అన్నమంత్రీశ్వరుల కూతును బాలను మా మారన కిప్పింపుడు!"

మహారాజు: "అదియు నీ యుదయమున పూజ్యురాలగు గౌరమ్మయొద్ద నిశ్చితమయినది. మరియొకటి కోరికొనుడు!"

తిక్కన: "అట్లయినచో మరియొకటి కోరుకొన నాకు కోరికలు లేవు."

అంతలో ఆంధ్ర బాలబాలికలు చిన్న విల్లంబులు పూని విలాసముగా బుక్కాయికొట్టుచు సభాస్థానమున ప్రవేశించిరి. వారి సాహస మేమి?

"క్షంతవ్యులము! శ్రీ రుద్రదేవమహారాజుల దిగ్విజయవార్తలతో ఆనంద ముద్వేల మయినది. మరియును మీ యీడుగల శ్రీ ప్రతాపరుద్ర కుమారులను మీరు దత్తస్వీకార మొనర్చి భావి ప్రభువులనుగా నిర్ణయించిరను వార్తయు వీధివీధుల పాకి పోయినది. మా సాహసము క్షమింపుడు!"

'వారిలో నగ్రగామి యిట్లనెను. ఆ పిమ్మట నా బాలబాలికలు శ్రీ విశ్వేశ్వరశంభుదేశికులను, తిక్కనసోమయాజులను మాత్రము పరిహరించి సభాసదుల కందరకు బుక్కాపొడితో మర్యాద చేసిరి. వృద్ధులగు గణపతిదేవ చక్రవర్తులే ఒక్క క్షణము ఆ బుక్కాయితో యువకునివలె చూపట్టిరి. శ్రీ రుద్రదేవమహారాజులు నిత్యయౌవన మూర్తియై శోభిల్లినది.

అంతట నా బాలబాలికలు, ఆంధ్రభూమిలో చిరకాలము సంప్రదాయ సిద్ధముగా వచ్చుచున్న యీ పద్యముతో, అఖిల సామంత మంత్రి దండనాథ పండిత పరివృతులగు శ్రీ రుద్రదేవమహారాజుల, నిట్లాశీర్వదించిరి.

"ధరసింహాసనమై, నభంబు గొడుగై,
తద్దేవతల్ భృత్యులై,
పరమామ్నాయము లెల్ల వందిగణమై,
బ్రహ్మాండ మాకారమై,
సిరి భార్యామణియై, విరించి కొడుకై,
శ్రీగంగ సత్పుత్రియై,
వరుసన్ నీ ఘనరాజసంబు నిజమై
వర్ధిల్లు, నారాయణా!"

సరిగా నా సమయముననే శ్రీ రుద్రదేవమహారాజులకు స్వయంభూనాథభక్తులగు కాంబోడియా ప్రభువు లంపిన కానుకలు రాయబారులు వచ్చి సమర్పించిరి.

అంతట మహారాజు తిక్కన సోమయాజులను వారు రచించుచున్న యాంధ్ర మహాభారతమునుండి తమకు రాజ్యపరిపాలనమున నుపదేశముగా నుండగల ఘట్ట మొక్కటి వినిపింప నర్థించిరి. సభ యుత్కంఠతో నిశ్శబ్దమయ్యెను. ఒక్క క్షణము ధ్యానించి సోమయాజులు మారనయొద్దనున్న కోశము గ్రహించి కోశపూజ యొనర్చి తన దివ్యకంఠముతో నిట్లు వినిపించెను.

"వ. జనకచక్రవర్తికి నొక్క బ్రాహ్మణునకుం గలిగిన సంవాదంబు సెప్పెద నాకర్ణింపుము. జనకుడు తన కట్టెగు బ్రాహ్మణుండు గొఱగామి సేసిన నతనితో నీవు నా విషయంబున వచియింప వలదు పొమ్మనిన నతండు,

"క. నీవిషయ మెంతవట్టిది
యేవిని పరవిషయమునకు నేగెద దెలియం
గా వినిపింపు మనుడు నా,
భూవల్లభు డూరకుండె బుణ్యచరిత్రా!"

"ఆ. ఊరకుండి మూర్ఛనూని యొక్కింత సే
పునకు దేఱి యిట్టు లనియె నాదు
తాత తండ్రితరము ధరణి మద్వశ్యత,
నుండె నాకు మమత యొలయదంగు.

"వ. మిథిల సెప్పుడు వసియించెద. నిప్పురంబును మదీయంబని యంగీకరింపంబడదు కావున నిది నా విషయం బనలేమిం జేసి మున్ను నీతో నాడినమాటం బుట్టిన వగపెంపున మూర్ఛ వచ్చె ననిన విని యవ్విప్రుం డా భూవిభు నాననం బాలోకించి.

"క. నరనాయక నీ యేలెడు,
పురమున భూమిని మమత్వ బుద్ధిగలుగ కి
ట్లిరవై యుండుటకు గతం,
బరయగ నెద్ది వినిపింపు మది విశదముగన్.
"వ. అనుటయు న జ్జనపతి యతని కిట్లనియె."

"తే. అరయ నివి యెట్లు సెడియెడు నవియ కావ
వినుము మద్ధన మిది యని వీనిలోన
నొకటియందు నంగీకార మొలయ దెల్ల
విషయమును నా యదియ యను విధము గలదె.

"వ. ఎట్లంటేని ఘ్రాణాదులకు గోచరంబు లయినను గంధాదులు సెడంగలయవి గావున నాయవి యనకుండుటం జేసి భూమ్యాది భూతంబులు నాచేత నిర్జితంబులై మద్వశగత్వంబు నొందియుండు.

"చ. అనవుడు బ్రాహ్మణప్రవరు డల్లన నవ్వుచు నిన్ను నారయ
న్మనమున వేడ్క పుట్టినరనాయక వచ్చితి నేను ధర్ముడం
బనుపడు నివ్వివేకపరిపాకము గాఢనిగూఢభావ మొం
వి నిలుచుగాత నీదగు మదిన్ సతతంబును శాంతికారియై!"

సంపూర్ణం.

నిపుణుల సలహాలు:

కే. డీ. నంబర్ వన్

"అంగారకుడు"

ఈ మధ్య మా 'విశ్వరూపం' సంపాదకుడుగారు నాకు ఒక చిన్నపని తగిలించాడు. నాలుగేళ్ళకిందట దేశమంతటినీ మారుమోగించిన కోటయపాలెం దోపిడికేసునాయకుడు, రాములు ఆ వేళే విడుదల అవుతున్నాడు. అతడు మళ్ళీ అంతర్ధానమయే ముందే కలుసుకుని ఒక ఇంటర్‌వ్యూ ప్రకటిస్తే బాగా ఉంటుందని ఆయన అభిప్రాయపడి, ఆ పని నాకు పురమాయించాడు.

అధికారులను విచారించి, విడుదల జరిగే సమయానికి జైలుకి ఎదురుగా ఉన్న చెట్ల క్రింద పచారు చేస్తున్నాను. టైము కాంగానే బయటికి వచ్చాడు రాములు, గేటుదగ్గిరి పోలీసులతో పరాచికాలాడుతూ.

అతను ఇవతలికి రాంగానే దగ్గిరికి వెళ్ళి "మీతో కొంచం మాట్లాడాలి. అటు వస్తారా?" అని అడిగాను.

రాములు నన్ను ఎగాదిగా చూసి "ఏం బాబూ! ఏ కేసులో ఇరికించి నన్ను మళ్ళీ జైలుకి పంపాలని చూస్తున్నావ్?" అని అడిగాడు.

"అబ్బె బ్బే! అట్లాంటి దేమీ కాదులెండి, రాములుగారూ! విశ్వరూపంపత్రిక పేరు విన్నారు కాదూ?"

"ఆ, సదువుతునే ఉంటాను లెండి."

"నేను ఆ పత్రిక్కి విలేఖరిని. మీకు తెలుసుగా, కోటయపాలెంకేసులో మీ పేరు దేశమంతా మారుమోగిందని. ఇప్పుడు మీరు ఘరానానాయకులతో సమానమైనారు. అందుకని మిమ్మల్ని కలుసుకుని మీరు చెప్పిన నాలుగు ముక్కల్ని ప్రకటిద్దామని వచ్చాను."

"ఓహో! అదా సంగతి?"

* * * *

వాల్‌టాక్స్‌రోడ్డు కాఫీహోటల్లో అవశ్యాలు ముగించుకుని, మోర్ మార్కెట్ పక్కనవున్న పచ్చికమీద చతికిలపడ్డాము.

"అయితే, ఇంతకూ మీకు కావలసింది యేంటండీ?" అన్నాడు రాములు.

"ఏవో మీ అనుభవాలూ, ఆలోచనలూ చెప్పండి. అసలు మీరీ పనిలో ఎందుకు దిగారు?"

"మాది రెక్కలు విరుసుకుని బతికే సంసారం. మా అమ్మకు గంపెడుమంది పిల్లలు. అంతా యేదో గాలికి బతికేవోళ్ళం. నేను కార్లస్టాండుదగ్గర సామాన్లు మోసేవోణ్ణి. అప్పుడు నాకు దొంగతనమంటే అసహ్యంగా ఉండేది."

"మరి దాన్నెందుకు వొదిలేశారు?"

"మావూరి యూనియన్‌కి ఒక తలతిక్కాయన ప్రెసిడెంటుగా వొచ్చాడు. తన ప్రెసిడెంట్‌గిరీకి గుర్తుగా యేదయినా చెయ్యాలనుకునేవాడు. సివరకి కూలీలందరికీ లైసెన్సుపద్ధతి పెట్టించాడు. జబ్బుపడ్డ మూలాన దాన్ని తెచ్చుకోలేకపొయ్యాను. అప్పుడు ఒకవీధి మిటాయికొట్టాయన్ని బతిమలాడుకుంటే, ఆయన మసాలాగారెలు, పునుగులు అమ్మేపని ఇచ్చాడు. పార్కులో వాటిని అమ్ముకుంటూ కొన్నాళ్లు బండి యీడిచాను."

"ఊఁహూఁ"

"కాని మావూళ్ళో మార్వాడీ హోటల్ షావుకారికి కూడ పార్కులో మిటాయి బేరాన్ని నడపాలని బుద్ధిపుట్టింది. పార్కులో కొట్టు పెట్టటానికి లైసెన్సు తీసుకున్నాడు. అయినా మేము అక్కడక్కడ తిరిగిఅమ్ముకునేవోళ్ళం. ఇది చూసి వాడికి కళ్లుకుట్టినయ్. లైసెన్సు కట్టి తాను అమ్మేచోటికి లైసెన్సులేనోళ్ళను రానియ్యొద్దని అర్జీ పెట్టుకున్నాడు. లచ్చలు మూలిగే మార్వాడీకి లైసెన్సు దండగని మూశారేకాని మాబోటి అలగాజనం పాతిక, ముప్ఫయిమంది అల్లాడతారని అధికార్లు సూడలేదు."

"అవునవును. మద్యనిషేధమంటూ పెట్టి సారాకంట్రాక్టర్లకు ఏదో దారి చూపించారు కాని లక్షలకొద్దీ ఉన్న కల్లు గీతగాళ్ళ అతీగతీ చూశారూ?"

"మహ బాగా జెప్పారు. అంతటితో మనం చేసే దేమీ లేక, మనసంతా సంపుకుని ఒకళ్ళింటో చాకిరికి కుదిరాను. ఇచ్చే నాలుగు రూపాయలకు పాణాలు తోడెయ్యటమే కాకుండా, సివరికి దొంగతనంకూడా అంటగట్టారు. దాంతో మనబతుకు పోలీసోళ్ళపాలయింది."

"అంటే?"

"యేముంది? యెక్కడేది జరిగినా, ముందు మన గొంతుకే ఉరి. వూళ్ళో ఎక్కడ దొంగతనం జరిగినా, ముందు మన వోళ్లు వాసిపొయ్యేది. అసలు పోయిన వస్తువును ఇంటాయన కొడుకే ఎత్తికెళ్ళి, కిళ్లీ కొట్టు బాకీలకింద చెల్లబెట్టాడు. ఈసంగతి ఊరందరికీ తెలుసు. అయితే యేం? కే.డీ. అని పేరుపడ్డ నాకు ఒక్కళ్ళూ పని ఇయ్యలా. వొచ్చినపేరు రానే వచ్చింది. పస్తులుకూడా ఎందు కుండాలని, ఇందులోకి దిగాను."

"మీ వృత్తిలో తరగతులేమయినా ఉన్నయ్యా?"

"ఆ! చాలా ఉండయ్. జేబులు కొట్టటం, బురిడీవేసి బోల్తా కొట్టించటం, బడి పిల్లలని మోసం చేయటం, యీలు దొరికితే దార్లు కొట్టటం, ముటాలుగా చేరి బందిపోట్లు చేయటం-యిట్టాగే ఎన్నోరకాలు ఉండయ్."

"ఇందులో మీకేది ఇష్టం?"

"జేబులు కొట్టటమేనండీ?"

"ఎందుకని?"

"దొంగతనాలన్నిటిలోకీ అది రాజా అయిందిలేండి. ఎంతో జాగర్తగా, మెలుకువగా ఉంటే కాని సెయ్ తిరగదు. అసలు దానికి ఆర్భాటమే అక్కర్లా. కొంచం కళ్లుతెరిసి, కొంచం చెయ్‌మలిపితే సరిదజ్జాగా బతకొచ్చు."

"ఆఁ?"

"మరి యేంటనుకున్నారు? జేబులు కొట్టెయ్యటంలో మొనగాడయినాడంటే, ఆడు అందరికీ గురువయినా డన్నమాటే. ఆరితేరిన జేబుదొంగ పులినోట్లో కండను గూడా, దానికి తెలియకుండా తీసుకురాగల్డు."

"జేబులు కొట్టటం వెనకటంత సులభం కాదేమో?"

"అ్రరరే! యిప్పుడే సులభమయిందండీ. యెనకటిగోజుల్లో డబ్బు ఉందంటే, తలగుడ్డలో వేసికట్టుకోటమో, గొండినసంచీలో పెట్టటమో, సొక్కాలోపలి జేబులో పెట్టి కుట్టుకోటమో చేసేవోళ్లు. అది కొట్టెయ్యటమంటే భల్ కష్టంగా ఉండేది. యిప్పుడేముంది? లాల్చీజేబులు, యెనకజేబులు, పంట్లాంజేబులు, అసలు జేబే లేకుండా పర్సు సేత్తో బట్టుకొని ఊసులాడుకుంటూ పొయ్యేవాళ్లూ యిప్పుడు శానా చులకనయింది లేండి.

"పైన కోటు తొడుక్కుంటే?"

"హి హ్హి హ్హీ! ఛవరంజేసుకునే బ్లేడ్లున్నయ్ చూశారూ, అవీ, కత్తెర్లూ, అప్పుడు బలేపని జేస్తయ్‌లేండి. మా స్నేయితుడు ఒకడుండాడు. వాడు ఒక బ్లేడ్ తీసుకుని రైళ్ళలో తిరుగుతుంటాడు.

ఓరి నాయినో, వాడి సంపాదన చూస్తే కళ్లు తిరుగుతయ్.''

"అఁ! అంతవాడా!''

"అవును. మీరు డబ్బు కోటులోపల సొక్కా జేబులో పెడితే, వాడు బ్లేడును ఒక్కసారి పర్రుమనిపిస్తాడు. అంతే. కోటూ, సొక్కా, రెండూ తెగిపోవాల్సిందే. చేతులకు రిస్టువాచీలు పెట్టుకుని కొంచం కళ్లుగూశారూ అంటె, తోలు పటకా సర్రుమని తెగిపోవటం, గడియారాన్ని మావోడు అంచెలమీద పంపించెయ్యటం జరుగుతుంది.''

"రైళ్లలో ఆ పని చులకన అవుతుందా యేమిటి?

"అవునండీ, జనంతొక్కిడి ఉంటుందా? టిక్కెట్లకాడ 'క్యూ' లూ 'బో' లూ ఉంటయ్యా? ఒకడి యెనకాల ఒకడు తొక్కుకుంటూ 'క్యూ'లు నడిసేటప్పటికి ఎన్ని జేబులయినా కొట్టొచ్చు. బండి ఎక్కేవోళ్లూ, దిగేవోళ్లూ మనకే సాయపడతారు. అట్టా బ్లేడ్ పెట్టి ఉంచితే వాళ్ళ నడకలోనే పని జరిగిపోతుంది ''

"అట్టాచేస్తే పట్టుబడరూ?''

"జేబుకొట్టేవాళ్ళకి అంచెలముటా ఉంటుంది. కొట్టేసిన వస్తువుని అవతలకి చేరెయటానికి వాళ్లు ఉంటారు. ఎప్పుడయినా వీడు పట్టుబడితే జనం కొట్టకుండా చూసి, వీలయితే సర్ది చెప్పి యిడిపిస్తారు. లేకపోతే దెబ్బలు తగలకుండా చూస్తారు.

"బలే పకడ్‌బందుగా జరుగుతుందే ఈ వ్యవహారం! మిగిలిన వ్యవహారా లెట్లా నడుస్తయ్ ?"

"బురిడీ కొట్టించటంకూడా తమాషాగానే ఉంటుంది. బాంకులదగ్గిరా, 'టేషన్లకాడా, పోస్టాపీసుల్లో, సినిమాలదగ్గరా, యిది మహాజోరుగా సాగుద్ది. డబ్బు దగ్గర పెట్టుకుని దిక్కులుచూసే మడిసిని కనిపెట్టి "యిదుగో నయ్యా, వ్, లేలు!'' అంటాం. ఆయన యెగిరిపడి మళ్ళీచూస్తే, మేమూ ఉండం, ఆయన డబ్బూ ఉండదు. యిట్టాగే యేవో మాటలుపెట్టి యేమారుస్తాం.''

"అవును. వెర్రినాగమ్మలు డబ్బు దగ్గరున్నప్పుడు జాగర్తపడకపోతే ఎట్లా?''

"ఇదిగో, యీ తమాషా యినండీ. ఆ మధ్యన అమెరికాలో ఎగిరే సాసర్లు కనిపించి నయ్యని రాశారే, అప్పుడు జరిగిందంట యిది. దచ్చిణ అమెరికాలో ఒకసోట, ఒక రోజున సాలామంది పిచ్చోళ్లుజేరి ఆకాశమంతా సాసర్లకోసం యేగాదిగా చూస్తున్నారంట. అప్పుడు మావాడొకడు ఒకాయనదగ్గర డబ్బున్నట్టు కనిపెట్టి "అదిగదుగో సాసర్ అని అరిచాడంట. ఆ పెద్ద మడిసి ఆకాశమంతా ఎతికి నేలమీదికి చూసేటప్పటికి మనవాడు పర్సుతో ఉడాయించాడు.

"మీరు ఆశే చదువుకోలేదే. ఈ సంగతులన్నీ యెట్లా తెలిసినయ్ ?"

"మన నల్లోడు రాజ్యానికి వచ్చింతరవాత అన్నిటితోపాటు జైళ్లుకూడా బాగు పడ్డయ్‌లేండి. యిప్పుడు వాటినిండా సదువుకునోళ్లూ, పెద్ద ఆలోశన్లు చేసేవోళ్లూ యెక్కువగా కనిపిస్తుండారు. అందులో ఒకాయన నాకీ సంగతులన్నీ చెప్పేవాడు. సదవటంకూడా ఆయనే నేర్పాడు."

"సరే, మీ మూడోతరగతి ఎట్లా నడుస్తోంది ?"

"బళ్ళోకి పొయ్యే పిల్లలదగ్గరి కెళ్ళి మిటాయి పెడతామనో, వాళ్ళ అమ్మమ్మ పిలుస్తుందనో చెప్పి మాయపుచ్చి తీసుకెళ్ళేదీ, సొమ్ములు వొల్చుకుని పంపించేది. పొరుగూరువాళ్లు వొచ్చి ఏదయినా అడుగుతారనుకోండీ, వాళ్లని అటుయిటూ తిప్పి. యే సందులోనో నాలుగు వొడ్డించి ఉన్నది ఉడబీక్కోటం- యిట్టాగే అన్నీ."

"నోరులేని పిల్లల్నీ, అమాయకుల్నీ మోసం చేయటం పాపం కాదండీ ?"

"హాహ్హాహా! పాపమేంటండీ? ఈ పెద్ద మడుసులంతా చేసేది యేంటి? నేను మూటలు మోసినప్పుడు అనుభవమే. మెడలు యిరిగే బరువుపెట్టి, కనపడ్డ కనకయ్యతో నల్లా బాతాఖానీకొట్టి, సివరికి అణా డబ్బులు యిచ్చేవోళ్లూ. కుర్రవెధవననీ, నోరూ వాయీ లేదనీ నన్ను పిలిచేవోళ్లు కాని, బలం కల పెద్దోడు పక్కనున్నా పిలవరు. వోళ్లు యిరుసుకుని చాకిరిజేసే బిడ్డతల్లి, పిల్లకు పాలిచ్చుకుంటుంటే, కొంప మునిగినట్టుగా రంకెలు పెడతారు అమ్మతల్లులు! బాబూ, పిల్ల పాలులేక సచ్చిపోతుంది. ఒక్క పాలడబ్బా అయినా ఇయ్యండీ' అంటే పెట్టెలకు పెట్టెలు దాసుకుని, అయిపోయినయ్ అంటారు షావుకార్లు. యీళ్లందరికీ లేనిపాపం మాకేనా?"

"నిజమే నువ్వు చెప్పింది. కాదనలేం... అయితే బందిపోట్ల సంగతి యేమిటి?"

"మడిసికి బొత్తిగా తిండిలేకపోతే రెండే పన్లుజేస్తాడు. ఉరి తీసుకుని సావటమో, లేకపోతే సావటానికీ సంపటానికీ సిద్ధపడి తిండి సంపాయించుకోటమో చేస్తాడు"

"అది అబద్ధం. ఆకతాయివెధవల దుర్బోధనలను విన్నవాళ్లు తప్ప ఇంకెవ్వరూ ఆ పని చెయ్యరు."

"కూలినాలిజనమే ఆకతాయోళ్ల మాట ఎందుకు యినాలి? కంపెనీలనీ, బాంకుల్నీ దివాలాతీయించి లచ్చలాది జనాన్ని ముంచే ఘరానామడుసులూ మీబోటి గొప్పోళ్లూ, డబ్బుకోసం యెన్నయినా చేస్తారే; ఆకతాయోళ్ళమాటలు ఎందుకు యినరు?"

"తప్పు కనుక "

"అప్పుడు మీరు చేసేదేంటి? పెళ్లాం బిడ్డల్ని బావిలోతోసి మీరు దూకుతారు. లేదూ - ఉరిపోసుకుని పెళ్లాం బిడ్డల్ని లోకంపాలుచేసి పోతారు. అదీకాకపోతే యీదుల్లో పడతారు అంతేనా?"

రాములు చెప్పింది నసాళానికి అంటింది. ఇంక అతనితో వాదించి లాభంలేదని ఇట్లా అన్నాను.

"నిజమేనండి. మీరు చేసేది మహ గొప్ప సంగతే."

"మరి యేమనుకున్నారు? అందుకనే మన పూర్వీకులు మా విజ్జను అరవైనాలుగు కళల్లోనూ మొదటిదానిగా జమకట్టారు." అని మీసం మెలేశాడు రాములు.

"అయితే మాపత్రికద్వారా ప్రజల కేమయినా సందేశం ఇస్తారా?" అని అడిగాను.

"ఓ! రాసుకోండి. "భారతీయులు అరవై నాలుగు కళల్నీ పోషించి పూర్వీకుల పేరు నిలబెట్టాలి - అది సరేగాని మీకొకవిషయం చెపుతానండీ."

"మా వృత్తిలో షోమా షోమీలు ఉన్నారు. వాళ్లని ఉపయోగించుకుంటే ప్రపంచమంతా పట్టం కట్టుకోవచ్చు."

"అది ఎట్లా వీలవుతుంది?''

"జూదాల్లూ, గుర్రప్పందేలూ, పెర్కులేషన్ - యీటిల్లో మావోళ్ళను ఉపయోగించుకుంటే ప్రభుత్వమే చేతికి వొస్తుంది. దానికి అమెరికాలో 'పెషల్ ట్రెయినింగ్' ఇస్తారంట!"

"నిజం ?"

"మీతో పరాసికాలా? ట్రెయినింగు అయింతరవాత నాకాడికి రాండి. అంతా నేను నడిపిస్తా. జగత్ బిత్తర్ రాములు, కే. డీ. నంబరు వన్ అని అడిగితే, యెవ్వరయినా మిమ్మల్ని నాకాడికి తీసుకొస్తారు... ఇంక సెలవిప్పిస్తారా? మా వూరిబండికి టయిమయింది" అంటూ లేచాడు రాములు.

సుహాసిని కథ

(26-వ పేజీ తరువాయి)

అన్నది. వాళ్ళఅమ్మని చూడగానే సుహాసిని కావిలించుకుని ఎంతో ఏడ్చింది.

వెంటనే సుహాసిని పరుగెత్తుకుని వెళ్ళి చేతికందిన పెద్ద గుమ్మడి కాయ కోసికొనివచ్చింది.

"వెళ్ళి వంటఇంట్లోని ఎలుకల బోను తీసుకురా"

సుహాసిని మళ్ళీ పరుగెత్తుకుని వెళ్ళి బోను తీసుకువచ్చింది. బోనులో ఆరు చుంచు లున్నాయ్. వాటిని గుమ్మడికాయకు కట్టింది కొత్తావిడ. ఒక ఎలుకను గుమ్మడి కాయమీద కూర్చోబెట్టింది. వెనుక రెండు చుంచులని నిల్చోబెట్టింది. తరవాత ఆమె తనచేతిలో వున్న మంత్రదండం వూపింది. వెంటనే గుమ్మడికాయ ఒకపెద్ద బండిగా మారిపోయింది. ఆరు చుంచులూ ఆరు గుఱ్ఱాలుగా మారాయి. ఎలుక బండితోలేవాడుగా మారింది. వెనక చుంచులు రెండూ నౌకర్లుగా మారాయి.

"చూడు. నిన్ను తీసికొని వెళ్ళటానికి ఆరుగుఱ్ఱాల బండి వచ్చింది" అన్నది.

"బాగానేవుంది. కాని మంచి బట్టలు లేవుగా మరి" అన్నది.

అమ్మ చేతిలోని మంత్రదండం మళ్ళీ ఆడించింది. సుహాసిని ఒంటి మీద చింకిగుడ్డలన్నీ రత్నాలతోను, వజ్రాలతోను, బంగారు-వెండి లేసులతోనూ పొదగబడిన దుస్తులుగా మారిపోయాయి. ఆమె కాళ్ళకు ఈ ప్రపంచంలో లేనట్టి అద్భుతమైన అందమైన గాజు చెప్పులు వచ్చాయి.

"ఇప్పుడు నీవిక నృత్యానికి వెళ్ళవచ్చు. కాని ఒకమాట గుర్తు వుంచుకో. రాత్రి పన్నెండు గంటలు దాటకముందే ఇంటికి వచ్చెయ్. లేదా అన్నీ యథాప్రకారంగా మారిపోతాయ్. ఈ విలువైన బట్టలన్నీ మాయమైపోతాయ్. జాగ్రత సుమా" అని హెచ్చరించిందిఅమ్మ.

సుహాసిని అమ్మ చెప్పినట్టు చేస్తానంది. బండి ఎక్కి కూర్చుంది. నౌకరు బండి తలుపువేశాడు. బండివాడు కొరడా విదిలించాడు. బండి వెళ్ళిపోయింది.

సుహాసిని రాజభవనం చేరగానే కోలాహలం పెద్దదయింది. ఆ ముద్దుముఖం—ఆవిలువైన బట్టలూ ఇదివరకెప్పుడూ ఎవరూ చూసి వుండలేదు. దూరదేశంనుండి వచ్చినట్టుంది అనుకున్నారు. ఆమెకు అందరూ దూరదూరంగా ఒత్తిగిలి దారి ఇచ్చారు. యువరాజు మన సుహాసినిని చూశాడు. చూసీ చూడగానే "ఈ అమ్మాయిని తప్ప ఇంకెవరిని పెళ్ళి చేసికో" నని అనుకున్నాడు. రాత్రంతా ఈ ఒక్క అమ్మాయితోనే నాట్యం చేశాడు. "యువరాజు తప్పకుండా ఆ అమ్మాయినే పెళ్ళి చేసికొంటాడు" అని అందరూ అనుకున్నారు.

పన్నెండు గంటలు సమీపిస్తూ వుంది. ఎంతో వ్యవధి లేదు. అమ్మ మాటలు గుర్తుకువచ్చి వెళ్ళిపోతున్నానని రాజుతో చెప్పి పరుగెత్తుకుపోయింది.

పన్నెండు అవకముందే ఇల్లు చేరుకుంది. వెంటనే గుఱ్ఱాలు చుంచులుగా మారిపోయాయి. బండివాడు ఎలుకగా మారిపోయాడు. బండి గుమ్మడికాయ అయింది. కొంతసేపటికి సుహాసిని మారుటి చెల్లెళ్ళు ఇంటికి వచ్చారు, సుహాసిని ఎప్పటిలా చింకిగుడ్డలతో పొయ్యిముందు కూర్చోవటం చూశారు.

వాళ్లిద్దరూ నృత్యశాలకు వచ్చిన ఆ క్రొత్త రాజకుమారి ఎవరా? అని చాలసేపు ఆలోచించారు. మరుసటిరోజుకూడా ఆమెను గురించే మాట్లాడుకున్నారు. కొంచెం సుహాసినిపోలిక లుండటంవల్ల మనసులో కొంత అనుమానపడ్డారు.

రెండవరోజు రాత్రి యథారీతిగా నృత్యశాలకు అక్కచెల్లెళ్ళు వెళ్ళిపోయినతరువాత దేవతారూపంలోవున్న అమ్మ వచ్చింది. నిన్నటిలాగే సుహాసిని నృత్యశాలకు వెళ్ళింది. నిన్నటిలాగే ఈ రోజూ యువరాజు ఈ రాకుమారితోనే నృత్యం చేశాడు.

మూడవరోజుగూడా ఇలాగే జరిగింది. కాని ఈసారి సుహాసిని అమ్మ చెప్పిన మాటలు ఆ వుత్సాహంలో మరచిపోయింది. ఇంతలోకే గడియారం పన్నెండు గంటలు కొట్టటం మొదలు పెట్టింది. పన్నెండు గంటలు పూర్తిఅయినట్టయితే తన వంటిమీది వస్తువులన్నీ

పాతగుడ్డలుగా మారిపోతాయి. భయపడి ఒక్క గంతువేసి ఆ గది లోంచి పారిపోయింది. యువరాజు ఆమె వెంటబడ్డాడు. యువరాజుకి అందకుండా వుండాలని శక్తికొద్దీ పరుగు పెట్టింది. ఆ సందట్లో ఆమె కాలికి వున్న ఒక గాజుచెప్పు వూడి పడిపోయింది.

యువరాజు చెప్పు తీసుకోవాలని ఆగాడు. ఇదే సందుగదా అని సుహాసిని తప్పించుకు పారిపోయింది. సరిగా వేళకే బైటపడింది. రాజభవనంబైటకు వచ్చినతరువాతే పన్నెండుకొట్టటం పూర్తిఅయింది. అన్ని వస్త్రువులు మాయమైపోయాయ్. తనూ - చింకిగుడ్డలతో తయారైంది.

యువరాజు కలయవెతికాడు. ఆ రాకుమారిజాడలు కనపడలేదు. కోటకావలివాళ్లను అడిగాడు. "మేమెవరినీ చూడలేదు. చింకిగుడ్డలు కట్టుకున్న ఒక వంటమనిషిని మాత్రం చూశాం" అన్నారు. ఆ సౌందర్యవతి కాలి చెప్పుమాత్రం అతనికి పట్టుబడింది. అదితీసికొని రాజభవనంలోకి తిరిగి వెళ్ళిపోయాడు.

మరుసటిరోజు రాజుగారు "ఎవరి కాలైతే ఈచెప్పుకు సరిపోతుందో వారినే యువరాజు పెళ్ళిచేసికొంటాడు" అని టముకు వేయించాడు. ఆ దేశంలో అందరుస్త్రీలూ ఆచెప్పు వారి కాలికి సరిపోతుందేమోనని ప్రయత్నించారు. కాని ఎవరికీ సరిపోలేదు. అందరి పాదాలూ ఈ చెప్పుకంటే చాలా పెద్దవిగా వున్నాయి. చివరకు రాజభటులు సుహాసిని వుండే ఇంటికి వచ్చారు. ముందుగా మారుటి చెల్లెళ్ళలోపెద్ద అమ్మాయి ప్రయత్నించింది. కాని ఆమె బొటనవ్రేలు లావుగావుండటంవల్ల పట్టలేదు. ఆశతో కనిపెట్టావున్న వాళ్ళ అమ్మ వెంటనే పదునైన ఛాకు ఒకటి తెచ్చింది. "త్వరగా బొటనవ్రేలు కోసివేసెయ్. కుంటిగా వుంటే ఏమి పోతుంది. యువరాణివై కాలు కింద పెట్టకుండా ముత్యాల పల్లకీలోనే తిరుగుతుంటావ్." అన్నది. అమ్మ చెప్పినట్లుగానే బొటనవ్రేలు కోసుకుంది. కాని లాభంలేకపోయింది. గత్యంతరంలేక చెప్పు తన చెల్లెలికి ఇచ్చింది.

కాని ఆ అమ్మాయికీ అదృష్టం కలసి రాలేదు. ఆమె వ్రేళ్ళయితే సరిగానే దూరాయిగాని మడమ అంతా బైటవుండిపోయింది. వాళ్ళ అమ్మ మడమ కూడా కోసివెయ్యమన్నది. "నీకేం పరవాలేదు. యువరాణివైనతరువాత అసలు నీకు నడవవలసిన పనే వుండదు" అన్నది. అమ్మమాటలు విని ఈ అమ్మాయి కూడా మడమ కోసుకుంది. అయినప్పటికీ చెప్పు ఇంకా చిన్నదిగానేవుంది. గత్యంతరం లేక ఆపనినుండి విరమించింది.

ఇంతసేపటినుండి తలుపువెనకాల నక్కి చూస్తూవున్న సుహాసిని సిగ్గుపడుతూ వచ్చి "నేను వేసికొని చూడనా" అని అడిగింది. మారుటి తల్లీ, చెల్లెళ్లూ ఆమెను కొట్టి తరిమివెయ్యబోయారు. రాజభటులు అడ్డరవచ్చి. "రాజుగారు ఏ స్త్రీకైనా సరే ఈ చెప్పుతొడిగించి చూడమన్నారు" అని చెప్పి సుహాసినిని కుర్చీమీద కూర్చోబెట్టి చెప్పుతొడిగారు. ఆమెకు ఖచ్చితంగా సరిపోయింది. అందరూ ఆశ్చర్యంతో సుహాసినిని చూస్తూ నిలబడిపోయారు. ఆమె తన గౌనులోనుండి రెండవ చెప్పుకూడా తీసి తొడుగుకున్నది. ఆమి ఆ రెండు చెప్పులను ఎప్పుడైతే తొడుక్కుందో వెంటనే ఇదివరకు లాగా జిగాల్ జిగాల్ మనే బట్టలు వచ్చాయి నృత్యశాలలో చూసిన రాకుమారిలా తయారయింది.

యువరాజు పట్టరాని సంతోషంతో సుహాసినిని పెళ్ళిచేసికొన్నాడు.

ఆ మారుటి చెల్లెళ్ళు ఇద్దరూ వారు చేసిన అన్యాయానికీ, అసూయకూ ఫలితంగా కుంటివాళ్ళయిపోయారు. రోజుకి రోజూ అందవికారంగా తయారయ్యారు. కాని సుహాసిని మాత్రం భూలోకరంభలా దినదినమూ పూర్ణిమచంద్రుని లాగా మెరిసిపోతూ, భర్తతో సుఖంగా కాలం గడిపింది.

(జర్మన్ కథకు అనుసరణ)

★ దృశ్యాలు ★


కౌశిక

వీధిలో నిశీధిలో
మురప్రక్క వీధిలో
ఒంటరిగా కుంటుం డొక
లోతు కళ్ల 'బోగంది'

బొల్లారాం గల్లీలో
ఘుల్లు మన్న చప్పుడు విని
ఝల్లు మంటు త్రుళ్లా డొక
కళ్లు లేని బిచ్చగాడు '


లోకంతా కూలి చేసి
ప్రపంచాన్ని పెట్టాడు,
రోడ్డు ప్రక్క ఆకలితో
చచ్చే ఒక 'శ్రామికుడు'

రైలు క్రింద ఆత్మహత్య
రైలు వాడిక ఖాదీ స్మృతి—
మెతుకు కొరకు బ్రతుకే ఒక
పెనుకులాట, గతుకు బాట



క్లిష్ట సమస్య

ఇండో చైనాలో తికమకలాడుతున్న ఫ్రెంచివారికి తక్షణ సహాయం చేయడానికి అమెరికా వాగ్దాన మిచ్చింది. (నేషనల్ హెరాల్డ్)



బ్రిటిష్ కామన్సుసభ నూతన భవనం. ఈ సింహద్వారాన్ని
భారతప్రభుత్వం బహూకరించింది.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

ఫిలిం సంచిక

★

నవంబరు 8 వ తేది దీపావళి నాడు ఆంధ్ర సచిత్ర వారపత్రిక ప్రత్యేక ఫిలిం సంచికగా వెలువడ గలదని మా పాఠకులకు తెలియజేయ సంతసించుచున్నాము.

ఆర్టుపేపరు మీద అందమైన త్రివర్ణ ముఖ చిత్రముతోను, తెలుగు ఫిలిం పరిశ్రమకు సంబంధించిన వివిధ విషయములగురించి సుప్రసిద్ధ రచయితలయొక్కయు, ఫిలిం పరిశ్రమలో ఉన్న ప్రముఖులయొక్కయు ప్రత్యేకవ్యాసములతోను, ప్రఖ్యాత ఫిలిం తారల, డైరెక్టర్ల, ప్రొడ్యూసర్ల, చిత్రములతోను, ఈ సంచిక విషయసమగ్రమైనదై, సర్వాంగ సుందరముగ వెలువడుచున్నది.

క్రౌన్ క్వార్టో సైజున 100 పేజీలు

వెల ఒకరూపాయి మాత్రమే

చందాదారులకు ఈ మేరకు చందా గడువు తేది సవరింపబడును.

మీ సమీపమున ఉన్న మా న్యూస్ ఏజంటువద్దగాని, మాకు వ్రాసిగాని మీ ప్రతిని వెంటనే రిజర్వు చేసికొనుడు

ప్రతిసినిమా తారకు, ప్రొడ్యూసరుకు, టెక్నీషియనుకు, డిస్ట్రిబ్యూటరుకు, అసంఖ్యాకులైన ఫిలిం అభిమానులకు చేరు ఈ ప్రత్యేక సంచిక వ్యాపార ప్రకటనలకు అమూల్యమైనది.

ప్రకటన రేట్లు:

రెండు రంగులలో	పేజి 1-కి	రు 150/-
ఒక రంగులో	,,	రు 100/-
,, ,,	అర పేజీ	రు 60/-
,, ,,	పావు పేజీ	రు 35/-

మానేజరు.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras.